UNIVERSAL
LIBRARY
OU_204158
UNIVERSAL
LIBRARY

శ్రీ

వేణీసంహార నాటకము.

1895 వ సం॥ ప్రథమశాస్త్రపరీక్షకును, 1901 వ సం॥ పట్టపరీక్షకును

బరనియమముగా నిర్ణయింపఁబడినది.

ఇది

భట్టనారాయణకవికృత మైనసంస్కృతనాటకమునుండి

రాజమహేంద్రవరమునందలి రాజకీయ కళాశాలయందు

నాంధ్రపండితు లగు

వడ్డాది సుబ్బారాయకవిచేఁ

దెలిఁగింపఁబడినది.

రాజమహేంద్రవరము

వడ్డాది సుబ్బారాయఁడుగారి యుత్తరువు ప్రకారము,

రాజమండ్రి బుక్కుసెల్లర్సు,

కర్రా అచ్చయ్య అండ్ సన్సువారిచే

ప్రకటింపఁబడినది

అయిదవ కూర్పు 2000 ప్రతులు.

రాజమహేంద్రవరము

నిడమర్తి వెంకటకృష్ణమూర్తి అండు బ్రదరు వారిచే

శ్రీకృష్ణాముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడినది.

1924.

1-8-0

సర్వస్వామ్యసంకలితము.]

[వెల [redacted]

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండు స

292, ఎస్ప్లనేడు, చెన్నపురి.

వడ్డాది సుబ్బారాయకవి కృత గ్రంథమాల.

పుస్తకభాండాగారములను స్థాపించినవారల కెల్లరకు మాయొద్దనుండిన గ్రంథము లన్నియు ఒకసారి పుచ్చుకొన్నయెడల సగము వెలకే ఇయ్యఁబడును. కొన్ని మాత్రమే కావలసినయెడల వెలపూర్తిగా నియ్యవలెను.

	రు.	అ.	పై.
1. అభిజ్ఞానశాకుంతలము. (లఘుటీకా తాత్పర్యవిమర్శనసహితము)	1	0	0
2. వేణీసంహారనాటకము. (F. A. text for 1895 and B. A. text 1901)	1	0	0
3. మల్లికామారుతప్రకరణము. (శృంగారరసప్రధాననాటకము M. A. text for 1912)	1	0	0
4. ప్రబోధచంద్రోదయనాటకము. (శాంతరసప్రధానము)	0	10	0
5. చండకౌశికనాటకము. (హరిశ్చంద్రకథ) (B. A. text for 1903)	0	8	0
6. విక్రమోర్వశీయనాటకము. (శృంగారరసప్రధానము)	0	8	0
7. సూక్తిసుధాకరము. లోకదృష్టాంతసమన్విత నీతిపద్యగ్రంథము	0	12	0
8. సుగుణప్రదర్శకము. (నీతిపద్యగ్రంథము)	0	4	0
9. సూక్తిచింతామణి. (పండితభక్తమనోహరము)	0	5	0
డిటో (క్యాలికోబైండు)	0	10	0
డిటో (అట్టబైండు)	0	8	0
10. నగపత్నీకీర్తనలు. (కొత్తకూర్పు, భక్తజనమనోహరము)	0	1	0
11. నందనందనశతకము. (రెండవకూర్పు, విష్ణుభక్త్యానందకరము)	0	2	0
12. దైవభక్త్యుపన్యాసము.	0	3	0
13. ఆంధ్రమేఘసందేశము. (విప్రలంభ శృంగారవర్ణనము)	0	5	0
14. సూర్యశతకము. మయూరకవివిరచితమునకుఁ దెలుఁగుమాలసహితము	0	6	0
15. భామినీవిలాసము. (పండితరాయవిరచితమునకుఁ దెలుఁగు)	0	10	0
16. సుమనోమనోజ్ఞము. 3 భాగములు కలిసి యున్నది.	1	0	0
17. సతీస్మృతి. (కరుణారసభూయిష్ఠము)	0	4	0
18. సుతస్మృతి. కృష్ణాయాపదుద్ధారకా యనుశతకపద్యములతో.	0	4	0
19. గౌతమీమహాజలమహిమానువర్ణనము (రెండవ కూర్పు)	0	2	0
20. విశ్వరూప. నృసింహస్తవద్వయము,	0	2	0

శ్రీ

వేణీసంహారనాటకము.

ఇష్టదేవతాప్రశంసనాదికము.

శ్రీలీలాపరతంత్రుఁడై, గ్రహపిండ జ్యోమ మణ్ కాచదీ
పాళీదీప్తవితాన మై స్ఫురదుడుశ్శ్యాగారరంగంబునన్,
హాళిఁ జంగమపాత్రవర్గములు నానావేషనానారసో
ద్వేలస్ఫూర్తి నటింప హేతు వగు దేవే, ల్పాతనిం గొల్చెదన్.

ఉ. శ్రీతిక మైనయట్టి తుణభంగురకాయము హేయ మంచు, సం
ప్రీతిని వాఙ్మయాత్మకశరీరముతోడ నశేషదేశముల్
ఖ్యాతిఁ జరించుచున్, వివిధకల్పనలన్ హితబోధ సేయుచున్,
నీతికి మూల మై వసుధ నిశ్చలసత్కవిజాలం దలంచెదన్. ౨

చ. వినియెడువారికే కనెడువేడ్క యొనర్చెడుభారతార్థముల్,
గనుఁగొన నబ్బునే నని మదిఁ గల్గుడుపేరిక మేర యున్నదే?
యని తలపోసి తచ్చరిత మచ్చుపడంగను నాటకంబుగాఁ
బొనరిచి నేఁ గృతార్థతను బొందెదఁ గాకని యున్నయత్తఱిన్. 3

వ. మదీయసహకారుం డగుచేపూరి సోమయార్యుం డేగుదెంచి.

ఉ. భారత మన్న నీకుఁ గడుపక్షము; మున్వచనంపుఁగావ్యముం
గా రచియించినాఁడ; వది క్రమ్మఱ నిప్పుడు నాటకంబుగాఁ
గూర్చుట యంటి మే; లయినఁ, గ్రొత్తగఁ జేయుటకంటె వేణిసం
హారము తెల్గుసేయు మది నైకరసాస్పద మేఁ బరించితిన్. ౪

క. అనుటయు నాజలినంబున
ననుకూలమె యిది యటంచు, నాగ్రంథంబుం
దెలిఁగింపఁ దలఁచి యుండం
గను నాకస్మికము రాజకార్యముమీఁదన్. ౫

సీ. శ్రీమహాలక్ష్మీపరిగ్రహవంతుండు వాడ్రేవుకులపయోవార్ధిపూష్ణుఁ,
డమలకస్తూరివంశాంభోధిచంద్రుండు దర్పితపరచక్రతాపకరుఁడు,
పటుతరాజ్ఞారూఢిభాస్కరతనయుండు పరనిజకార్యనిర్వాహధుర్యుఁ,
డాశ్రితపోషణాయత్తచిత్తుండు పాలించితనాగసింహాహ్వయుండు,.

సరససంగీతసాహిత్యభరతవిరతుఁ,
హరిజనకల్పవల్లి సింగాంబయల్లుఁ,
అఖిలవిద్యానిధిస్థాన మైనరాణ్మ
హేంద్రపురి వచ్చి నన్ను వీక్షింప వచ్చె. ౬

వ. సముచితసత్కారంబు లంగీకరించి మదీయమనోగతం బెఱింగించిన సంతసించి.

ఉ. చిన్నటనాఁటనుండి మనచేసిడు నెయ్యముదోసమో, నిజం
బున్నదొ యిందు నే నెఱుఁగ; నోప్రియమిత్రుఁడ ! సుబ్బరాయ ! నీ
వన్నతిఁ జేయుకావ్యము లనూనసుధాలహరీసమంబు లౌ
చున్నవి నామనంబునకు; నొవ్వులకుప్పలు నీదుకబ్బముల్. ౭

శా. మాతోఁబల్కుఁడు సుందరాహ్వయుఁడు యుష్మన్మేఘసందేశముల్
చేతోమోద మెలర్ప ముద్రితముగాఁ దీపింగదా ముల్ ; భవ
న్నాట్యానుద్యంబున నిష్టానఁగలద్భాగ్యంపుఁబ్రబంధం బెటుల్
ద్యోతింపం, బనిపూని హెచ్చరిక నచ్చో తెంతు నే మిత్రమా. ౮

తే. గీ. ఇతరయు దీనిప్రయోగంబు తెలుఁగుఁ జూడ
నాకు వేడుక పొడముచున్నది వయస్య !
త్వరగ రచియింపు; దానికి వలయు తెరలు
ముదలుగా సిద్ధపఱుచు చుండెదను నేను. ౯

తే. గీ. కొంచెమైనను నాకుఁ దెల్గునను గావ్య
పరిచయముకల్మి నీకృతిపటిమఁ గాదె ?
రంగగురుమిత్రభావముల్ పొదుకొన్న
వసతి నీ, కిట నానెవ రసదె? సఖుఁడ ! ౧౦

వ. అని యనేకప్రకారంబుల నపారస్నేహపారవశ్యంబు నావార్యంబు నాత్మస్నేక్యం
బునుం దేటపడం బలికి వేగిరించిన.

ఆ. వె. అదన గురియువాన కారంభమట్లు, నా
యనుఁగువచనములకు నంగికరింగ
ముందుఁ గోర్కె పొదల, నానందమునఁ దేలి
గ్రంథరచన నేను గడఁగినాఁడ. ౧౧

వడ్డాది-సుబ్బారాయఁడు.

శ్రీ ప్ర క.

ఈ వేణీసంహార మనునీ నాటకము భారతకథ ననుసరించి భట్టనారాయణుఁ డనుకవి గీర్వాణభాషయందు రచియించినాఁడు. ఇది రౌద్రరసప్రధానం బైనను అష్టరసాశ్రయం బని చెప్పఁదగి యున్నది. దీనికిఁ గథానాయకుఁడు పార్థమధ్యముఁడు భీమసేనుఁడు. ఆదిపంచక యుద్ధపంచకములకథ యీనాటకమందలి యాఱంకములలోను సంగ్రహముగాఁ జేయవచ్చును భారతకథాపరిచయము కొంచెమయిన నుండకపోయిన దీనియందలి కథాసందర్భములు చక్కఁగా బోధపడవు. ధృతరాష్ట్రుఁడుఁ బాండురాజు నని యిద్దఱన్నదమ్ములు. వీరిలోఁ బ్రథముఁ డంధుఁడు. అతనికి గాంధారి యనుభార్యయందు నూర్వురు కొమారులు నొక కొమార్తెయుఁ గలిగిరి. అందగ్రజుఁడు దుర్యోధనుఁడు; ద్వితీయుఁడు దుశ్శాసనుఁడు; కొమార్తె దుస్సల. పాండురాజునకుఁ గుంతియు మాద్రియు నని యిరువురు భార్యలు. యుధిష్ఠిరుఁడు భీముఁడు నర్జునుఁడు నని కుంతికి మువ్వురును, నకులుఁడు సహదేవుఁడు నని మాద్రికి నిద్దఱును గుమారులు వీరేవురును దేవతాంశసంభూతులు. ఇందుఁ గనిష్ఠు లిరువురును గవలు.

ఒకకాలమునఁ బాండురాజు వేఁటకుఁబోయి, యయ్యడవిలో లేడులయి క్రీడించెడుమునిదంపతుల, నెఱుంగక తనయమ్మునకుం గుఱి యొనర్చుటం జేసి, యామునులు నొచ్చుచు నందొకఋషి యొసంగినశాపంబున మరల నింటికిఁ బోక, యక్కడనే వానప్రస్థుండయి యుండి. కొండొకకాలంబునకు మరణించినఁ, జిన్నభార్య యగుమాద్రి యాతనితో సహగమనముఁ జేసెను. అనంతరము కుంతిని గుమారుల నేవురను నచ్చటి మునిశ్రేష్ఠులు హస్తిపురంబునకుఁ దీసికొని వచ్చి, ధృతరాష్ట్రున కప్పగించి పోయిరి. ఆధృతరాష్ట్రుండును దన కరణ్యంబునుండి నూడిద దెచ్చినసింహడింభకంబులం బోలె నున్న తనతమ్మునిబిడ్డల నత్యాదరంబునం బోషించుచుండ, దుష్టుండగు దుర్యోధనుం డోర్వలేక, రాజ్యలోభంబున వారి నెట్లయిన రహస్యంబుగాఁ జంప వలయు నని బహువిధంబులఁ బ్రయత్నించి, యాప్రయత్నము లేవియుఁ గొనసాగ వందున, ధృతరాష్ట్రునిచే యావ రాజ్యాభిషిక్తుండయి రాజసూయయాగంబుఁ జేసి యింద్రప్రస్థపురంబున నింద్రభోగంబుతో సుఖం బున్న ధర్మరాజు ననుజసహితు, నుపాయాంతరంబునఁ జెఱుపవలయు నని, తనతండ్రిచే హస్తిపురంబునకుఁ బిలిపించి, యాతనిం దనతో జూదమాడం బురికొలిపి, తన మేనమామ శకుని గొనితెచ్చిన మాయపాచికలతోఁ దదీయసర్వస్వంబు నోడుచుకొనుటయ కాక పాండవపత్ని యగుద్రౌపదిని తనతమ్ముఁ డయినదుశ్శాసనునిచే నీడ్పించి కొలువులోనికిఁ దెప్పించి, యాచ్చ నామెకట్టుపుట్టమ విప్పించెను.

ఇట్లు అవమానకరముగాఁ బాండవులను వారి సర్వధనములతోడను గెలుచుకొని, యంతతో నయినఁ దృప్తినొందక, దుర్యోధనుఁడు ధర్మరాజున కింకను జూదంబునం దాస పుట్టునట్లు "అన్నా! మన మింకొక పందెము వేయుదము అది నీవు గెలిచితివేని నే నీవఱలో గెలుచుకొన్న దంతయు నీకు వదలి వేసెదను ఓడితివేని ద్రౌపదితోడను దమ్ములతోడను నీవు పండ్రెండేఁడులు వనవాసంబు నొక్కయేఁ డజ్ఞాతవాసంబుఁ జేయవలయును' అని చెప్పి యొప్పించి, మాయజూదమున నాపందెమును దానె గెలుచుకొని, పాండవుల నేవురఁ భార్యాసహితంబుగాఁ బరంబు వెడల నడిచెను అమాయికులగు నప్పాండవులును బలుబాములకు లోనయి, దైవసాహాయ్యమునఁ దత్సమయంబును నిర్వహించి మరల వచ్చిరి

ప్రథమాంకములోఁ 'గౌరవులు స్వప్నస్థు లయ్యెదరు' అని సూత్రధారుఁడు పలికినప్పుడును, "అన్నయ్యా! మీ రీలాగునఁ దీండ్రపడుచుండిన మనయన్నగారు క్షేమపడుదురు గదా!" యని సహదేవుఁడు తన్ననునయించునప్పుడును, వరుసగా భీమసేనుఁడు చదివెడు నీక్రింది రెండుపద్యములవలనను బూర్వోక్తమగు దుర్యోధన దౌర్జన్యమంతయు వెల్లడి యగును —

చ. ఖలులయి నాఁడు లక్కయిలు గాల్చి విషాన్నము వెట్టి, జూదపుం
గొలువు ప్రవేశపెట్టి, మముఁ గ్రూరత జీవధనంబులందుఁ జే
డల నొనరించి, కాలకడి, ద్రౌపదిఁ గొప్పును బట్టి యీడ్చి, యీ
గలుసభ నొల్చినట్టిధృతరాష్ట్రజు లేఁ గలుగంగ స్వప్నులే? ౧

చ. అలసభ నట్లు ద్రుపదాత్మజఁ గాంచి, యరణ్యమందు వ
ల్కలధరు లౌకిం తల లంగముతోఁ జరికాల ముండి, యు
న్వల నతిహీనవృత్తి విరటుపాల వసించియు నేఁ గృశింపఁగాఁ,
గలుగగు ఖేద మాయనకుఁ, గౌరవు లన్నను గల్గు నిప్పుడున్ ౨

ద్రౌపదిని దుశ్శాసనుఁడు సభ కీడ్చుకొని వచ్చినప్పుడామె కొప్పంతయు విడిపోయి యందునఁ దన్నట్లు అవమానపఱచినఖలులు గడతేఱువఱకును దాను మరలఁ గొప్పు వెట్టుకో నని యామానిని ప్రతిజ్ఞ పట్టెను సభలోఁ దన కన్నులయెదుర ద్రౌపదికి మానభంగము గావించినదుశ్శాసనుని వానిబంధువులు చూచుచుండ గుండెలు ప్రీల్చి నెత్తురు ద్రావెద ననియు, నాసమయమున విలాసముగాఁ గరతలంబున నూరువు పఱచుకొనుచు నామె యవమానమునకు సంతసించిన సుయోధనునిఁ దనగదచే నూరువుల విఱుగఁగొట్టి గిట్టించెద ననియు వఱియుఁ దులువ లగుసుయోధనసోదరుల నెల్ల

యుద్ధములోఁ గానొక్కరుండ సంహరించెద ననియు నప్పటికోపావేశంబున భీమసేనుండును బ్రతిజ్ఞ చేసెను

ఈస గతి యిట్లుండఁగా, నట్లు పదుమూఁడేఁడులును సమయపరిపాలనము చేసి వచ్చినయుధిష్ఠిరుండు గ్రాసవాసోదైన్యంబు రాకుండునట్లు తమసోదరు లేవురకు నేనూళు లిమ్మని శ్రీకృష్ణునిచే దుర్యోధను నడిగించెను కాని యీసంధివచనము భీమసేనునికిఁ గేవల మసమ్మతము ఈక్రింది భీమునిపద్యమువలన నయ్యంశము స్పష్టపడుచున్నది

ఉ. చెల్లక యుందుఁ గౌరవశతంబును బట్టి యనిన్ మథింపనా ?
ప్రల్లదు దుస్ససేనురుధిరంబు నురంబును వ్రచ్చి త్రావనా ?
పెల్లు మునన్ సుయోధనుని పెందొడలం గద నుగ్గు సేయనా ?
యీ ళ్ళయిదింటితో న పతి యొప్పుగఁ జేసెడుఁ గాక సంధులన్ ౧౫

కృష్ణునిరాయబారము జరుగుదినములలో నొకనాఁడు దుర్యోధనపత్ని యయిన భానుమతి ద్రౌపదిని జూచి "యోసి ! నీమగ లయిదుగురు నయిదూళ్లు చాలు కిమ్మని మమ్మడుగుకొనుచున్నారు నీ వీపాటికిఁ గొప్పు వెట్టుకో వచ్చు" నని మహాగర్వమున నుల్లస మాడెను ఆమాట తనకు హృదయశల్యమయి బాధించినందున దుఃఖించుచుఁ, బాంచాలి భీమసేనున కాసంగతి నెఱింగించిన, నతఁడు మండిపడి 'నీవు సంధి యగు నని జెంగ వెట్టుకోకుము సుయోధనుని వధించి, వానిరక్తమునఁ దడిసినచేతులతో నీకురులు ముడిచి కొప్పు పెట్టెద" నని ప్రతిజ్ఞాపూర్వకముగ ద్రౌపది నాశ్వాసించెను కానంజేసియే దీనికి వేణీసంహార మని పేరు గలిగినది ఈపేరికి జడ గట్టుచుట యని యర్థము అట్లు ద్రౌపది నాశ్వాసించిన భీమసేనుండు తనప్రతినకుఁ దోడు కృష్ణుండు సుయోధనునిచేఁ దిరస్కృతుం డయి చక్కవచ్చె నని తెలియవచ్చినందున, బుజాలు మూఁడుగాఁ బొంగి, సంగరరంగంబునకుఁ బోవ ద్రౌపదిని వీడుకొనియెను

ఇట్లు పాండవులు యుద్ధసన్నద్ధు లయినట్లు మొదటయంకములోఁ దెలిపి, రెండవ యంకమున ముఖ్యముగా దుర్యోధనపరాజయసూచకము లగుదుర్నిమిత్తములను గవి వర్ణించినాఁడు ఆదుర్నిమిత్తములలో మొట్టమొదటిది భానుమతీస్వప్నము నూఱుపాముల నొకముంగిస సంహరించినట్లు కలలో నామె చూచినందున భీముని ప్రతిజ్ఞ స్మరణకు వచ్చి, యుక్కిడు పరిహరించుకొనుటకు నుదయకాలమున భానుమతి భాస్కరాది దేవతల నారాధించుచుండ, దుర్యోధనుండు కామాతురుండయి వచ్చి బలవంతముగా నామెనియమమునకు భంగము గలిగించినాఁడు, ఈపట్టునఁ బరిహాసాస్పదము లగుసుయోధనునయోగ్యగుణము గూడఁ దేటపడి, వాఁ డెక్క రాజ్యలక్ష్మీకటాక్ష వీక్షణమునకు

లేశమును శాత్రుఁడు కాఁడనునంశము దృఢపఱుచును. అనంతర మొకమహావాయువు వీచినందున, దానిబాధకుఁ దప్పుకొన దుర్యోధనుఁడు భార్యాసహితముగా నొక దారు పర్వతప్రాసాదము నారోహించి, యక్కడ ననాస్తరణ మైనకఱకుఱాతి నేలను గూరు చుండఁ బోవుభానుమతితో మహానురాగమున నిట్లు పలికెను.

తే. జిలుఁగుఁబుట్టంబు గాలికిఁ జెదర, నాకుఁ। గనులపండువు సేయు నీఘనజఘనము*
వలవదే గారవింప నావలువ యొగయ। నువిద! నీచూపుఁదనుపు నాయూరుయుగము‡

అనునప్పు డాకస్మికముగా నొకకంచుకి వచ్చి పైమాటతోఁ గలిసిపోవునట్లుగా "దేవా! భగ్న మైనది. భగ్న మైనది" యని వచియించెను. అకంచుకి యప్పుడు వీచిన పెనుగాలిచే రథధ్వజము భగ్న మైన దని సుయోధనుతోఁ జెప్పవచ్చినవాఁడు. అయి నను నీవాక్యసందర్భమున, నూరుయుగము భగ్నమయినది యను నొక యమంగళార్థము శ్రోతలకు స్ఫురించుచున్నది. మేలుగాని కీడుగాని రాఁబోవునప్పుడు మానవులకు దైవి కముగా నిన్నివిధములఁ దత్సూచన మగు ననుటయే యిందలియాశయము. అట్లుతఁడు దారుపర్వతప్రాసాదమున నుండఁగా దుస్సలయును దానియత్తయును రోదనము చేయుచు వచ్చి కురునాథా! రక్షింపుము రక్షింపు మని వానికాళ్లమీఁదఁ బడిరి. తాను దగ్గఱ లేనప్పుడు తన పుత్త్రుఁ డభిమన్యుఁడు ద్రోణాచార్యులు పన్నినపద్మవ్యూహ ములో సాహసంబునం బ్రవేశింప వానికి సహాయులుగాఁ బోయెడుభీమాదుల సేనా ముఖంబున నాఁగి, తన్మూలముగా నాతనిమృతికి హేతువైన సైంధవుని "వెల్లి ప్రొద్దు గ్రుంకకమున్న సంహరించెద" నని నాఁటిరేయి యర్జునుఁడు పట్టినబెట్టిదపుఁ బ్రతిన వలన వారి కట్టియార్తి పుట్టినది. ఈసింధురాజు దుస్సలకుఁ బెనిమిటి; కాఁబట్టి సోదరీ మాంగల్యసంరక్షణార్థము భానుమతిని వీడుకొని, సుయోధనుఁ డాయోధనంబునకుఁ బోయెను, ఇంతటితో ద్వితీయాంకము ముగియును.

మూఁడవది యశ్వత్థామాంకము ఇందు ముందుగాఁ బ్రవేశించెడు రాక్షస దంపతుల సంభాషణమువలన యుద్ధములో నంతకముందు చనిపోయిన రాజులపేరు లును, రణరంగము బీభత్సస్థితియును దెలియవచ్చును. తరువాత సేనలోఁ బొడమిన మహాకలకలమునకుఁ గారణ మారయుచు నశ్వత్థామ యాహవమునఁ బ్రవేశించును. అతనితండ్రియు నప్పటికౌరవసేనానియు నగుద్రోణుం 'డశ్వత్థామ చచ్చె నేనుఁ'' గని కారణాంతరమున యుధిష్ఠిరుఁడు పలికినమాటలో, నేనుఁ గన్నది వినక, శేష వాక్యశ్రవణమువలనఁ దన కుమారుఁడు చచ్చెనని భావించి, పుత్త్రవాత్సల్యమున నస్త్ర పరిత్యాగముఁ జేసి, ప్రాయోపవేశమున దేహంబుఁ జాలించువాఁడై యుండఁ, బాండవ

* ఇది కర్తృపదము. ‡ ఇది కర్మపదము.

<u>పంచమాంకములో</u>—గాంధారీధృతరాష్ట్రులు యుద్ధము మాను మని సుయోధనుని బతిమాలుటయు, నతఁ డందున కంగీకరింపమియుఁ, గర్ణునిమరణంబువిని సుయోధనుఁడు విలపించుటయు, నట్టిదురవస్థలో భీముఁ డుల్లసమాడుచు నర్జునసహితుఁ డయి యతనిఁ జూడ వచ్చుటయు, నచ్చో వారికి నతనికి వాక్కలహము సంభవించుటయు, నందుమీఁద మహాకోపమున "నెల్లి తప్పక సుయోధనుఁ జంపుదు" నని భీముండు ప్రతిన పట్టుటయు, నాసమయమున నస్త్రధరుఁ డయి సుయోధనుకడకు నశ్వత్థామ వచ్చుటయుఁ, గర్ణపక్షపాతిమానసంబున సుయోధనుఁడతనిసాహాయ్యమునిరాకరించుటయు, ధృతరాష్ట్రుం డందుకు దుఃఖపడి కొడుకుం గినిసి యశ్వత్థామం బ్రార్థింప సంజయుం బంచి తాను దుర్యోధనునకు మాయోపాయ ముపదేశించి పోవుటయుఁ, జెప్పం బడిరి. దుర్యోధనుఁడు స్వబుద్ధి నే ద్వైపాయనహ్రదమునందుఁ బ్రవేశించినట్లు భారతమున నున్నది. ధృతరాష్ట్రుని కౌటిల్యమును వెల్లడించుటకు కవి యిట్లు మార్చినాఁడు.

<u>ఆఱవయంకములో</u>—దుర్యోధనుని వెదకుటకయి ధర్మరాజు తనపరిజనమున కాజ్ఞాపించుటయుఁ, గృష్ణప్రేషితుం డయి యుద్ధములోనుండి వచ్చి పాంచాలకుం డనువాఁడు "సుయోధనుఁ డగపడి భీమునితో గదాయుద్ధముఁ జేయుచున్నాఁ" డని యెఱింగించుటయు, భీముఁడే యోడు నేమో యని విచారించుచున్న ద్రౌపదీయుధిష్ఠిరుల కడకు దుర్యోధనమిత్త్రుఁ డగుచార్వాకుఁ డనురక్కసుఁడు మునివేషమున వచ్చి, భీమార్జునులు దుర్యోధనునిచేఁ జచ్చి రని నచ్చఁజెప్పుటయు, నందుకుఁ బనవి పనవి, యాదంపతు లగ్నిప్రవేశము సేయఁ దలఁచి, తమపరిజనులకుఁ జెప్పవలసినమాటలు చెప్పిపుచ్చి, భీమాదుల కుదకదానంబు సేయుటయు, నంతలో సుయోధను వధించి తద్రక్తసిక్తము లయినహస్తములతో వృకోదరుండు ద్రౌపదికి జడ ముడువవచ్చుటయు, సుయోధనుఁ డనుభ్రాంతిచేత ధర్మరాజు వానిని సత్తువకొలఁదిఁ బట్టుకొని బగ్గున మండుచున్న యగ్నిహోత్రములోఁ బడవేయఁ జూచుటయుఁ, దద్భ్రాంతిం దెలిసికొని భీముఁ డాతనికిఁ దన్నెఱింగించుకొనుటయు, ద్రౌపది వేణీసంహారమహోత్సవంబుతో ధర్మరాజునకుఁ బట్టాభిషేకంబు జరుగుటయుఁ దెలుపఁబడియె. పైని జెప్పఁబడిన చార్వాకుఁడు యుధిష్ఠిర పట్టాభిషేకసమయమున విప్రవేషముతో బ్రాహ్మణమధ్యమునఁ జేరి, కొన్ని కాఱులఱచి యచ్చోఁ జంపఁబడినట్లు శాంతిపర్వమున నున్నది. దానినే రసపుష్టికయి కవి యిట్లు మార్చినాఁడు.

ఇట్టిప్రకారము కథ మార్చుటకుఁ దనకు స్వాతంత్ర్యము గలిగియున్నను, పాత్రముల స్వభావమునకు భిన్నముగా మాత్ర మీకవి యెక్కడను వాక్యరచన చేయలేదు. అది దీనికి మిక్కిలి వన్నె దెచ్చుచున్నది. ఈనాటకమును గడుఁ బురాతనముగాఁ జెప్పుదురు గాని కాలనిర్ణయమునకయినను స్థలనిర్ణయమునకయినను నాధార

ఈ నాటకమునందు వచ్చు పాత్రములు

పురుషులు

భీముఁడు—కథానాయకుఁడు. పాండవులలో రెండవవాఁడు

సహదేవుఁడు—భీమునికనిష్ఠసోదరుఁడు.

వినయంధరుఁడు—దుర్యోధనునికంచుకి; మైత్రేయుఁడు—పాండవులకంచుకి.

దుర్యోధనుఁడు—పాండవులకు ముఖ్యశత్రువు. మఱియు వారిపెత్తండ్రికొడుకు.

రుధిరప్రియుఁడు—యుద్ధభూమియందు నాహారమునకై యిటుఁదిరుగులాడునొకరాక్షసుఁడు.

అశ్వత్థామ—దుర్యోధనునిపక్షమువాఁడు, ద్రోణునికొడుకు.

అశ్వసేనుఁడు—ద్రోణునిసారథి.

కృపుఁడు—దుర్యోధనునిపక్షమువాఁడు, అశ్వత్థామకు మేనమామ.

కర్ణుఁడు—దుర్యోధనుని ప్రాణస్నేహితుఁడు.

సుందరకుఁడు—యుద్ధరంగములోనుండి దుర్యోధనునకు జాబు తెచ్చిన కర్ణసేవకుఁడు.

ధృతరాష్ట్రుఁడు—దుర్యోధనునితండ్రి, జాత్యంధుఁడు.

సంజయుఁడు—ధృతరాష్ట్రునిసూతుఁడు.

అర్జునుఁడు—భీమునితరువాతివాఁడు.

ధర్మరాజు—పాండవాగ్రజుఁడు.

బుధకుఁడు—ధర్మరాజుపరిచారకుఁడు.

పాంచాలకుఁడు—యుద్ధరంగమునుండి ధర్మరాజునొద్దకుఁ గృష్ణునిచేఁ బంపఁబడ్డవాఁడు.

జయంధరుఁడు—ధర్మరాజుకంచుకి.

చార్వాకుఁడు—మునివేషముతో ధర్మరాజును వంచింపవచ్చిన రాక్షసుఁడు, దుర్యోధనుని స్నేహితుఁడు.

కృష్ణుఁడు—మనుష్యావతార మెత్తిన విష్ణుఁడు. పాండవులకు మేనబావ.

స్త్రీలు.

ద్రౌపది—పాండవులభార్య; బుద్ధిమతిక—ద్రౌపదిపరిచారిక.

భానుమతి—దుర్యోధనునిభార్య; సువదన—భానుమతిచెలికత్తె.

తరళిక—భానుమతిపరిచారిక,

ప్రతీహారి—దుర్యోధనుని యంతఃపురపరిచారకురాలు.

దుస్సల—దుర్యోధనుని చెల్లెలు. సైంధవునిభార్య.

జయద్రథమాత—దుస్సలయత్తగారు.

రుధిరప్రియ—రుధిరప్రియుని పెండ్లము, రాక్షసి.

గాంధారి—ధృతరాష్ట్రునిభార్య, భర్తయంధుఁడని కన్నులకుగంతులు కట్టుకొన్న పతివ్రత.

సేనాధిపతి యగుధృష్టద్యుమ్నుఁడు జుట్టుఁ బట్టుకొని యవమానకరముగాఁ దదీయ కంఠనాళ ఖండనంబు గావించెను. ముందు నుడివిన సేనాక్షోభమున కిదియె కారణము. ఈసమాచార మామూలాగ్రముగాఁ దనతండ్రిగారి సూతునివలనను, దన మేనమామ యగు కృపాచార్యులవలనను, గ్రమక్రమముగాఁ దెలిసికొని, బహువిధముల విలపించి, యనేకము లగుప్రతాపోక్తులు వలికి, తుదకు మాతులప్రార్థనంబున "సేనాధిపత్యము ను బొంది పగదీర్చుకొందు" నని, కృపాచార్యసహితముగా దుర్యోధను సన్నిధికి బయ లుదేఱెను. అప్పు డారాజుతోఁ, బ్రియమిత్రుఁ డగు కర్ణుఁడు లేనిపోనిమాటలు కల్పించి చెప్పి, యాతనిమదిలోని ద్రోణపక్షపాతమును బోఁగొట్టుచుండెను. ఈసమ యములో నశ్వత్థామయుఁ గలిసికొని యప్పుడు పొసంగినప్రసంగమును బట్టి రాధే యునితోఁ దనకు మహాకలహము సంభవించినందున, వాఁడు చచ్చువఱకును యుద్ధము చేయకుండునట్లు శపథముచేసి, తా నస్త్రంబును బరిత్యజించెను. ఇట్లస్త్రపరిత్యా గము భీష్మునిమీఁదికోపమునఁ గర్ణుఁడు గావించినట్లు మహాభారతమున నున్నది. కౌర వయోధుల వైకమత్యాభావము సూచించుట ముఖ్యోద్దేశమయి ప్రస్తుత కథకు సంద ర్భపడఁ గవి దాని నిట్లు మార్చినాఁడు. మొదటియంకములోని భానుమతీ పరిహాసో క్తియు రెండవయంకములోని భానుమతీస్వప్నదర్శనాది వృత్తాంతమును గేవలము కవికల్పితములు. మూలగ్రంథమున లేకపోయినను రసపుష్టిని గలిగించుటకు నాటకమున నిట్టికల్పనలు సేయఁ గవులకు నిరంకుశాధికారము గలదు అనంతరము దుశ్శాసనుఁడు తనచేతికి దొరకెనని వృకోదరుఁ డఱవఁగా, సోదరప్రాణరక్షణ పరాయణత్వంబున మిత్రసహితుఁ డయి సుయోధనుఁ డనికిఁ బోయెను. ఈయంకము మిక్కిలి రసవంతము.

నాలవయంకములో, భీమునికి సాయము సేయ వచ్చి సవ్యసాచి యేసినసా యకంబులు నాఁటి, తేరిమీఁద మూర్ఛవోయినతన్నుం బాలికలనికిఁ దొలఁగించి, యాదురవస్థలం దలంచి దుఃఖించుచు నూతుండు గావించినశీతలోపచారంబులచేఁ దెప్పిఱిలి, దుశ్శాసన మరణంబు విని విలపించెడు తనకడకు యుద్ధములోనుండి కర్ణసేవ కుండు వచ్చి వాని ప్రభుపుత్త్రుఁ డగువృషసేనుని మరణప్రకారం బభివర్ణింప నం దుకుఁ బరిదేవనంబు చేసి, యాసేవకుఁ డిచ్చిన కర్ణునిజాబుఁ జదువుకొని, మరలఁ గర్ణు నకుఁ దాను జెప్పవలసిన మాటలు వానికిం జెప్పిపుచ్చి, నిరుత్సాహుఁడయి కుందు చున్నతన్నుఁ బరామర్శింపఁ దనతల్లిదండ్రులు యుద్ధభూమికి రాఁగా, వారిని గార వింప రారాజు వోయె ననుకథ చెప్పఁబడియె. దుర్యోధనుఁడు జీవించి యుండఁగా గాంధారీధృతరాష్ట్రులు యుద్ధభూమికి వచ్చినట్లు భారతమునఁ గనఁబడదు. తదనంత రము వచ్చినట్లు స్త్రీపర్వములో నున్నది. ద్రోణపర్వములో నభిమన్యునిపరాక్రమము వర్ణింపఁబడినట్లు లిందు వృషసేనుని పరాక్రమము వర్ణింపఁబడినది.

మేమియు దొరకలేదు. ఆ ౧౮౭౩ వ సంవత్సరములో నీనాటకము తెలిఁగించి ౧౮౭౬ వ సంవత్సరమున మొదటిపర్యాయము ముద్రింపించినాఁడను. పలుకారణములచే నక్కూర్పున స్ఖాలిత్యములు మెండుగ నగపడినందున రెండవకూర్పులో శక్తికొలఁది వానిని సవరించినాఁడను. ప్రప్రథమమున నీనాటకము గోదావరీమండలములోని దాక్షారామమునకు సమీపమున నున్నవేగాయమ్మపేట యను మాపూర్వనివాసగ్రామమున శ్రీవాడేఱు రంగనాయకాంబారాజ్ఞిగారి మందిరమునఁ బ్రయుక్తంబయినది. అప్పుడు తత్ప్రయోగమున కానందించిన సాహితీచక్రవర్తులు మద్గురువరులు భాగవతి వాసుదేవదీక్షితులుగా రాంధ్రగీర్వాణముల నొసంగిన యభిప్రాయము మాత్ర మిట వ్రాసి యీయంశమును ముగించుచున్నాను.

తే. గీ. క్షీరవారాశి వేణిసంహారనాట
కంబు, మందరాహార్యము కలిత సుబ్బ
రాయ ధైర్యము, సుధ తదర్థంబు, విష్ణుఁ
డీనృసింహరావు, విబుధు లీచటిజనులు.

శ్లో. వడ్డాదిసుబ్బరాయగ్రథితం నాటకవిచిత్రమాల్య మిదమ్
తర్పయతి రసలహార్యా సభ్యమనశ్చంచరీకనికురుంబమ్.

వడ్డాది-సుబ్బారాయఁడు

మొల్లరామాయణము గ్లేజు.	0—10—0
డిటో కాలికో	1—0—0
వైజయంతి విలాసమను విప్రనారాయణచరిత్ర గ్లేజు	0—8—0
డిటో కాలికో	0—12—0
బాలవితంతు విలాపము గ్లేజు.	0—5—0
డిటో కాలికో	0—8—0

వలయువారు.

కర్రా అచ్చయ్య అండ్ సన్సు

రాజమండ్రి.

శ్రీరస్తు.

శ్రీపరమాత్మనే నమః

ప్రథమాంకము.

నాంది

చ. పొరిఁబొరిఁ దోలినన్ మధుపతుల్ పిరిదేనె గలంప, లో సుధా
కరకరలిప్త మైనటులు గాంచఁగనై, వికసించి మించునీ
హరిచరణప్రకీర్ణకుసుమాంజలి, సభ్యులకు న్విలోకసుం
దర మగుకావ్యసిద్ధిని నొసర్చెడుఁగావుత మాకు నిర్వ్యడన్. ౧.

శా. కాళిందీపులినంబునందుఁ బొలయల్కన్ రాసము న్మాని, రా
ధాలోలాక్షి సబాష్పయై మరలఁ, దత్పాదాంకముల్ మెట్టుచుం,
బాళిన్ మై గరుపార వెంటఁ జని, తద్భామాప్రసన్నావలో
కాళిన్ ధన్యత గన్నకంసరిపునూరార్పుల్ మిముం బ్రోచుతన్. ౨.

మ. ఇది యే మంచు భవాని ప్రేమను, భయోద్వృత్తి న్నిశాటాంగనల్,
త్రిదశుల్ మోదమునఁ, దపోధనులు జాలిన్, నవ్వున న్వెన్నుఁ, దు
న్మదలీలం దనుజుల్ గనన్, మయపురోద్యద్దాహవేళం జయా
స్పద మస్త్రిం బరివోయుధూర్జటి యజస్రింబున్ మిముం బ్రోచుతన్. ౩.

(నాంద్యంతమున)

సూత్రధారుఁడు—అతివిస్తర మెందుకు ?

తే. గీ. వీనుఁజేరల జుఱ్ఱంగ విబుధు లెల్ల
భారతం బనునమృత మెవ్వాఁడు చేసె,
రాగకృష్ణవిహీనుఁ డేయోగివర్యుఁ,
డట్టిసాత్యవతేయు నాయాత్మఁ దలఁతు. ౪.

పూజ్యులైనయీసభాసదులారా! మీయందఱకు నే నొకవిజ్ఞాపనము చేసికొనుచున్నాను

క. మరలను నొక పుష్పాంజలి
పరుసను నెఱపెదము కావ్యబంధము నిచటన్,
సరసాత్ములు మధుపము బలె
నిరతి పరగుణలేశములను వెదకి కొనుండీ

అది పూర్వము గీర్వాణభాషయందు మృగరాజలక్ష్మణం డగుభట్టనారాయణకవిచే విరచితం బయి, యిప్పు డభినవముగా వడ్డాది సుబ్బరాయకవిచే నాంధ్రీకృతం బయిన వేణీసంహార మనునాటకము, దాని నిప్పు డిచ్చో నుపయోగింప నుద్యోగించుచున్నాము, కావునఁ గవిపరిశ్రమానురోధమున నయినను, నుదాత్తకథావస్తుగౌరవమున నయినను, నవనాటకకుతూహలమున నయినను మీరు సావధానముగా దీని నవధరింపవలయును (తెరలో) అయ్యా! త్వరపడు, త్వరపడు మహానుభావు లయిన పారాశర్యనారదతుంబురుజామదగ్న్యప్రముఖు లయినముని బృందారకులతో, భరతకులహితకాంక్షను స్వయముగా దూతకృత్యమును నడుపఁ దలఁచి భగవంతుండును జగత్ప్రయోధుండును నగు దేవకీనందనుండు దుర్యోధన మహారాజు శిబిరమునఁ బ్రవేశించునవసరముగదా! కావున నిప్పుడు వాద్యములను మేళము చేయుండని విద్వాంసులయనుమతి నీపురుషులు నాటకులతోఁ జెప్పుచున్నారు

సూత్రి—(సంతోషముతో) ఓహోహో! జగదుత్పత్తిస్థితినిరోధప్రభవిష్ణుండయినకృష్ణుండు కురుపాండవరాజపుత్త్రుల మహాహవప్రళయానలంబును జల్లార్పం దలంచి, సంధి చేయుటకు స్వయముగా దూత యగుటచేత నీభరతకులంబును, సమస్తరాజలోకంబును గూడ నమ్మహాత్మునిచేత ననుగ్రహింపఁబడినది గదా! కావునఁ బారిపార్శ్వకా! కుశీలవులతో సంగీతము నారంభింపకున్నావేమి?

[పారిపార్శ్వకుఁడు ప్రవేశించుచున్నాఁడు]

పారి—అలాగే యారంభించెదను గాని యేఋతువు నాశ్రయించి?

సూత్రి—ఓయీ! చంద్రాతపనతత్రి క్రౌంచహంసకుల సప్తచ్ఛదకుముద పుండరీకకాశకుసుమపరాగ ధవళితగగనదిఙ్మండలంబును, స్వాదుజలజలాశయంబును నగు నీశరత్సమయము నే యాశ్రయించి గానము సేయుము చూడుము ఈశరదృతువునందు

తే. గీ. చారువచము ప్రసాధితాశము, మదోద్ధ
తప్రియత్నము, విపులసత్పక్షమైన
ధార్తరాష్ట్రశతంబు భూతలమునందు
వ్రాలెడును జిత్రముగఁ గాలవశము చేత ౬

పారి—(తొట్రుపాటుతో) హరిహరీ! ఎంతమాట పలికితివి?

సూత్ర—(తెలతెలఁబోయి నవ్వి) మారిషా! నేను శరత్సమయమును వర్ణించుచుండఁగా నీవు "హరిహరీ" యనియెద వేమి?

పారి—అవు నది నిజమే ధార్తరాష్ట్రశత మనఁగా హంసలగుం పని మీయభిప్రాయము, అయినను దద్వచనమందలి యమంగళశంసనమున నాహృదయము చెదిరిపోయినది

సూత్ర—మారిషా! ఇంక నిశ్చయముగా నన్నియమంగళములును గొట్టఁబడి పోవును కంససంహారణుండగు శ్రీకృష్ణుండు తానుగ దూతయయి సంధిసేయం జూచుచున్నాఁడుగదా! ఆహేతువుచేత

తే. గీ. పగలు సాధించి నిర్వాణవైరదహను
లయి సుఖింతురు పాండవుల్ హరిని గూడి,
స్వస్థు లయ్యెడు రక్తప్రసాధితోర్వ్యు
లగుచుఁ గౌరవుల్ క్షతవిగ్రహతను జెంది ౭

(తెరలోపలఁ దిరస్కారముగా) ఆ! దురాత్మ! వృథామంగళపాఠక! శైలూషాధమ!

చ. ఖలు లయి నాఁడు లక్కయిలు గాల్చి, విషాన్నము పెట్టి, జూదపుం
గొలువు ప్రవేశపెట్టి, మముఁ గ్రూరత జీవధనంబులందుఁ జే
దల నొనరించి, చాల కది, ద్రౌపదిఁ గొప్పును బట్టి యీడ్చి, కౌ
రల సభ నోర్చి నట్టి ధృతరాష్ట్రజు లేఁ గలుగంగ స్వస్థులే? ౮

సూత్ర—(ఆలకించి భయముతోఁ దెరవంకఁ జూచుచున్నాఁడు)

పారి—ఆ! ఇది యేమి?

సూత్ర—(వెనుకఁ జూచి) అహో! కృష్ణుఁడు కౌరవులతో సంధిసేయఁ బోవుట కిష్టపడక, భీమసేనుఁడు నిటలతటఘటితకుటిలభ్రుకుటి యయి మనలనందఱఁ జూచునంతన మ్రింగివేయునట్లు మహాకోపముతో సహదేవానుగమ్యమానుం డయి యిదిగో! యీలాగున వచ్చుచున్నాఁడు, కావున నతనియెదుర మనము నిలువరాదు వేగముగా వేఱొకచోటికిఁ బోవుదము రా

(నిష్క్రమించుచున్నారు) ప్రస్తావన

[తర్వాతఁ గుపితుఁడైన భీమసేనుఁడు సహదేవునితోఁ బ్రవేశించుచున్నాఁడు.]

భీము—ఆ ! పాప ! దురాత్మ ! వృథా మంగళపాఠక ! శైలూషాధమ !

' చ. శిలులయి నాఁడు లక్క—యిలు" అను మునుపటిపద్యమును మరలఁ జదువుచున్నాఁడు.

సహ—అన్నయ్యా ! శాంతింపుఁడు. శాంతింపుఁడు. ఈభరతపుత్రుల వచనము మనకు సమ్మతమే. చూడుఁడు.

తే. గీ. పగఱ సాధించి నిర్వాణవైరదహను
లయి సుఖించుతఁ బాండవుల్ హరిని గూడి;

అనువాక్యము మీకిష్టమే గదా!

స్వస్థులయ్యెడు రక్తప్రసాధితోర్వు
లగుచుఁ గౌరవుల్ క్షతవిగ్రహతను జెంది. ౯.

అను నీవాక్యమును మన కనుకూలముగానే యున్నది. చిత్తగింపుఁడు. క్షతవిగ్రహతను = కొట్టఁబడిన దేహములు గలుగుటను; జెంది = పొంది, రక్తప్రసాధితోర్వులగుచుఁ = రక్త = నెత్తుటిచేత; ప్రసాధిత = అలంకరింపఁబడిన; ఉర్వీ = భూమిగలవారు; అగుచు; కౌరవులు; స్వస్థులు = (స్వర్ స్థ) స్వర్గస్థులు అయ్యెడుఁగాక = అగుదురుగాక; అని యర్థ మిచ్చుచున్నది.

భీము—(నిందాగర్భముగా) వద్దువద్దు. మీరు కౌరవుల కమంగళములను దలంపఁగూడదు. వారు మీకు సోదరులు గావున సంధిసేయఁ దగినవారు.

సహ—(రోషముతో) అయ్యా !

క. పలుమా ఱెగ్గులు సేసిన
యలధృతరాష్ట్రజులయందు నలుగక యుండం
గలఁ డెవఁడు నీదుతమ్ముఁడు,
వల దని మనరాజుగారు వారింపనిచోన్ ? ౧౦

భీము—(రోషముతో) ఔనోయి ! యది నిజమే. అందుచేతనే యింతట నుండి నేను మీయందఱనుండి వేఱయ్యెదను. వినుము.

ఉ. సింధురసింహసామ్యులము చిన్నటనుండియు వారు నేను; మా
బంధురవైరకారణములు భర్తయుఁ బార్థుఁడు మీరునా? జరా
సంధునురంబువోలెఁ గురుసంధి ఘటిల్లిన వెండి, సద్భుజా
గంధుఁడు భీమసేనుఁడు పెకల్చును! గూర్పుఁడు మీర లందఱున్. ౧౧.

సహ—(అనునయముతో) అన్నయ్యా! మీ రీలాగునఁ దీండ్రపడుచుండిన మనయన్నగారు ఖేదపడుదురు గదా!

భీమ—(నవ్వుచు) ఏమిది? నావిషయమయి యన్నగారు ఖేదపడుదురా? ఆయన ఖేదముకూడ నెఱుంగుదురా? చూడు.

చ. అలసభ నట్లు లైన ద్రుపదాత్మజఁ గాంచి, యరణ్యమందు వ
ల్కలధరు లై కిరాతులబలంగముతోఁ జిరకాల ముండి, య
వ్వల నతిహీనత న్విరటుపాల వసించియు, నేఁ గృశింపఁగాఁ,
గలుగదు ఖేద మాయనకుఁ; గౌరవు లన్నను గల్గు నిప్పుడున్. ౧౨

కావున సహదేవా! నీవు పోయి యతిచిరప్రవర్ధితక్రోధకృశానుం డగు భీమసేనుం డిట్లు పల్కెనని మహారాజుగారితో విన్నవింపుము.

సహ—అన్నయ్యా! ఎట్లు?

భీమ—ఇదిగో నిట్లు.

మ. భవదాజ్ఞాపరిలంఘనాంబువుల భూపా! మున్గి యుంటిం గదా;
యవనిం బ్రస్తుతి గన్న నీయనుజులం దఖ్యాతిఁ గంటి న్గదా;
బవరంబం దిదె కౌరవక్షతజశోభన్ సల్పెదన్ మద్గదో
త్సవమున్; నేఁటికి మీరు గారు గురువుల్; తమ్ముండఁగా నేనునున్. ౧౩.

(అహంకారముతో నడుచుచున్నాఁడు.)

సహ—(అతని ననుసరించి నడుచుచుఁ దనలో) ఓహో! ఎందుకోగాని యీయన పాంచాలీచతుశ్శాలభవనమునఁ బ్రవేశించుచున్నాఁడు. కాని నే నిక్కడనే నిలిచెదను. (అట్లు చేయుచున్నాఁడు.)

భీమ—(మరలి చూచి) సహదేవా! నీవు పోయి యన్నగారి ననుసరించి యుండుము. నే నీయాయుధాగారమునఁ బ్రవేశించి యాయుధసహాయుఁడ నయ్యెదను.

సహ—అన్నయ్యా! ఇది యాయుధాగారము గాదు; పాంచాలీచతుశ్శాలభవనము.

భీమ—(సవితర్కముగా) ఏమీ? ఇది యాయుధాగారము గాదా? పాంచాలీచతుశ్శాలభవనమా? (ఆలోచించి) పాంచాలితో మాటలాడ వలసియున్నది. (ప్రేమతో సహదేవుని చేయి పట్టుకొని) తమ్ముఁడా! ఇటురమ్ము.

సహ—అన్నయ్యా! ఆజ్ఞాపింపుఁడు.

భీమ—తమ్ముఁడా; అన్నగారు కౌరవులతో సంధికి నిచ్చగించి మన లెట్లు పీడించుచున్నారో చూడుము.

(నడచి యుద్ధమును గృహము ప్రవేశించుచున్నారు.)

భీము—(కోపముతో వట్టిగేలను జలికిలఁబడుచున్నాఁడు.)

సహ—(తొట్రుపాటుతో) అన్నయ్యా! ఇదిగో! నిక్కడ నాసనము వేయఁబడియున్నది. ముహూర్తమాత్ర మిందు విశ్రమించి కృష్ణాగమనముఁ బ్రతీక్షింపుఁడు.

భీము—తమ్ముఁడా! నీవు కృష్ణాగమన మనుటచేతఁ దలఁపు వచ్చినది. మహానుభావుఁ డయిన శ్రీకృష్ణుం డేప్రకారము సంధిచేయుటకు సుయోధనునొద్దకుఁ బంపఁబడెను.

సహ—అయిదూళ్ళు మన కిచ్చునట్లు.

భీము—(చెవులు మూసికొని) అన్నన్నా! ఎంతకష్టము! అన్నగా రజాతశత్రు లయినను, నీదృశ తేజోహీను లగుటచేత నిజముగా నాహృదయము చలించుచున్నది. తమ్ముఁడా! ఇది నీ వనను లేదు. నేను వినను లేదు. (పెడ మొగము పెట్టుకొని)

తే. గీ. ఊర్జితం బగుక్షాత్రంపుటుగ్రతేజ
మీమహారాజునకు నాఁటనే తొలంగె,
దాయతోడుత నెపుడు జూదంబు నాడఁ
బాచికలఁ దనచేతను బట్టినాఁడొ. ౧౮.

(తెరలో) దేవీ! ఊఱడిల్లు మూఱడిల్లుము. కౌరవులతో నిరతబద్ధవైరుం డగు భీమసేనకుమారుఁడు నీదుఃఖము నపనయింపఁగలఁడు.

సహ—(చెవియొగ్గి తెరవంకఁజూచి తనలో) అయ్యో! ఏమిది? యాజ్ఞసేని కన్నుల బాష్పబిందువులు గ్రమ్ముకొన నన్నగారిసన్నిధి కిటు వచ్చుచున్నది. ఇందువలన నేదో గొప్పయుపద్రవము సంభవించును గదా!

తే. గీ. సంభృతం బయ్యె నీఘనుజ్జృంభణమున
నురుతరేరమ్మదమురీతి నొక్కజ్యోతి;
వర్షఋతువట్లు వచ్చి సంవర్ధనంబు
సేయు నిజముగ యాజ్ఞసేని దాని. ౧౫.

(తర్వాత ముందుచెప్పినరీతిని ద్రౌపదియుఁ జేటియుఁ బ్రవేశించుచున్నారు.)

ద్రౌప—కన్నీరుజాఱ నిట్టూర్పుపుచ్చుచున్నది.)

చేటి—దేవి! ఊఱడిల్లు మూఱడిల్లుము. కౌరవులతో నిరతబద్ధవైరుం డగు భీమసేనకుమారుండు నీదుఃఖము నపనయింపఁగలఁడు.

ద్రౌప—(నిట్టూర్చి) మహారా జిందుకుఁ బ్రతికూలుఁడు గాకపోయిన, నీ వనిన

లాగున జరుగఁగలదు; నాథునిఁ జూచుటకు నాహృదయము వేగిరపడుచున్నది. చేటీ! బుద్ధిమతీ! ప్రాణేశునివాసభవనమునకు నన్నుఁ గొనిపొమ్ము.

చేటి—దేవీ! ఇటు, ఇటు, (నడుచుచున్నారు.)

చేటి—దేవీ! ఇదే వాసభవనము. ఇందుఁ బ్రవేశింపుము.

ద్రౌప—చేటీ! నాథునితో నారాక నెఱింగింపవే

చేటి—చిత్తము. (నడిచి మరలవచ్చి) దేవీ! ఇదిగో యువరాజుగా రిక్కడనె కూరుచున్నారు. సన్నిధి కరుగుము.

ద్రౌప—అలాగే చేయుదము. (ఇద్దఱును నడుచుచున్నారు.)

చేటి—జయము జయము కుమార!

భీము—(వినకయే క్రోధముతో)

"తే. గీ. ఊర్జితంబగు క్షాత్త్రంపుటుగ్రతేజ। మీమహారాజునకు నాఁటనే తొలంగె"

(అను పద్యమును మరలఁ జదువుచున్నాఁడు.)

చేటి—(ద్రౌపదిని జేరి) దేవీ! నీకుఁ బ్రియముఁ జెప్పెదను. అబ్బాయిగారు కోపగించియున్నట్టు లగపడుచున్నారు.

ద్రౌప—చేటీ! అలాగయిన నన్నీతిరస్కారమే యాడించుచున్నది. కావున నే నిక్కడనే కూరుచుండి ప్రాణేశునిప్రయత్న మేమో తెలిసికొనియెదను. (అట్లు చేయుచున్నారు.)

భీము—(క్రోధముతో సహదేవు నుద్దేశించి) ఏమీ! అయిదూళ్ళకా సంధి?

ఉ. తల్లడ మందఁ గౌరవశతంబును బట్టి యని న్మథింపనా?
ప్రల్లదు దుస్ససేనురుధిరంబు నురంబును వ్రచ్చి త్రావనా?
పెల్లు మనన్ సుయోధనుని పెందొడలన్ గద నుగ్గు సేయనా?
యూళ్ళయిదింటితో నృపతి యొప్పఁగఁ జేసెడుఁగాక సంధులన్. ౧౬.

ద్రౌప—(సంతోషముతో రహస్యముగా) ప్రాణేశ్వరా! ఇట్టిమాట నీవలన నెన్నఁడును వినలేదు. దానిని మరల నింకొక్కమాఱు పఠియింపుము.

భీము—(అది వినకయే) సహదేవా! చూడు.

"ఉ. తల్లడ మందఁ గౌరవశతంబును" 'అను పూర్వోక్తపద్యమును మరలఁ జదువుచున్నాఁడు.

సహ—అన్నయ్యా! మహారాజు పంపినసందేశ మంతయవ్యుత్పన్నముగా నున్నట్లు మీ రూహించుచున్నారా?

భీము—కాక మఱి యం దేమి వ్యుత్పత్తి యున్నది?

సహ—మహారాజు పంపిన సందేశ మిది.

భీము—ఎవరికి ?

సహ—దుర్యోధనునికి,

క. క్రమమున మాకిందప్రప్ర
స్థమును వృకప్రస్థమును నొసంగునది, జయం
తము వారణావతం బన
నమరెడునాల్గూళ్లు; కడమయది యే దైనన్. ౧౭.

భీము—అందులో నేమి యున్నది ?

సహ—ఇట్లు నాలు గూళ్ళను మాత్రము పేరుపెట్టికోరె. యాయిదవ దట్లు వక్కాణింపక పోవుటచేత విషభోజనము, లాక్షాగృహదహనము, ద్యూతసభాప్రవేశము మొదలుగాఁగల యపకారముల నెత్తిపొడుచుటగా మే మూహించుచున్నాము.

భీము—తమ్ముఁడా ! ఈలాగయినమాత్ర మేమిలాభము?

సహ—అన్నయ్యా ! ఇందువలన మహారాజుహృదయము స్వకులక్షయంబునకు జంకుచున్న దనియు, దుర్యోధనుఁడు సంధికి యోగ్యుఁడు కాఁడనియు లోకమునందు వెల్లడి యగును.

భీము—ఇది యంతయు ననర్థమే. మన మందఱ మీలా గడవులపాలయి వచ్చుచుండి, కురుకులక్షయంబు గావింప నెప్పుడు ప్రతిజ్ఞ చేసికొంటిమో యప్పుడే కౌరవులతో సంధి సేయఁ గూడమి వెల్లడి యయినది. మఱియు ధార్తరాష్ట్రకులము నిర్మూల మగునని యీవఱకే లోకమందుఁ బ్రసిద్ధ మయినది.

సహ—(సిగ్గుపడుచున్నాఁడు.)

భీము—ఏమీ ? మీకు సి గ్గగుచున్నదా? అట్లయిన నోరిమూర్ఖా !

తే. గీ. కోపమున శత్రుకోటిని రూపు మాప,
లోకములలోన మీకు లజ్జాకరంబు;
కూళ యొక్కఁడు రచ్చలోఁ గొప్పు వట్టి,
చేడె నీడ్వంగఁ జూచుట సిగ్గు గాదు. ౧౮.

దా—(రహస్యముగా) నాథా! వీరు సిగ్గులేనివారే; నీ వయిన నాపరాభవమును మఱచి పోకుము.

భీము—తమ్ముఁడా! ఏమిది పాంచాలి యాలస్యము చేయుచున్నది? నా హృదయము సంగ్రామావతరణమునకుఁ దత్తఱపడుచున్నదే.

సహ—అన్నయ్యా! ఆమె వచ్చి యెంత సే పయినది? మీరు రోషావేశమునఁ జూడరయితిరి.

భీము—(చూచియాదరముతో) దేవి! క్రోధాతిరేకమునఁజేసి సముక్షమున

నున్నను నిన్ను వీక్షింపనయితిని; కోపగించుకొకుము.

ద్రౌప—ప్రాణేశ్వరా! మీ రుదాసీను లయి యూరకున్నం గోపము గాని కుపితు లయినం గాదు.

భీము—దేవీ! అటు లయిన నింక నీపరాభవము పోయిన దని నిశ్చయము గాఁ దలఁచుకొమ్ము.

ద్రౌప—(విచారముతో నిట్టూర్పు పుచ్చుచున్నది.)

భీము—(చేయి పట్టుకొని ప్రక్కను గూరుచుండఁ బెట్టుకొని మోము చూచి) ఏమిది? దేవి యెందుకో విచారగ్రస్తురాలుగా నున్నట్టున్నది.

ద్రౌప—నాథా! మీరు సన్నిహితు లయి యుండఁగా నాకు విచారకారణ మేమి యుండును?

భీము—ఏమిది, తెలుపవు? (తలవెంట్రుకలు చూచి) సరే, తెలుపవలసిన దేమి?

తే. గీ. పాండురాజకుమారులు బ్రతికియుండి
సన్నిధిని బాయ కున్నను, సకలసౌఖ్య
భాజనం బగుపాంచాలరాజతనయ
యీదృశావస్థఁ బొందెడు నేమి చెప్ప? ౧౯

ద్రౌప—బుద్ధిమతికా! నాథునితో సకలంబును విన్నవింపవే; నాపరాభవమునకు మఱి యెవ్వరు ఖేదపడువారు?

చేటి—చిత్తము. (భీమునితో) కుమార! దేవిగారికి నింతకన్నను నధికమయిన వేఱొక కోపకారణము గలిగినది.

భీము—ఇంతకన్నను నధిక మయినదా? అ దేమి? చెప్పు చెప్పు.

ఆ. వె. ముక్తవేణి యయినముదిత నీకృష్ణను
ధూమశిఖనుబోలెఁ దొడరి యంటి,
కౌరవాన్వయంపుఁగారుచిచ్చునకును
శలభ మగుట కెవఁడు సాహసించె? ౨౦

చేటి—కుమారా! చిత్తగింపుము. ఇంతకుముందు దేవి యమ్మగారితోఁ గూడ సుభద్రాప్రముఖసపత్నీవర్గపరివృత యయి పూజ్యురా లగు గాంధారీదేవికిఁ బాదాభివందనము సేయఁ బోయెను.

భీము—మంచిపని, అట్లు చేయ వలసినదే. గురుజన మభివందనీయము గదా! తరువాత?

చేటి—తరువాత మరలి వచ్చుచుండఁగా భానుమతి యీమెను జూచినది.

భీము—(క్రోధముతో) ఆ! శత్రుభార్యకంటను బడెను గదా! ఎంతకష్టము! అట్లయిన దేవికిఁ గ్రోధస్థానమే. తరువాతఁ దరువాత?

చేటి—అట్లు దేవిగారిని జూచి భానుమతి తనచెలికత్తెమోమునఁ జూపు నిలిపి గర్వముతో నవ్వి యొకవాక్యము పలికెను.

భీము—ఆహా! కంటఁ బడుటయే కాక, మాట కూడఁ బడినదిగదా! ఓహో! ఏమి సేయుదుము? చెప్పు చెప్పు. ఏ మని?

చేటి—"ఓసి! యాజ్ఞసేనీ! మీ రేమో యయిదూళ్ళు నడుగుకొను చున్నారఁట. ఇది యేమే? ఇంకను నీతలవెండ్రుకల ముడుచుకొన కున్నావు!' అని.

భీము—సహదేవా! వినుచున్నావుగదా!

సహ—అన్నయ్యా! చెప్పెడిదేమి? అది దుర్యోధనునిభార్య గదా! చూడుఁడు.

క. వనితలకును సహవాసం
 బున మనములు భర్తృసదృశముల యయ్యెడు; నె
 ట్లన మధుర మయ్యు విషకుజ
 మున నల్లినవల్లి మూర్ఛపుచ్చుట లేదే?

భీము—బుద్ధిమతికా! అందుకు దేవి యే మన్నది?

చేటి—కుమార! పరిజనము లేనియెడల దేవిగారు పలుకుదురు.

భీము—అట్లయిన నీ వేమంటివి?

చేటి—"ఓ భానుమతీ! మీతలవెండ్రుకలు విడిపోకుండ మా దేవిగారితల వెండ్రుక లెల్లు ముడివేయఁబడు"' నంటివి.

భీము—(సంతోషముతో) బాగు! బుద్ధిమతికా! బాగు! మాపరిజనమునకుఁ దగినపలుకులు పలికితివి. (ఆభరణములు దానికి బహుమానమిచ్చి వెంటనే యాసనమునుండి లేచి) ఓపాంచాలరాజపుత్రీ! విచారింపకు. పెక్కుమాటలేల? శీఘ్రకాలములోనే నేను జేయునది చెప్పెద వినుము.

చం. ఛిలుఛిలుఁ ద్రిప్పుకొంచు గద, బిట్టు సుయోధనుఁ గిట్టి, పెందొడల్
 విఱుగఁగఁ గొట్టి, చేతులను వెచ్చని నెత్తుట నద్ది, నీకురుల్
 మెఱుఁగిడి, భీమసేనుఁ డవలీలను జిక్కుడలించి కూర్చెడుం;
 గొఱకొఱ యేల? దేవి! యిదిగో ముద మందెదు చూడు నీమదిన్. ౨౨

ద్రౌప—ప్రాణేశ్వరా! మీకుఁ గోపము వచ్చిన దుష్కర మేమియున్నది? మీసోదరులు గూడ మీయుద్యమము ననుగ్రహింప వలయును.

సహ—ఇది మాకును ననుమతమే.

(తెరలోపల మహాకలకలము)

అందఱు—(విస్మయముతో నాలకించుచున్నారు.)

భీము—మ. తతఘూర్ణద్ఘటవార్ధిమధ్యవిలుఠన్మంథాచలధ్వానధీ
రతఁ గోణాహతమై జగత్ప్రళయగర్జన్మేఘసంఘట్టచం
డతఁ గృష్ణోగ్రరుషాగ్రదూత కురురాణ్ణాశంకరోత్పాతమై
సతి! మత్సింహరవానుకారి రణనిస్సాణం బదే మ్రోఁగెడిన్.

(తొందరగాఁ గంచుకి ప్రవేశించుచున్నాఁడు.)

కంచు—కుమార! ఇదిగో! భగవంతుఁడు కృష్ణుఁడు—

(అందఱును దోసిలి పట్టి నిలుచున్నారు.)

భీము—ఏఁడీ, ఏఁడి! భగవంతుఁడు?

కంచు—పాండవపక్షపాతామర్షంబున సుయోధనునిచేత బద్ధుండు గాఁ బోయెను.

భీము—ఏమీ! బద్ధుఁ డయ్యెనా?

కంచు—లేదులేదు. తద్విషయక ప్రయత్నములు జరిగినవి.

భీము—అప్పుడు స్వామి యేమి చేసెను?

కంచు—పిమ్మట నమ్మహాత్ముం డాత్మీయవిశ్వరూపనిరుపమానదివ్యతేజోదర్శనంబునం గురుకులంబును సమ్మూర్ఛితంబు గావించి నిరాకరించి మనశిబిరంబునకుఁ జక్కవచ్చెను. దేవరవారిని శీఘ్రముగాఁ జూడఁగోరుచున్నారు.

భీము—(నవ్వుకొనుచు) ఏమి? దురాత్ముఁడు దుర్యోధనుఁడు భగవంతునే కట్టివేయుటకుఁ దలంచినాఁడు గా! (ఆకాశమువంకఁ జూచి) ఆ! దురాత్మ! కురుకులపాంసన! ఇట్టు లతిక్రాంతమర్యాదుఁడ వయిననీనాశనమునకయి పాండవక్రోధానలంబు నిమిత్తమాత్రమే సుమీ.

సహ—అన్నయ్యా! దురాత్ముఁ డాధుర్యోధనుఁడు వాసుదేవుని భగవంతునిఁ గాఁ దద్విశ్వరూపదర్శనమున నయినఁ దెలిసికొన లేదు గాఁబోలు?

భీము—తమ్ముఁడా! ఆదురాత్ముఁడు కేవలము మూఢుఁడుగదా! ఆయన నెట్లు తెలిసికోఁజాలును! చూడు.

శా. ధీరత్వంబున నిర్వికల్పకసమాధిం జిత్తముల్ నిల్పి, దు
ర్వారం బైనతమంబు జ్ఞానమున విధ్వస్తంబు గావించి, యా
త్మారాముల్ దిలకించుపెన్వెలుఁగు మోహాంధుండు దుర్యోధనుం
డేరీతిం, గని తాఁ బరాత్పరునిఁ గా నెంచంగ శక్తుం డగున్? ౨౮

భీము—అయ్యా! మైత్రేయ! ఇప్పుడు పెద్ద లేమిచేయ నుద్యోగించు చున్నారు?

కంచు—కుమార! మహారాజుగారియుద్యమమును మీరే వచ్చి తెలిసికొన వలయును. (నిష్క్రమించుచున్నాఁడు.)

(తెరలోపలఁగలకలానంతరము) ఓహో! ద్రుపదవిరాటవృష్ణ్యంధకసహదేవ ప్రభృతిభూతలాధినాథులార! అస్మదక్షౌహిణీపతులార! కౌరవచమూప్రధానయోధులార! మీరందఱు విన వలయును.

మ. మది సత్యప్రతిభంగసాధ్వసమునన్ మందీకృతం బయ్యె నె
య్యది, తాల్మిం గులకాంతి గోరి యొకచాయన్ విస్మృతం బయ్యె నె
య్యది, ద్యూతారణి ద్రౌపదీవసన కేశాకర్షణం బుట్టె నె
య్యది, యాధిష్ఠిర మాక్రోధాగ్ని కురువన్యాసీమ జృంభించెడున్. ౨౭

భీము—(ఆలకించి సంతోషముతోడను రోషముతోడను) విజృంభించుఁగాక! విజృంభించుఁగాక! ఆర్యక్రోధానలం బప్రతిహతప్రసారం బయ్యెడును.

(మరలఁ దెరలోపలఁ గలకలము.)

ద్రౌప—(విస్మయముతో) నాథా! విలయవలాహకనిర్ఘోషభీషణక్వణనంబగు రణదుందుభి యిప్పు డనుక్షణమును మ్రోయుచున్నది. ఎందుచేత?

భీము—సుందరీ! మ రేమియు లేదు; యజ్ఞము జరుగుచున్నది.

ద్రౌప—(ఆశ్చర్యముతో) హా! అది యేమి యజ్ఞము?

భీము—ప్రాణేశ్వరీ! రణయజ్ఞము.

మ. విను ఋత్విక్కుల మేము నల్వురము; నావెన్నుం డుపద్రష్ట; మా
యిశుఁడే యాజియు; సోమిదమ్మ వగు దీవే; కౌరవుల్ తత్పశుల్;
వనితాదుఃఖము నీఁగుటే ఫలము గా వర్తిల్లినయ్యాధ్వరం
బానకున్ రాజుల నందఱం బిలువఁగా మ్రోఁగింతు రాదుందుభిన్. ౨౮

సహ—అన్నయ్యా! అటు లయిన గురుజనానుజ్ఞ వడసి మనము గూడఁ బరాక్రమానురూపమున నాచరింపఁ బోవుదము.

భీము—తమ్ముఁడా! ఇదిగో నన్నగారియాజ్ఞపరికార మాచరించుటకు సిద్ధముగా నే యున్నాను. (లేచి) దేవీ! మేము కురుకులంబు నున్మూలించుటకుఁ బోయి వత్తుమా?

ద్రౌప—(కంటఁ దడి పెట్టుకొనుచు) నాథా! అసురసమరాభిముఖుం డగు హరికిఁ బోలె మీకు శుభం బయ్యెడును.

చేటి—కుమార! దేవిగా రింకొక్కటి పలుకఁ గోరుచున్నారు. "మీరు

వెండియు ఖండనంబునుండి చమ రెంచి తన్ను నూఱడింప వలయు'' నని.

భీము — దేవీ ! ఈకల్లబొల్లూఱడింపులతో నేమి ప్రయోజనము !

తే. గీ. పరిభవక్లాంతిలజ్జావిధురితవదనుఁ
గా, ననిశ్శ్వసిత క్రూరకారవునిఁగ
నింకను వృకోదరునిఁ జూడ విడి నిజంబు,
చారుశారదపూర్ణిమాచంద్రవదన! ౨౭

ద్రౌప — నాథా! ద్రౌపదీపరాభవోద్దీపితక్రోధానలంబున, నాలంబున నన వేక్షిత శరీరులరయి సంచరింపకుఁడు. రిపుబలము లప్రమత్తసంచారము లని విను చుందుము గదా!

భీము — ఓ సుక్షత్రియురాలా! యుద్ధరంగమున సంచరించుటకు మేము సమర్థులము సుమీ విను.

స్రగ్ధర. ఒండొంటి న్వైవ నుగ్గై యొఱగుకరులరక్తాక్తమేదంపురొంపిన్
మెండౌ తేరుల్ మునుంగన్, మెఱసి పయిపయిన్ మెట్టి మట్టాడజోదుల్,
మొండెంబుల్ పానగోష్ఠి న్మరయువఱడు లన్రొక్కఁగుతూర్యాళి నాడన్,
జండం బౌ భండనాబ్ధిం జడియరు తిరుగన్ శౌండు లౌ పాండుపుత్రుల్.

(అందఱును నిష్క్రమించుచున్నారు.)

గద్య. ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదలబ్ధసరసకవితాధురంధర వడ్డాది సాధువంశక్షీర
నిరాకరరాకాసుధాకరాచ్చనామాత్యపౌత్ర హారితసగోత్ర పవిత్రగుణకదంబ
లక్ష్మాంబాగర్భశుక్తిముక్తాఫల సూరపరాజపుత్రధానతనూభవ విబుధ
విధేయ సుబ్బరాయ నామధేయాంధ్రీకృత వేణీసంహార
నాటకంబునందుఁ బ్రథమాంకము.

శ్రీరస్తు.

శ్రీపరమాత్మనే నమః

వేణీసంహారనాటకము.

ద్వితీయాంకము.

—:o:—

(తరువాతఁ గంచుకి ప్రవేశించుచున్నాఁడు.)

కంచు — "వినయంధర! భానుమతీదేవి యమ్మగారికిఁ బాదాభివందన మాచరించి వచ్చిన దేమో చూచి రా. నే నామెను సందర్శించి యభిమన్యువధ విధాన ధౌరేయు లగు రాధేయజయద్రథప్రముఖులను బహూకరించుటకయి సత్వరముగా సమరతలమున కరుగ వలయు" నని దుర్యోధనమహారాజుగారు నాకాజ్ఞాపించినారు గదా! కావున నే నాలస్యము చేయరాదు. అన్నా! దుర్యోధనమహారాజుగారియాజ్ఞాబలము! ముసలితనముచేత నిల్లు కదలలేక మర్యాదామాత్రమునకు నంతఃపురమున వసించుచున్న నా చేతను గూడఁ బూర్ణముగాఁ బనిసేయించుచున్నది! సరి, నిష్కారణము నా ముదిమిని నిందింప నేల? అంతఃపురికు లయి విహరించు నెల్లవారికిని వేషంబును జేష్టలు ని.. వలెనే యుండును గదా! సందేహ మేమి?

మ. కనరా దింతలు కన్నులున్న; వినినం గారాదు విన్నట్లు; శ
క్తున కైనన్ విధి కట్టఁ జేకొనుట యుద్యోగంబుచే; నెల్లనో
మనమం దెప్పుడు జంకె యాట, నడకల్ మందంబు లౌఁ; గాన నే
వనజీవుం డగువాకు నన్ని మునుపే వచ్చెన్; జరం గల్గెనే!

(నడచి యాకాశమువంకఁ జూచి) విహంగికా! భానుమతీదేవి యత్తమామలకుఁ బాదవందన మాచరించి వచ్చినదా? (చెవియొగ్గి) ఏమంటివి? ఇప్పుడే నివర్తిత గురుదేవతాచరణాభివాదన యయి యాఱుదన పెనిమిటికి జయము గలుగవలెనని నేఁడు మొదలు నియమముతో బాలోద్యానమందలి దేవళమునఁ బ్రవేశించి యున్న — ? సరే, కల్యాణీ! నివు నీపనిలో నుండుము. నేనును దేవి యిక్కడ నున్న సమాచారము మహారాజునకు నివేదించెదను. (నడచి) మేలు! పతివ్రతా! మేలు! ఆఁడుదాన వయినను నీవే నయము గాని మహారాజు కాఁడు; ఏమనఁగాఁ బ్రబలులో దుర్బలులో వాను దేవసహాయు లగుపాండవేయు లెత్తి వచ్చుచుండ నిప్పుడు గూడ నీమహారాజుగా రంతః

పురవిహార మనుభవింపఁ గోరుచున్నారు (ఆలోచించి) ఈయనగారిచేష్ట లేమియు బాగున్నవి కావు

చ. అడిదము పట్టి చేర్చినది యాది, యకుంఠకుఠారుఁ డౌమునిం
గడిమిని గెల్చి భీష్ము నొకఁగంగ నొనర్చిరి పాండునందనుల్,
విడుకఁడు దానికే, మగఁటిమిం బలువీరుల నోర్చి క్రాంతుఁ డౌ
బాడుతని నొక్కనికే ధనువు వోయినవాని వధించి ప్రీతుఁ డౌ ౨

సర్వథా మాకు దైవమే మేలు చేయ వలెను ఇఁక నేను మహారాజునొద్దకుఁ బోయి దేవి యిక్కడ నున్న దని విన్నవించెదను (నిష్క్రమించుచున్నాఁడు)

(విష్కంభము)

(తరువాత నాపన్నురా లగుదేవియు సఖియుఁ జేటియుఁ బ్రవేశించుచున్నారు)

సఖి—సఖీ! భానుమతీ! అభిమానధనుం డగుదుర్యోధనమహారాజునకుఁ బట్టపుదేవి వయియుండియుఁ గలగన్నంతమాత్రమున కింత బేలవై చింతపడియెదే వేమి?

చేటి—దేవీ! సువదన యథార్థము వచించినది నిద్రపోయినవారి కేదయినఁ గలవరింత రాకయుండునా ?

భాను—చేటీ! ఇది యటువంటిది కాదు నిజముగా నీస్వప్నము నాకు నశుభమును సూచించుచున్నది

సఖి—ప్రియసఖీ! అటు లయిన నాస్వప్నమేమో చెప్పుమే మనసాంగముగా దాని దానధర్మములచేతను దేవతాకీర్తనములచేతను మార్వాదిపరిగ్రహణముచేతను దద్దోషము పరిహరించెదము

చేటి—సువదన లెస్సగాఁ బలికినది అకుశలదర్శనము లగుకలలు దేవతాప్రశంసవలనఁ గుశలపరిణామము లయ్యెడు నని వినుచుందుము గదా ?

భాను—అట్లయిన దానిని జెప్పెదను, సావధానవు గమ్ము

సఖి—ఆ! సావధానముగానే యున్నాము, చెప్పుము ప్రియసఖీ!

భాను—సఖీ! ప్రాణములు చెదరి పోయి పరాకు పడినదానను మెల్లమెల్లగాఁ జ్ఞప్తికిఁ దెచ్చుకొని యంతయు నీకుఁ జెప్పెద నుండు (విచారముతో నాలోచించుచున్నది)

(తరువాత దుర్యోధనుఁడు కంచుకియుఁ బ్రవేశించుచున్నారు)

దుర్యో—ఎవ్వఁడు చెప్పెనో కాని యిది గడు లెస్సయినమాట

క. వినిగూఢమొ, బహిరంగమొ,
ఘనమొ, స్వల్పంబొ, తానొ, కాకితరుండో,

పొనరించుట యుపకారం
బును నపకారులకు, నది పరిమోదము సేయున్ ౩

నిజమే గదా! సైంధవద్రోణకర్ణాదులచేత నభిమన్యుఁడు చచ్చుట విని, నాహృదయ మూపిరి పుచ్చినట్టే యున్నది

కంచు— దేవా! ఆచార్యశస్త్రపరిభావమున కిది దుష్కరము గాదు కర్ణజయద్రథులకు మాత్ర మిది యేమి గొప్ప?

దుర్యో—వినయంధర! కృష్ణుఁ డేమన్నాఁడు? విల్లు విఱిగి పోయినకుఱ్ఱవాని నొంటిగానిఁ జేసి పలువురు గూడుకొని చంపినా రనిగదా! మాకు

క. ఎదుట శిఖండిని బెట్టుక
ముదుకం డగు భీష్ము నాలమునఁ జంపుటచే
నెదిరికి నేమి యశంబో
యదియే మాకును ఘటిల్లె న ట్లగు నేనిన్ ౪

కంచు—(తెల్లఁబోయి) దేవా! దేవర యీలాగున సరిపెట్టుకొనఁ గూడదు దేవరవారిపౌరుషము మొక్క వోవు నని మం దెన్నఁ డయినఁ దలంచుకొంటివా? అందుచేత నట్లు మనవి చేసికొన్నాఁడను

దుర్యో—అవు నది నిజమే

తే. గీ. సేవకులతోడ బాంధవశ్రేణితోడ
హితులతోడఁ గుమారసంతతులతోడఁ
దమ్ముగమితోడఁ దా సుయోధనునిఁ గూల్చుఁ
దనబలంబున రణమందు ధర్మసుతుఁడు ౫

కంచు—(చెవులు మూసికొని భయముతో) హరి హరీ!

దుర్యో—వినయంధర! నే నేమన్నాఁడను

కంచు—"తే. గీ. సేవకులతోడ" (అనుపద్యముచదివి) దేవర యిట్లు విపరీతముగా ధర్మసుతుఁడు సుయోధను నని వచించితిరి

దుర్యో—వినయంధర! ఎప్పటివలె నాతోఁ జెప్పక, భానుమతి కేళికాగృహంబునుండి నేఁ డుదయము చక్కఁబోయినది అందుచేత నామనస్సు కలఁతపడి యున్నది ఆమె యెక్కడ నున్నదో చూపుము, ●

కంచు— దేవా! ఇటు విజయము చేయుఁడు

ఇద్దఱు—(నడచుచున్నారు)

కంచు—(ముందు చూచి యంతటఁ బరిమళ మాఘ్రాణించి) దేవా! చిత్తగింపుఁడు ఇదిగో! మంచుబిందువులచేఁ శీతలంబు లయినయీప్రభాతవాతపోతంబులు వీతెంచుటం బట్టియుఁ, గూలాయకూలంబుల మేలుకొని కర్ణరసాయనంబుగాఁగలకలధ్వనులు సేయుచుఁ బిట్టలు తమపట్టుపలను విదుర్చుటం బట్టియు, నట్టట్టు గడలి, తోడిమల ప్పెనదలి దళములమీఁగుగాఁ దిరులనుండి చూఁగలు శిరులు, పఱచినట్లు తెల్లయెడలను దఱచుగాఁగాఁ, జాడ వేశక పుట్టించుచు, గరుమ్మగ న్మని కమ్మతావులు వెదచల్లుచున్న యీబాలోద్యానంబును దేవర యవలోకింప వలయును చూడుఁడు,

ఈ రాతిరి వచ్చి, పంచును నూఁగుదు లోపల నేకసును
వాత్రియుతోడఁ దాము సఱ వాఁడు నేలనురాలి గాలునా
ర వ్యతపయోగభిన్నముకు నంతరవాసన లాస కొల్పఁగా,
నీతతిఁ దమ్మిమొగ్గలకు నేగడు జా మ్మని గంధదుమ్మెదల్ ౬

దుర్యో—(పొఱఁజూచి) వినయంధర! ఈప్రభాతమున ని ... యము గను ... యముగా నున్నది చూడుము

ఉ అల్లన విచ్చుచో దళదళాంతరజాలగభానుహస్తముల్
మెల్ల నొడఁబడ సోఁక నెకిమాఁడ్రిను నొలెను నాంధ్రితోడ ...
గిల్లుచు మేలుకాంచి, వలపించుక మైకలపంబు దెల్ప, ను
ల్లసదగ్రమృదుమోహనశయ్యల వీడుఁ దుమ్మెదల్ ౭

కంచు—దేవా! ఇదిగో! భానుమతీదేవి నుదనచేతను దర ... చేతను ... చున్నది దేవర యచ్చోటికి విచ్చేయుఁడు

దుర్యో—(చూచి) ఓయీ! వినయంధర! ఇదిగో! దేవిని సందర్శించి నేనును నీవెనువెంటనె వచ్చెదను నీవు పోయి పోరితంబునకుఁ దేర యియ్యంగ నేయుము

కంచు—చిత్తము! ఇదిగో! సిద్ధపఱిచితిని (నిష్క్రమించుచున్నాఁడు)

సఖి—ప్రియసఖీ! జ్ఞప్తికి వచ్చినదా?

భాను—ఆ, వచ్చినది సఖీ! విను నేనీప్రమదవనంబునఁ గూరుచుండియుండఁగా, సమధికదివ్యరూపము గల యొకముంగిస యపురూపముగా నాయెదురను నూఱుపాముల రూపు మాపెను

ఇద్దఱు—(వెనుకఁ దిరిగి తమలో) హరిహరీ! (ప్రకాశముగా) తరువాతఁ దరువాత?

భాను—అయ్యో! నాహృదయము సంతాపసదన మయి క్రమ్మఱ మఱచి పోయెనుగదా!

దుర్యో—(చూచి) ఓహో! దేవి భానుమతి సువదనాతరళికలతోడ నేమేమో మంతన మాడుచున్నది. కానీ. దట్టముగా నల్లుకొనియున్న తీఁగెలగుంపుమాటునఁ బొంచి యుండి, వీరివిస్రంభసంభాషణముల నాలకించెదను. (అట్లు చేయుచున్నాఁడు)

సఖి—సంతాపము శాంతిపఱుచుకొని ప్రియసఖీ! చెప్పవమ్మా.

దుర్యో—ఏమి చెపుమా యీమెకు సంతాపకారణము? సరే. నేఁడు నాస భవనంబునుండి నాతోఁ జెప్పకుండ లేచి వచ్చినది గదా! కనుక నీమెకు నామీఁదఁ గోపము వచ్చినట్లు స్పష్టమగుచునే యున్నది. ఓభానుమతీ! దుర్యోధనుఁడు నీకోప మునకుఁ దగనివాఁడు సుమీ.

మ. అలుగన్ సల్పితినో ప్రమాదమునఁ గంఠాశ్లేషశైథిల్య, మా
వలమో మైతినొ నిద్ర నొత్తిగిలి, నాపై పీవు పన్నుండఁగాఁ?
గలలోఁ బ్రేలితినో పరాంగనకథల్? గావించినా నేదియో;
చెలి, యింతేటికి? నన్ను దానునిబలెన్ జీవాట్లు పెట్టం దగున్. ౮

(ఆలోచించి) అటు గాక పోయినను.

తే. గీ. మిగులఁ జిత్తంబు నాయందె తగులుఁ గాన,
సంతతప్రేమబద్ధమత్సరము చేత,
లేమ నామీఁద నపరాధలేశ మేదొ
మోపి కోపించె నిందుఁ బ్రేముడిని; నిజము. ౯

అయిన నేమి చెప్పనో వింద ము.

భాను—సఖీ! తరువాత నే నాసుందరనకులసందర్శనంబున మనంబున నానం దంబు నొందితిని.

దుర్యో—ఏమిది! సుందరనకులసందర్శనంబున మనంబున నానందంబు నొంది తివి గా! హా! మాద్రీసుతానురక్తురా లగుదీనిచేత మేము నిష్కారణము మోసపోయి తిమి. (ముం దనినమాట స్మృతికి వచ్చి)

తే.గీ. "మిగులఁ జిత్తంబు నాయందె తగులుఁ గాన"

(అనుపద్యము చదివి) మూఢదుర్యోధన! అంకులాఁడిచేత వంచితుఁడ వగుట యెఱుం గక నిన్నెన్నివిధములనో మన్నించుకొన్నాఁడవు. మఱియిప్పు డేమనియెదవు?

"మ. అలుగన్ సల్పితినో"

(అను పైపద్యము చదివి దిక్కులు చూచి) ఔరా! ఇందుకా దీనికిఁ బొద్దుట నే నిర్జనస్థలమును, సఖీజనసల్లాపములును? మోహవశంబున దుర్యోధనుం డీయంకులాఁడి లో గుట్టును దెలియలేక యేమేమో భ్రాంతిపొందెను. ఆ! ఓసిపాపాత్మురాలా! ఓసి కళత్రపాంసులా!

ఉ. సన్నిధి వంత నీ కడలు, సాహసము ల్గన నింతలేసి; న
న్నన్నుట లట్టు, నీవినయ మేదిన ప్రేమను లిట్టు; నాకు నీ
మన్నన యావిధంబు, కోటమాలినవర్తన మీవిధంబు; నీ
తిన్ననివంగసం బదియుఁ, దెచ్చినమచ్చ యి దయ్యె; జారిణీ! ౧౦

సఖి—తరువాతఁ దరువాత?

భాను—తరువాత నే నిప్పుడు గూరుచున్న యీలతామంటపము ప్రవేశించితిని. తోడనే యానకులకుమారుండు నన్ననుసరించి యీపూవుటీరముఁ జేరవచ్చెను.

దుర్యో—అహో! ఈపాపాత్మురాలికి సిగ్గు లేకున్నది! ఇది కులటల కుచితమేగదా,

తే. గీ. చిరతరాబాల్యవర్థితస్నేహ యయ్యుఁ
జెప్ప లజ్జించు నారతిచిన్నె లెవరి
కట్టిచెలికత్తెలకు అంకులాఁడితనమె
చెప్పుచున్నది కానంత సిగ్గు లేక. ౧౧

ఇద్దఱు—తరువాతఁ దరువాత?

భాను—ఆవెనుక నానకులకుమారుండు గర్వముతో మీఁదమీఁదికి వచ్చి తనచేతితో నాపయింటకొంగును దొలంగించెను.

దుర్యో—(క్రోధముతో) సరే. ఇఁకఁ బయిసంగతి విన నక్కఱలేదు. కానీ, పరవనితాహరణప్రగల్భుం డైన యామాద్రీసుతాధముజీవితమును నే నపహరించెదను. (కొంచెము నడచి యాలోచించి) అటుగాదు. ఇదియే మిగులం బాపాత్మురాలు. దీని నే ముందుగా సంహరింపవలయును. (అని మరలుచున్నాఁడు.)

ఇద్దఱు—తరువాతఁ దరువాత?

భాను—సఖీ! అటుమీఁదట మహారాజుగారి ప్రాభాతికశోభాకరమంగళమృదంగాదివాద్యంబులచేతను, వారవిలాసినీసరససంగీతభంగీతరంగంబులచేతను మేలుకొంటిని.

దుర్యో—(సవితర్కముగా) ఏమిది? మేలుకొంటి ననుచున్నదే. స్వప్నదర్శనవృత్తాంతము చెప్పుచున్నదా యేమి చెపుమా? (ఆలోచించి) కానీ. సఖీవచనంబున స్పష్ట మగును.

ఇద్దఱు—(విషాదముతో నొండొరులను జూచుకొని)

సువదన—ఇందలి యమంగళమును బవిత్రము లగుభాగీరథీప్రముఖపుణ్యనదీతోయములచేత, నమోఘము లగుబ్రాహ్మణాశీర్వాదములచేతను బ్రజ్వలితహుతాశనహోమములచేతను బరిహరింతము.

దుర్యో — చాలు నాచిత్తశకల్పము. నిశ్చయముగా నీమె స్వప్నదర్శనమే వర్ణించుచున్నది. నేనే మందబుద్ధి నయి యన్యథా తలంచితిని.

చ. అరసగ మాలకించి చనఁగాంచితిని గోధ్రమున్తో, నదృష్టమే;
పరుసము లాడఁగాంచితిఁ గొలుపల్కుల కల్కి జనించి, పుణ్యమే;
సరి యని నేను నమ్మఁగ వెసం గథయుం దుద ముట్టె, దిష్టమే;
తరుణి నిరాపనిందఁ బడి ధాత్రికిఁ బాయుటఁ దప్పె, భాగ్యమే. ౧౨

భాను — సఖీ! ఇందేమి శుభసూచక మున్నదో చెప్పుము.

ఇద్దఱు — (ఒండొరులను జూచుకొని వెనుకఁ దిరిగి) ఇందుఁ గొంచెమైనను శుభసూచకము లేదు. అసత్యము చెప్పుట మిగుల నపరాధముగదా? సఖుల నడిగి నప్పుడు కఠినముగా నున్నను హితమునే చెప్పవలయును. (ప్రకాశముగా) సఖీ! ఇది యంతయు నశుభమునే సూచించుచున్నది. కాఁబట్టి దూర్వాదిపరిగ్రహంబు చేత, దేవతాప్రణామంబుచేత, నిది పరిహరింపఁబడును. నకులమునుగాని మఱి దేనినిగాని కోఱలు గలజంతువును గలయందుఁ జూడఁ గూడదు. మఱియు నూఱు పాములను వధించుటగూడ స్వప్నమందుఁ జూడ రానిదే.

దుర్యో — సువదన యథార్థము పలికినది. నకులముచేతఁ బన్నగశతవధంబును స్తనాంశుకహరణంబును నిశ్చయముగా మా కరిష్టదర్శనముగా నూహించుచున్నాను.

తే. గీ. చూడఁ బర్యాయమున శుభాశుభము లైన
స్వప్నములు రాక యుండవు జనులకెల్ల;
నూఱు ఱనెడులెక్కచే నూహపాటు మదిని
దమ్ముగమితోడ నాకిది దగిలినట్లు.

(ఎడమక న్నదరుట సూచించి) ఆ! దుర్యోధనుఁడ నయిననాకుఁ గూడ నిమిత్తములు చిత్తవిక్షోభమును గావించుచున్నవి! (గర్వముతో) ఇది యెట్లు! భీరుజనహృదయప్రకంపనము లయిన యిట్టివానియెడల దుర్యోధనున కేమి లక్ష్యము? ఈయర్థమున నంగిరసుఁ డిట్లు చెప్పుచున్నాఁడు.

తే. గీ. కాకతాళీయముగ మూఁడు గల్గు చుండు.
స్వప్నశకునంబులును గ్రహచారములును;
బిఱికివారలు వానికి బెదరు చుండ్రు;
ప్రాజ్ఞు లాచందమున భయపడరు మదిని. ౧౪

కాఁబట్టి స్త్రీస్వభావముచేతఁ జులుకనగాఁ గలిగిన యీభానుమతిమనసులోని వెఱ్ఱిభయమును నేను బోఁగొట్టెదను.

భాను—సఖీ! సువదనా! ఉదయపర్వతశిఖరంబుమాటుననుండి తనయరదంబు బయలుదేఱ, సంధ్యారాగంబు పోయి ప్రసన్నం బైనదురాలోకతేజోమండలంబు తోడ మార్తాండుం డదె యుదయించుచున్నవాఁడు. చూడుము.

సఖి—సఖీ! రోషాన్వితకర్ణకాంతిసశ్రీకం బయినతనకిరణసహస్రంబును, నిబిడముగా నల్లుకొనినయావల్లికావృతులసందులనుండి వ్యాపింపఁజేసి, యుద్యానవనాంగణంబునకు బంగారునీరు వోయుచు, దాయలకుం జూడ నలవికాకుండునట్లు, వేఁడివెలుంగు నింగి నలంకరించుచున్నవాఁడు. ఇమ్మహామహునకు లోహితచందన కుసుమగర్భం బగునర్ఘ్యంబు నొసంగ నిది మంచిసమయము.

భాను—చేటీ! తరళికా! అర్ఘ్యపాత్రము నిటు తే. భగవానుఁ డయిన యీ యుదయభానునిపూజ నిర్వర్తించెదను.

చేటి—దేవీ! చిత్తము. (నిష్క్రమించి మరలఁ బ్రవేశించి) దేవీ! ఇదిగో నర్ఘ్యభాజనము. ఈబాలభానునిసపర్య నిర్వర్తింపుము.

దుర్యో—ప్రేయసీసమీపమునకుఁ బోవ నిదియే మంచిసమయము. (పోవుచున్నాఁడు.)

సఖి—(చూచి తనలో) ఎందుకో మహారాజు వచ్చుచున్నాఁడు. అయ్యో! ఈమెనీమమునకు భంగము గలుగును గదా!

భాను—(సూర్యున కభిముఖి యయి) దేవా! గగనసరోవరవిరాజమానవికచారుణసహస్రపత్రశోభాకరా! పురందరహరిత్సుందరీవదనారవిందసందీపితసిందూరతిలకా! సకలభువనైకరత్నప్రదీపా! కృపాయత్తచిత్తంబున నావందనంబుఁ జేకొని, నేఁడు నాకుఁ గలిగినయీస్వప్నమందు నేమికీ డున్నను నదియంతయు సభ్రాతృకుం డగునాప్రాణనాయకునకుఁ గుశలముగాఁ బరిణమింపం జేయుదువుగాక! (అర్ఘ్యమిచ్చి) ఓసీ! తరళికా! ఇతరదేవతలఁ గూడఁ బూజించుటకుఁ బుష్పముల నిటు లందిమ్ము. (చేతులు సాఁచుచున్నది.)

దుర్యో—(చేసన్న చేతఁ బరిజనమును దొలఁగించి, తానే పువ్వుల నందియ్యఁ బోయి స్పర్శసుఖము నభినయించుచుఁ, బరవశమునఁ బుష్పముల నేల జాఱవిడిచినాఁడు.)

భాను—(కోపముతో) ఏమీ! పరిజనమున కింత మయిమఱపా? (మరలి రాజును జూచి భయపడి సిగ్గుపడుచున్నది.)

దుర్యో—దేవీ! ఇటువంటిసేవావకాశమందు నీపరిజనుఁడు మిక్కిలి చేతఁగానివాఁడు; దేవిగారు వీనిని శిక్షించి దిద్దుకొన వలయును. ఓ ప్రియురాలా!

తే. గీ. కలికి! నీసోగ తెలిదొరగంటిచూపుఁ,
బడయ నాసించులెంకచో భయము దగునె?
మందహాసాంకురము మోవి మలయఁ బలుకు;
మాడిగము సేయ దోసిలి యొగ్గి యుంటి.

భాను—మహారాజా! నాకుఁ గొండొకనియమమం దభిలాష గలదు. దేవర యనుగ్రహించి యభ్యనుజ్ఞ నీయ వలయును.

దుర్యో—దేవీ! నిస్వప్నవృత్తాంతము నంతయు నాలకించినాఁడను. ప్రకృతి సుకుమార మయినయీశరీరము నేల యిట్లు గాసిల్లఁ జేసెదవు?

భాను—ప్రాణేశ్వరా! నాహృదయము నతిశయముగా సంశయము బాధించుచున్నది. దేవర నా కనుజ్ఞ నీయ వలయును.

దుర్యో—(గర్వముతో) దేవీ! చాలు నీశంక. చూడు,

మ. ధర గుర్వింగం దెస లన్ని నిండుటలు వ్యర్థంబె మదక్షోహిణుల్?
గురుతో నేమిఁకఁ? గర్ణుఁ డేపనికి నోర్కొ నీయెడల్ గాసిలన్?
తరుణీ! భ్రాతృశతాస్మదీయభుజకాంతారాంతరస్వైరసం
చరదుర్యోధనకేసరీంద్రగృహిణీ! శంకింప నీ కేటికిన్? ౧౬

భాను—ప్రాణేశ్వరా! మీరు సన్నిహితులై యుండఁగా నాకు శంక యేమి? మఱియు మన్న దేవరకే మనోరథసిద్ధి గావింప నభిలషించుచున్నాను.

దుర్యో—ఓసుందరీ! మాకిదే మనోరథము. ఎల్లప్పుడును స్వేచ్ఛను నీతోఁ గూడి విహరింప వలయును. చూడు,

ఉ. కూరిమి నిశ్చలంబు లగుగొప్పకను ల్వ్రాలితమ్ముల న్నగన్,
దోరపుసిగ్గునం బలుకు దొట్రిల, లోఁ జిఱున వ్వెలర్ప, లా
క్షారసరక్తమౌ పెదవి చక్కెర చిమ్మఁగ, ముద్దు గాఱుసిం
గారపునీముఖేందురుచికన్నను దుర్లభ మేది నా కిలన్? ౧౭

(తెరలోఁ బెద్దకలకలము. అందఱు నాలకించుచున్నారు.)

భాను—(రాజును గౌఁగిలించుకొని) ప్రాణేశ్వరా! రక్షింపు రక్షింపుఁడు.

దుర్యో—(పాఱఁజూచి) ప్రియురాల! భయపడకు భయపడకు.

శా. మ్రాఁకుల్ పెల్లగిలంగ, స్కంధకషతన్ గ్రమ్మంగ ధూమంబు, దం
డాకారభ్రమధూళి రేఁగఁగఁ దృణవ్యాప్తిం దివిన్, శర్కరా
వ్యాకీర్ణం బయి, పెద్దచప్పు డెగయం బ్రాసాదగర్భంబులన్,
లోకం బాకుల మొంద, గాలి విసరెన్; లోలాక్షి! జం కేటికిన్? ౧౮

సఖి—మహారాజ! మేఘము గ్రమ్మినట్లు కటుకుదుమ్ము భూమినుండి యెగసి కన్నులు దెఱవఁ కుండఁ జేయుచున్నది. పెళపెళారావముతోఁ బెద్దపెద్ద

చెట్లు విఱిగి పడియెడుచప్పుడులు విని బెదరి, లాయముల నున్నయుత్తమతురంగంబులు కట్లు దెంచుకొని యట్టిట్టుఁ బరుగెత్తుచున్నవి. పనివాండ్రందఱుఁ దమతమ పనులు నిలిపి వేసికొని యూరకుండిరి. అహో! ఈదారుణసమీరణాసారంబు సర్వవిధంబులఁ జెఱుపు చేయుచున్నదిగదా! దేవర యింక నిక్కడ లేచి యీదారుపర్వతప్రాసాదము ప్రవేశించుట యనుకూలము.

దుర్యో—ఈసురకరువలి దుర్యోధనునకు మహోపకారి గాని మాఱుతుండు గాఁడు సుమీ. ఈతనిపుణ్యంబునం గాదె యీదేవి తననీమమును మాని నామనోరథము దీర్చినది.

మ. కనుబొమ్మల్ ముడి వేయ లేదు; కనులం గ్రమ్మంగ లే దశ్రులున్;
గినుకన్ మోము మటు చేయ లేదు; శపథోక్తిం బల్కి వారింపలే;
దనుఁ గుంజన్ను లురమ్ము గాఁడఁ జెలి గాఢాలింగనం బిచ్చె, హా
యని సౌఖ్యాబ్ధిని దేల నామనసు వాత్యాచక్రభీతాత్మ యై. ౧౯.

కావున సంపూర్ణమనోరథుండ నగునాకు స్వేచ్ఛావిహారము గావలసినదే దారుపర్వతమునకుఁ బోవుదము. (అందఱు నోరుగాలిబాధను నిరూపించుచుఁ గష్టముగా నడచుచున్నారు.)

దుర్యో—క. అడుగులు మెలమెల్లగ నిడు;
పడఁకుచు నడువంగఁ బోకు; పడెదవు సుమ్మీ
పడఁతీ! భుజలతికలు నా
మెడకును బెనవేయుము మురము మెఱమఁగఁ జన్నుల్ ౨౦

(ప్రవేశము నిరూపించి) ప్రియురాలా! ఈగర్భగృహము సంవృతమగుటవలన వాయు విందుఁ బ్రవేశింప నేరదు; నలుసులు దుడుచుకొని కన్నులు చక్కఁగాఁ దెఱువుము.

భాను—(సంతోషముతో) అమ్మయ్యా! అదృష్టముచేత నీప్రళయవాయువునకుఁ దప్పితిమి.

సఖి—మహారాజ! ఈదారుపర్వతారోహణశ్రమమును మాప్రియసఖి యూరుయుగళము సహింపఁ జాల కున్నది. దేవరవారు వేదికాసనము నింకను నలంకరింప కున్నారేమీ?

దుర్యో—(దేవిని జూచి) దేవీ! వాత్యాసంభ్రమమున నీకుఁ గలిగినయుపకార మల్పమే. అయినను,

చ. కనుఁగవ పెద్ద దౌట, నధికశ్రమ సల్పెడు నల్పరేణువుల్;
ఘనకుచ మాట లౌ, మ్మలఁతికంపముచేతనె ధూతహార మౌఁ;

బెనుచును గంపమున్ జఘనవిస్తృతి యూఁరుల కల్ల నేగినన్;
గనుఁగొన నీశుభాంగములు గాలికిఁ దోడ్పడె బాధ సేయుటన్. ౨౧

(అందఱును గూరుచున్నారు.)

దుర్యో—ఆహా! ఏమిది! దేవి యనాస్తరణ మైనకఱకురాలి నేలను గూరుచున్నది.

తే. గీ. జిలుఁగుఁబుట్టంబు గాలికిఁ జెదర, నాకుఁ
గనులపండువు సేయునీఘనజఘనము,
వలవదే గారపింప, నావలువ యెగయు,
సువిద! నీ చూపుఁ దనుపునాయూరుయుగము? ౨౨

[తెరను జిమ్ముకొని తత్తరపాటుతోఁ గంచుకి ప్రవేశించుచున్నాఁడు.]

కంచు—దేవా! భగ్నమయినది, భగ్నమయినది.

(అందఱుఁ దెల్లఁబోయి చూచుచున్నారు.)

దుర్యో—ఎవనిచే?

కంచు—స్వామీ! భీముచే.

దుర్యో—ఆ! ఏమిరా ప్రేలెదవు?

భాను—ఓయీ! ఏమి చెఱుపు చెప్పుచున్నావు?

కంచు—(భయముతో) ఇదిగో! సర్వము మనవిచేసెదను.

తే. గీ. భగ్నమయినది భీముచేఁ బవనుచేత
నూతనం బైనమీరథకేతనంబు;
కింకిణీక్వాణమున నది క్రిందఁ బడియె,
రోదనము చేయునది వోలె మేదినీశ. ౨౩

దుర్యో—బలమయినగాలి కొట్టినందున లోకమే వ్యాకులమయినది. ఇఁక రథమున కెత్తినజెండా విఱిగి పడుట యేమి వింత? అంతమాత్రమున కింత ప్రళయముగా "భగ్నమయినది భగ్నమైనది" యని ప్రలపించెద వేమి?

కంచు—దేవా! మఱేమి లేదు గాని, యీయనిమిత్తము నుపశాంతి చేయుటకయి దేవరవారితో విన్నవింపుమని స్వామిభక్తి నన్నిట్లు పలికించినది.

భాను—ప్రాణేశ్వరా! ప్రసన్నబ్రాహ్మణవేదానుఘోషమునను, హోమమునను, నీయనిమిత్తము పరిహరింప వలయును.

దుర్యో—సరే, నీవు పోయి పురోహితుఁ డయినసుమిత్రునితోఁ జెప్పు.

కంచు—చిత్తము దేవా! (నిష్క్రమించుచున్నాఁడు.)

(ప్రతీహారి ప్రవేశించి, జడియుచు దగ్గఱఁ బోయి)

ప్రతీ—జయముజయము మహారాజా! దేవా! అల్లుఁ డయినసింధురాజుగారి తల్లియు, నమ్మాయి దుస్సలయును వచ్చి ద్వారముకడ నిలిచి యున్నారు.

దుర్యో—(తనలో) ఏమి? జయద్రథమాతయును, దుస్సలయునా? అభిమన్యువధామర్షితు లైనపాండుసుతులచే నేదేని మహోపద్రవము సంభవిల్లినది కాదు గదా? (ప్రకాశముగా) పోయి వారిని వేగముగాఁ దీసికొని రా.

ప్రతీ—చిత్తము దేవా! (నిష్క్రమించుచున్నది.)

(తరువాతఁ దొట్రుపడుచు సైంధవునితల్లియు దుస్సలయుఁ బ్రవేశించుచున్నారు.)

ఇద్దఱు—(ఏడ్చుచు దుర్యోధనునిపాదములమీఁదఁ బడుచున్నారు.)

మాత—కురునాథా! రక్షింపుము రక్షింపుము.

దుస్సల—(రోదనము చేయుచున్నది.)

దుర్యో—(తొందరపడి లేచి) అమ్మా! ఊఱడిల్లు మూఱడిల్లుము. ఏమి యుపద్రవము వచ్చినది? యుద్ధరంగమున నప్రతిహతరథుండగు జయద్రథుఁడు కుశలమే కదా?

మాత—ఏమి కుశల మోయితండ్రి!

దుర్యో—ఎందువలన?

మాత—(భయముతో) పుత్రవధసంజాతక్రోధంబున మండి పడుచు గాండీవి సూర్యుం డస్తమింపక మున్న యతనిని వధించుటకుఁ బ్రతిజ్ఞ పట్టినాఁడు

దుర్యో—(చిఱునవ్వుతో) ఇదా యంబకును దుస్సలకును బెద్దదుఃఖకారణము? పుత్రశోకముచేతఁ గాల్పఁబడుచుఁ బ్రేలినకిరీటిమాటలచేతనిట్టియవస్థను బొందుచున్నారు. ఆహా! అబలల బేలతనము! అమ్మా! ఇంక విచారము చాలింపుము. అమ్మాయీ! దుస్సలా! కంటఁ దడి పెట్టకుము. దుర్యోధనబాహుపరిఘసంరక్షితుండును మహారథుండు నగుజయద్రథుని ధనంజయుఁడు ప్రధనంబున నెట్లు నిధనంబు నొందింపఁగలఁడు?

మాత—కుమార! బంధువధచేతఁ గలిగినదుఃఖమునఁ గోపాగ్నులు ప్రజ్వలింప వీరావేశంబున వారు శరీరంబు లాశింపక తిరుగుచున్నారు.

దుర్యో—(పక్కున నవ్వి) అది నిజమే. పాండవుల క్రోధము జగత్ప్రసిద్ధమే కదా! చూడు,

ఉ. ముంగలఁ బట్టి యీడుచుచుఁ బుట్టము లొల్వఁగ దుస్ససేనుఁ, డే
నందఱిలోన నోసిశశువా! పశువా, యని కృష్ణ నంటె; నాఁ
డందున లేఁడె గాండివి? యహో! వినుఁ, క్షత్రియవంశమందుఁ బు
ట్టొందినపిన్నవాని కిఁక నున్నవె యెక్కుడుక్రోధహేతువుల్? ౨౮

మాత—అయ్యో! యీప్రతిజ్ఞ నెఱవేఱకపోయినఁ దాను జచ్చిపోవుటకుఁ గూడఁ బ్రతిజ్ఞఁ జేసికొనె నోయితండ్రి!

దుర్యో—అట్లయిన మఱియు మేలే. మోదము నొందుటకు బదులు ఖేదము నొందుచున్నా రేమి? తమ్ములతోఁ గూడ ధర్మరాజు రూపు మాసె నని తలఁచి సంతోషింపుఁడు. అమ్మా! కురుకుమారశతపరివారవర్ధితమహిముండును, కృపద్రోణాశ్వత్థామాదిమహారథద్విగుణీకృత నిర్వక్రవిక్రముండును నగునీకుమారుని పైనైన దలపెట్టుటకుఁ గవ్వడి గాని మఱి యెవ్వఁడు గాని సమర్థుండు గాఁడు. ఉమ్మను. ఓసికొడుకుశక్తి తెలియనిదానా!

తే. గీ. భీముబలమును, వివ్వచ్ఛువిక్రమంబుఁ
దలఁచి ధర్మజుఁ గవలను దలఁప రాదు;
వారిలో నైన నెదిరించువాఁ డెవండు,
చేత విలు పూని నిలిచినసింధురాజు?

భాను—దేవా! అది నిజమే. అయినను గురుకృతప్రతిజ్ఞాభరుండగు భీభత్సుండు భయానిదానుండే గదా!

సూత—అమ్మాయీ! బాగున్నది. కాలమునకుఁ దగినట్టు లాలోచించితివి.

దుర్యో—ఆ! దుర్యోధనుఁడ నైననాకుఁ గూడఁ బాండవులు భయనిదానులా? చూడుము,

స్రగ్ధర. కోదండజ్యాకిణాంకుల్ కుటిలరిపుజనక్షోభు లాముక్తవర్మల్
సైదోడుల్ నూర్వు రచ్ఛాభ్జవన మనుకొనన్ ఛత్రముల్ దాల్చి రాఁ, బె
ల్లౌదు మ్మాదిత్యుతేజ మ్మడఁప నసివిభావ్యాప్తిఁ జూడంగ రా క
చ్చోఁ దామై నాదుసేనల్ సొరిది రణమునం జొచ్చు మాత్సర్య మొప్పన్.

ఓభానుమతీ! పాండవపరిభావము తెలిసినదానా! నీవు కూడ నిట్లు భయపడెదవేమి? చూడు,

తే. గీ. దుస్ససేనునురమ్ము నెత్తురులు గ్రోల,
గద సుయోధనుతొడలు భగ్నముగఁ జేయఁ,
జేయరే వారు ప్రతినలు? సింధురాజుఁ
జంపుశపథంబు నట్టిదే; జంక నేల? ౨౮

ఓరీ! యెవఁడురా అక్కడ? శీఘ్రముగా మాజయరథమును దీసికొని రా. ఇప్పుడే యాప్రల్లదుని మిథ్యాప్రతిజ్ఞునిఁ గావించి, వానికిఁ బవిత్ర మైనశస్త్రమరణము లేకుండఁ జేసెదను.

(కంచుకి ప్రవేశించుచున్నాఁడు.)

కంచు—దేవ!

తే. గీ. జాళువాచిఱుగంటలు శ్రావ్యముగను
మొరయఁ, బ్రాలంబచామరంబులు వెలుంగ,

వల్గితాకులహయములఁ బన్ని తెచ్చె
రథము క్షపితారిహృన్మనోరథము, దేవ ! ౨౮

దుర్యో — దేవీ ! నీ వంతిపురమున కేగుము. నేను నాప్రల్లదుని మిథ్యాప్రతిజ్ఞునిఁ గావించి తెల్లఁబుచ్చి వానికిఁ బపిత్ర మయినశస్త్రమరణము లేకుండఁజేసెదను.

(అందఱును నిష్క్రమించుచున్నారు.)

గద్య. ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదలబ్ధసరసకవితాధురంధర వడ్డాది సాధువంశక్షీర
నీరాకరరాకాసుధాకరాచ్చనామాత్యపౌత్ర హారితసగోత్ర పవిత్రగుణకదంబ
లక్ష్మాంబాగర్భశుక్తిముక్తాఫల సూరపరాజప్రధానతనూభవ విబుధ
విధేయ సుబ్బరాయ నామధేయాంధ్రీకృత వేణీసంహార
నాటకంబునందుఁ ద్వితీయాంకము.

శ్రీరస్తు.

శ్రీపరమాత్మనే నమః

వేణీసంహారనాటకము.

తృతీయాంకము.

—:o:—

రంగము—యుద్ధభూమి.

(తరువాత వికృతవేషముతో నొకరాక్షసి ప్రవేశించుచున్నది.)

రాక్షసి—(వికృతముగా నవ్వి సంతోషముతో) చచ్చిపోయిన మనుష్యుల మాంసముతోడను వసతోడను వేయికడవలరక్తము సంపాదించి యుంచితిని. ప్రతిదినముఁ దృప్తిదీఱఁ ద్రాగెదను. ఈ యుద్ధము నూఱేండ్లు వర్థిల్లఁ గాక. (సంతోషమున గంతులు వేయుచు) సైంధవవధ జరిగించిననాఁడు వోలెఁ బ్రతిదినము నర్జునుఁడు యుద్ధకర్మమును సలిపె నేని, నా యింటికొట్లన్నియు రక్తమాంసములతో నిండియుండును గదా! (నడిచి దిక్కులుచూచి) అయ్యో! నా మగఁడు రుధిరప్రియుఁ డెక్కడ నున్నాఁడో? వానిని వెదకెదను. (నడిచి) పోనీ పిలిచెదను. ఓరుధిరప్రియా! ఓరుధిరప్రియా! ఇటురా. ఇటురా.

(తరువాత నట్టిరాక్షసుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

రాక్షసు—(ఆయాసపడుచు) ఇప్పుడు క్రొత్తగాఁ జంపఁబడినమనుష్యుల మాంసమును వెచ్చవెచ్చనిపచ్చినెత్తురును లభించె నేని నాయాయాసము నిముసములో నుపశమిల్లును గదా!

రాక్షసి—(తిరుగఁ బిలుచుచున్నది.)

రాక్షసు—ఓరీ! ఎవఁతెరా నన్నుఁ బిలుచుచున్నది? (చూచి) ఓహో వసాగంధా? (సమీపించి) వసాగంధా! నన్నెందుకే పిలుచుచున్నావు!

రాక్షసి—ఇదిగో! రుధిరప్రియా! ఇప్పుడే హతుఁడైనయొకానొకరాజఋషిశరీరావయవములనుండి ప్రవహించి వసాస్నేహము చేతఁ జిక్కనై గోరువెచ్చగానున్న యీక్రొత్త నెత్తురు హృదయమాంసముతోఁగూడ నీనిమిత్తము కొనివచ్చినదానను. ఈమాంసము నంజుకొనుచు రక్తమున దప్పి తీర్చుకో.

రాక్షసు—(సంతోషముతో) బాగు! వసాగంధా! బాగు! కడు మేలయిన పని చేసితివి. నేను మిక్కిలి వడ గొట్టి "యెక్కడ నైనను వెచ్చవెచ్చని నెత్తురు దాహమునకు దొరకునా?" యని కనుపెట్టుకొని యున్నాను.

రాక్షసి—రుధిరప్రియ! మనుష్యులు, ఏనుఁగులు, గుఱ్ఱములు, మొదలగువాని రక్తప్రవాహములచేతఁ బెద్దసముద్రములాగున నున్న యిటువంటియుద్ధరంగమునఁదిరుగు చుండియు దప్పిగొన్నాఁడ నని చెప్పుచున్నావు. నాకుఁ జాల వింతగానున్నది.

రాక్షసు—(క్రోధముతో) ఓసి వసాగంధా! పుత్రశోకముచేతఁ బరితపించు చున్న మనరాణి హిడింబాదేవిని జూచి వచ్చుటకు వెళ్ళినాఁడనే.

రాక్షసి—రుధిరప్రియా! మనరాణి హిడింబాదేవి ఘటోత్కచకుమారుని మరణమున కింకను నేడ్చుచునే యున్నదా?

రాక్షసు—ఓసీ! ఆ మెదుఃఖ మెట్లు చల్లాఱును? అయినను నభిమన్యునిచావు వలన సమానదుఃఖురాలయినసుభద్రాదేవియు, ద్రౌపదీదేవియు నామె నూఱడించు చున్నారు.

రాక్షసి—రుధిరప్రియ! ఇదిగో నేనుఁగుఁబుఱ్ఱలోఁ బట్టి తీసికొని వచ్చిన దానను. ఈవెచ్చవెచ్చనిక్రొత్తనెత్తురు గుండెలయూరుఁగాయను జప్పరించుచు దాహము పుచ్చుకో.

రాక్షసు—(అలాగుచేసి) వసాగంధా! నీవు రక్తమును హృదయమాంసమును గూడ నేపాటి సంగ్రహించి యుంచితివే?

రాక్షసి—రుధిరప్రియ! మునుపు నేను దాఁచిపెట్టిన దంతో నీ వెఱుఁగనే యెఱుఁగుదువు. క్రొత్తగాఁ గూర్చి పెట్టినది చెప్పెద వినుము. భగదత్తుని నెత్తురు బానెఁడు. సైంధవునివస రెండు కడవలు. విరాటరాజు భూరిశ్రవస్సు సోమదత్తుఁడు బాహ్లికుఁడు మొదలగు పెద్దపెద్దరాజులయొుక్క, దక్షిణముక్కడిమానునులయు రుధిర వసామాంసములు వేలకొలఁది బానలనిండఁ బట్టి, వాసెనలు గట్టి, యింటిలోఁ బది లముచేసి యుంచినదానను.

రాక్షసు—(సంతోషముతోఁ గౌఁగిలించుకొని) వహవా! వహవా! నీవు మిక్కిలి మంచిపెండ్లామవే. నీవంటిమంచిపెండ్లాము దొరకుటచేతను, హిడింబాదేవి ప్రసాదముచేతను నా దారిద్ర్యము బొత్తిగ వదలిపోయినది.

రాక్షసి—రుధిరప్రియ! హిడింబాదేవిప్రసాద మెట్టిది?

రాక్షసు—ఇంతకు ముందే హిడింబాదేవి నన్ను గౌరవముతోఁ బిలిచి "రుధిర ప్రియ! నీవు నేఁడు మొదలు యుద్ధములో భర్తగారివెనువెంటను దిరుగుచుండునది" యని యాజ్ఞాపించినది. కాఁబట్టి భీమసేనుఁడుగారితోఁ దిరుగుచుండు నాకు నేమి కొదవ? రక్తము మాంసము మెదడు క్రొవ్వు మొదలుగా నేమి గావలసిన నదియెల్లను సులభముగా లభించును గనుక, నాఁకలి యెట్టిదో దప్పిక యెట్టిదో యెఱుంగక భూలోకస్వర్గ మనుభవించెదను. నీవును జాగరూకురాల వయి మఱి కొయికడవల రక్తము సంపాదించి యుంపుము.

రాక్షసి—రుధిరప్రియా! నిన్ను భీమసేనుండుగారితో నుండు మన్న దియెందుకు?

రాక్షసు—వసాగంధా! మనదొర భీమసేనుండుగారు దుశ్శాసనునిగుండెలు బద్దలు చేసి రక్తము త్రాగుటకుఁ బ్రతిజ్ఞ పట్టినారు. కాబట్టి రాక్షసుల మయిన మనము గూడ నాయనతో రక్తపానము చేయ వలె నని.

రాక్షసి—(సంతోషముతో) దేవీ! బాగు! బాగు! నీయనుగ్రహమున నా మగనికి మంచియుద్యోగము దొరకినది.

[తెరలోపలఁ బెద్దకలకలము]

ఇద్దఱు—(ఆలకించుచున్నారు.)

రాక్షసి—ఓరుధిరప్రియా! ఏమిది? పెద్దకలకలధ్వని వినఁబడుచున్నది.

రాక్షసు—ఓసీ! వసాగంధా! ధృష్టద్యుమ్నుఁడు ద్రోణునిజుట్టుఁ బట్టుకొని కత్తితోఁ గుత్తుకఁ గోయుచున్నాఁడు.

రాక్షసి—(సంతోషముతో) రుధిరప్రియా! మనము గూడఁ బోయి ద్రోణుని రక్తము త్రావుదము.

రాక్షసు—(భయముతో) వసాగంధా! అది బ్రాహ్మణరక్తమే; గొంతుదిగులఁ బెట్టుచు లోపలఁ బ్రవేశించును. అయ్యో! మన కది యెందుకే?

[తెరలో మరలఁ గలకలము.]

రాక్షసి—రుధిరప్రియా! ఇదిగో! మరలఁ బెద్దకలకలధ్వని వినఁబడుచున్నది.

రాక్షసు—(తెరవంకఁ జూచి) వసాగంధా! ఇదిగో! ఖడ్గము చేతఁ బట్టుకొని యశ్వత్థామ యిటు వచ్చుచున్నాఁడు. ఒకవేళ ధృష్టద్యుమ్నునిమీఁది కోపమున మనలను గూడఁ బట్టి వధించునేమో! లేచి రా. మనరాణి హిడింబాదేవి యాజ్ఞాపించినట్లు చేయుదము. (నిష్క్రమించుచున్నారు, ప్రవేశకము.)

[తరువాత నుత్థితఖడ్గుఁడయి కలకల మాలకించుచు నశ్వత్థామ ప్రవేశించుచున్నాఁడు.]

మ. బహులోద్యత్ప్రళయానిలక్షుభితశుంభత్పుష్కలావర్తమే
ఘహతాద్భ్రరవగర్జితారవసదృక్షం బై, పటీర్ణశ్రవః
కుహరం బై, తతరోదసీభరిత మై, క్షుభ్యత్కులక్షోణిభృ
ద్గుహ మై, యుద్భవ మయ్యె యుద్ధభువి నీకోలాహలం బే మొకో? ౧.

(ఆలోచించి) అర్జునుఁడో సాత్యకియో వృకోదరుఁడో పడుచుఁదనపుగర్వముచేత మర్యాద నతిక్రమించి ప్రవర్తించినారు. అందుచేత మాతండ్రిగారు మహాకోపమున శిష్యవాత్సల్యము నొకమూలను ద్రోసి, నిజ మయినతమపరాక్రమమునకుఁ దగినంత పనిచేయ నారంభించి యుందురు. ఇది నిశ్చయము.

మ. అని దుర్యోధనపక్షపాతసదృశం బస్త్రాగ్రిహోత్రోచితం
బనఘశ్రీభృగురామలబ్ధబహుదివ్యాస్త్రానురూపంబు స
ద్ధనురాచార్యరుషానురూప మగుచేఁ తల్ చేసెఁ గాఁబోలు మ
జ్జనకుం డారిపుఘస్మరు న్మృనయఁగా శక్తుం డెవం డామునన్? ౨.

(వెనుకఁ దిరిగి చూచి) ఇంకను నేను రథము నెందుకుఁ బ్రతీక్షింప వలెను? నీలమేఘచ్ఛాయను గేరుచు బంగారుఁబిడియును దట్టమయినపట్టుఁదాళ్లును గలిగి యున్న యీశిద్ధమే నాకుసకలశస్త్రములును; శీఘ్రముగా యుద్ధరంగమున నుఱికెదను (నడచి యెడమకన్ను దరుట సూచించి) ఏ మిది? ఆహవమహోత్సవప్రమోదనిర్భరుండ నయి తండ్రిగారిపరాక్రమము చూడ వేడుకపడుచున్న యశ్వత్థామ నగునాకుఁ గూడ నీయనిమిత్తములు సమరగమనవిఘ్నమును గలిగించుచున్నవి. కానీ. పోయెదను. (గర్వముతో నడిచి ముందు చూచి) అహో! ఏమిది? అవధీరితసకలక్షత్త్రధర్ములయి, యుత్సృష్టసత్పురుషోచితలజ్జావకుంఠనులయి, విస్మృతస్వామిసత్కారలఘుచేతసులయి, యగణితకులవచస్సదృశపరాక్రములయి. యీరథికులు హస్తిపకులు నాశ్వికులుఁ బదాతులును గూడఁ దిరిగి చూడక వెన్నిచ్చి పఱచుచున్నారు. ఏమీ! యీబలములమహాక్షోభము! (నిరూపించి) ఆహా! ఎంతకష్టము! కర్ణాదు లయిన మహారథులు గూడ సమరపరాఙ్ముఖు లగుచున్నవారే! (భయముతో) మాతండ్రిగారిచేత సంరక్షింపఁబడుచున్నను బలములకు నిట్టియవస్థ సంభవించిన దేమి చెపుమా? ఏమో కానిమ్ము. ఓయీ కౌరవసముద్రవేలాపరిపాలనమహామహీధరమూర్ధాభిషిక్తులారా! ఏల యీలాగున యుద్ధరంగమునుండి పాఱిపోవ సాహసించితిరి? చాలుఁ జాలు. నిలు నిలుండు.

తే.గీ. సమరముఖమునఁ దొలంగినఁ జావ లేని,
యిచటు వాసి మ ఱొక్కెడ కేగఁ దగును;
జంతువుల కెల్ల మృత్యువు సహజ; మూర
కిట్లు మీకీర్తి నలుపు గావింప నేల? 3.

మఱియు,

చ. పరబలవార్ధిపోతియుతబాడబుఁ, డుగ్రధనుర్ధరాధిరా
డ్గురుఁడు, భవచ్చమూపతి, యకుంఠితతేజుఁడు నాదుతండ్రి, సం
గరభర మూన, మీకు భయకారణ మేమి? కృపుండ! నిల్వుమీ;
పరు గిడి పోకు కర్ణ! కృతవర్మ్మఁడ! ధైర్యము చిక్కఁ బట్టుమీ. ౪.

(తెరలోపల) ఇంకను మీతండ్రి యెక్కడ?

అశ్వ -- (విని) ఏ మనుచున్నారు? ఇంకను మాతండ్రి యెక్కడనా? ఓరి క్షుద్రులారా! పాఱుఁబోతులారా! ఇట్లు పేలుచున్నమీనాలికలు వేయిచీలికలు గావలదా?

మ. పటుతేజంబున ద్వాదశార్కు లుదయింపక లేదు విశ్వంబు గా
ల్పుటకుఁ; వీచుట లేదు వాయువులు నేఁడుఁ సప్తధా భిన్నమై;
జటిలంబై కనుపట్టె దంబరము గర్జత్పుష్కలావర్తక
చ్ఛటలం; బాపము లాడి రేల జనకుఁ శౌర్యాబ్ధిఁ బాపాత్మకుల్?

(తత్తఱపాటుతో దెబ్బలు తిని సూతుఁడు ప్రవేశించుచున్నాఁడు)

సూతు—కుమారా! రక్షింపురక్షింపు. (కాళ్ళమీఁదఁ బడుచున్నాఁడు.)

అశ్వ—(చూచి) ఏమిది! తండ్రిగారిసారథి యశ్వసేనుఁడా? ముల్లోకములు రక్షింపఁ జాలినతండ్రిగారిసారథివై యుండియుఁ జిన్నవాఁడ నగునావలన రక్షణము గోరుచున్నా వేమి?

సూతు—(లేచి దుఃఖముతో) ఇంకను మీతండ్రి యెక్కడ?

అశ్వ—(తత్తఱపడి) ఏమి? తండ్రిగారే లేరా?

సూతు—మ ఏమి?

అశ్వ—హా! తండ్రీ! (మూర్ఛిల్లుచున్నాఁడు.)

సూతు—కుమార! ఊఱడిల్లు మూఱడిల్లుము.

అశ్వ—(తెలివి వచ్చి, కన్నీళ్ళతో) హా! పుత్రవత్సల! హా! లోకత్రయైక ధనుర్ధర! హా! పరశురామాస్త్రసర్వస్వప్రతిగ్రాహప్రవీణ! హా! తండ్రీ!

సూతు—కుమారా! ఇంతకడుపుపగలి దుఃఖింపఁగూడదు. మీతండ్రిగారు వీర పురుషోచిత మయినమరణము నొందినవారు. నీవును దదనురూపమయినభుజపరాక్రమమునఁ విజృంభించి యీదుఃఖసాగరమును దరించి సుఖింప వలయును.

అశ్వ—(కన్నీరు జాఱ) అయ్యా! అశ్వసేనా! అంత భుజపరాక్రమ సముద్రు లయినతండ్రిగారు తా మేరీతున నస్తమించిరో చెప్పుము.

చ. తనగదచేతఁ బెద్దగురుదక్షిణ యిచ్చెనొ భీముఁ డోజ్జకుఁ?

సూతు—రామ! రామ!

అశ్వ—ఘనతరశిష్యవత్సలుని గాండివి యమ్ములఁ బూజ చేసెనో?

సూతు—కుమారా! అలా గేల జరుగును?

అశ్వ—వినిశితచక్రధారకును వెన్నుఁడె తా నెర చేసెనో గురుఁ?

సూతు—అదియును సంభవింప లేదు కుమార!

అశ్వ—మనమున నాకు నాలుగవమానిసి తోఁపఁడు వీరు ముప్పురే. ఉ.

సూతు—కుమార!

ఉ. వీ రన నెంత యుద్ధమున విల్లు కరంబున నున్న రుద్రునా
కారము దాల్చునగ్గురుమగంటిమి? కాయన కొండ్లు సాటియే?

దారుణశోకభారమునఁ దానుగ శస్త్రము నుజ్జగింపఁగాఁ,
గ్రూరరిపుండు చేరి యతిఘోరము చేసె; నిఁ కేమి దెల్పుదున్? ౭.

అశ్వ—అయ్యో! శోకమునకుఁ గాని యస్త్రపరిత్యాగమునకుఁ గాని యేమికారణము ?

సూతు—కుమారుఁడే కారణము.

అశ్వ—అయ్యో! నే నెట్లుగాను ?

సూతు—(కన్నీళ్ళతో) ఆలకింపుము.

మ. పడిగా, స్పష్టముగాఁ, బృథాతనయుఁ డశ్వత్థామ ద్రోలింపఁగాఁ
బడె నంచు న్వచియించి, మెల్లఁ దనలోఁ బల్కెన్ గజం బంచు; నా
నుడు వాలించి, కుమారవత్సలుఁడు ద్రోణుండు డస్సె కన్నీళ్ళతో
విడిచెన్ శస్త్రములన్, యుధిష్ఠిరవచోవిశ్వాసమూలంబునన్. ౮.

అశ్వ—హా! సుతవత్సల! హా! వృథామదర్థపరిత్యక్తజీవిత! హా! శౌర్యరాశి! హా! శిష్యప్రియ! హా! యుధిష్ఠిరపక్షపాతీ! హా! తండ్రీ! (రోదనము చేయుచున్నాఁడు)

సూతు—కుమార! ఊరక యేల యిట్లు వాపోవుచు ధైర్యంబు నొందెదవు? ఉఁ అడిలు మూఁఅడిల్లుము.

అశ్వ— తే.గీ. తండ్రి! నీ వస్మదన్యతవధంబు వినుచు,
విడిచి తుదను అస్త్రములతోడఁ గొడుకుఁదీపి;
నిరుని కర్ణంపువధ విని నేను మనెద;
నిట్టిఖలునెడఁ బ్రేమ నీ కేల పుట్టె? ౯.
(మూర్ఛిల్లుచున్నాఁడు.)

సూతు—ఊఁఅడిల్లు మూఁఅడిల్లుము కుమార!

[తరువాత నుద్వేగముతోఁ గృపుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

కృప—చ. అనుజులతోడి కౌరవధరాధవుఁ డేటికి? నేల ధర్మనం
దనుఁడు? వృథాగ నస్త్రములు దాల్చినరాజులు నేను నేల? మా
తనువులుఁ గాల్పనా? యపుడు ద్రౌపది, యిప్పుడు ద్రోణుఁడీవిధం
బునఁ దలపట్టుకోఁబడినముచ్చట గంటివి చిత్రవైఖరిన్. ౧౦.

కట్టా! ఎంతపని పుట్టెను? పిల్లవాఁ డయినమా యశ్వత్థామమొగము నే నెట్టుగాఁ జూతును? అయినను వాఁడు హిమవంతునివంటిధైర్యసారము గలవాఁడును, లోకవృత్తములు బాగుగ నెఱింగినవాఁడును, గాన నంతగా దుఃఖింపకుండు నని తోఁచెడును; కాని యసదృశ మయినయీపితృపరాభవము వినిన, నేమి చేసెడునో యది మాత్ర మూహింపఁ జాల కున్నాను.

మఱియు,

క. మనుపతి యొకఁడు నిఖిలం
బన భూభారం బగుచు నున్న దతిదారుణమై,
జన మీ కేశగ్రహణం
బున నిశ్శేషంబ యగును బో రూపుగన్ ౧౧

(చూచి) ఇదిగోఁ! గురుఁడిక్కడనే కూర్చుచున్నాఁడు దగ్గఱకుఁ బోయెదను (సమీపించి తొట్రుపాటుతో) నాన్నా! ఈ యజ్జిల్లు మాఱడిల్లును

అశ్వ—(మూర్ఛ దేఱి కన్నీళ్ళతో) హా! సకలభువనైకగురూ! హా! తండ్రీ! (ఆకాశము చూచి) యుధిష్ఠిరా! యుధిష్ఠిరా!

ఉ. గొంకక బొంకుఁగ నెన్నఁడును బల్కని, యజాతశిరోధి వైతి వే
వంకను భూజనంబునకు బాధ యొనర్పమి, నాయభాగ్యతన్
గొంకక సర్వముం దెలుచుకొంటివి నీ వొకమాటలో, నృపా!
పంకిలచిత్త! మజ్జనకు బ్రాహ్మణు ద్రోహ మటంచు నెంచవో? ౧౨

సూతు—కుమార! ఇదిగో! మీ మేనమామ కృపాచార్యులవారు వచ్చి నీప్రక్కను కూరుచున్నారు

అశ్వ—(పార్శ్వమునకుఁ దిరిగి చూచి కన్నీళ్ళతో) మామా! మామా!

ఉ. ఎవ్వనితోడ నిర్భయుఁ డని కీర్తితుఁడో, నరనాథ రాజికిన్
జివ్వగులం దొలంప రణసీమల గాండికంబ మెవ్వఁడో,
యెవ్వనితోడ నీ కగునొ యొప్పుఁ జెల్లెలి పువ్వటా లతం
దెవ్వల నేఁగె నీమఱఁది? యేర్పడఁ జెప్పఁగదయ్య మాతులా! ౧౩

కృపు—అబ్బాయీ! తెలుప వలసిన దింతయు నీకే తెలియును, కాఁబట్టి యిఁక నీలాగున నీ వతిశోకమున మునుంగఁ దగదు

అశ్వ—మామా! నేను దుఃఖము విడిచిపెట్టినాఁడ ఇదిగో! మృతవత్సలుఁడయిన నాతండ్రియొద్దకే పోయెదను

కృపు—నాయనా! ఇది నీబోఁటులకుఁ దగినది కాదు

సూతు—కుమార! అతిసాహసము చేయకుము

అశ్వ—అయ్యా! ఏమిచెప్పుదును?

తే. నన్ను నెడఁబాయఁ జాలక నాదుతండ్రి
నరకఁ బరలోకమునకుఁ దా నరిగెఁ గాదె?
యంతప్రేముడి గలిగినయట్టితండ్రి
కెట్లు విరహంబు గలిగింప నేను నేర్తు? ౧౪.

కృపు—వత్సా! పుత్రులకు శోకద్వయమునందును దండ్రు లనువర్తనీయులు, కావున సంసార మున్నంతవఱకు దేహయాత్ర తప్పనిదే

ఆ. వె. ఉదకదానమునను, యోగ్యనిమంత్రణం
బునను, శ్రాద్ధకర్మమునను, దండ్రి
కుపకరింతు ప్రీతికి యుండిన నిహమున,
నిరర్థకమె యైన నేమి చెప్ప? ౧౫

సూతు—ఆయుష్మంతుఁడా! ఈశారద్వతునియాజ్ఞ మీఱకుము

అశ్వ—అయ్యా! ఇదియంతయు సత్యమే, అయినను ఓర్పరానిదగు నేను దుర్భరమయిన యీశోకభారముచేత క్షణమైన నా ప్రాణముల భరింపఁజాలకున్నాను, కాన తండ్రిగారిని జూచుట కాయన యున్నయెడకేని పోయెదను (లేచి శస్త్రముఁ జూచి యాలోచించి) ఇంక శస్త్రగ్రహణవిద్యతో నేమి ప్రయోజనము? (దోసిలిపట్టి కన్నీళ్లతో) పూజ్యమయిన యోశస్త్రమా!

చ. ఘనుచి పైన, నోటమిభయంబున నెవ్వఁడు నిన్నుఁ దాల్చె నె
క్కనిమహిమంబుచేతను ప్రపంచమునం దెదు రేగ లేదు నీ,
కనుపమపుత్రశోకమున నా యన నిన్నుఁ బరిత్యజించెఁ, గా
వున నిఁక నేను నిన్విడతుఁ, బొమ్ము శుభమ్మగు నీకు శస్త్రమా! ౧౬

(విడువఁబోవుచున్నాఁడు)

(తెరలో) ఓహో! యోధులారా! ఏమిది పూజ్యుఁడయినభారద్వాజు నీచాకుఁడు జుట్టుఁబట్టి వధించుచుండఁగా మీ రందఱు నుపేక్షించుచున్నారు

అశ్వ—(విని మెల్లమెల్లగా శస్త్రమును స్పృశించుచు) ఏమీ! మా తండ్రిగారు భారద్వాజునకే పరిభవమా?

(మరలఁ దెరలో)

మ. వదనం బ్రోలఁ దప్పద్రోఁగి, వసటన్ వర్జించి శస్త్రంబు, లా
పదలో నుండఁగఁ దజ్జరాపలితధావళ్యస్ఫురత్కేశముల్
సరససహాన్వతఁ జేతఁ బట్టుకొని ధృష్టద్యుమ్నుఁ డాచార్యకం
ఠము దెగంగోసె చవంగ, నంద జీవుఁ లీదుష్టాత్ము సైరింతురే? ౧౭

అశ్వ—(క్రోధముతోడను దుఃఖముతోడను గృపసూతులను జూచి) ఇదేమి?

చ. కనులను మూసి ప్రాయమునఁ గాయముఁ బాయుఁ దలంచి, శస్త్రముల్
మును పె పరిత్యజించి రణభూమిని నాజనకుండు నిల్వ, నా
యనపలితోత్తమాంగమున హస్తము వైచియు గొంతు గోసెనే
చెనఁటి యొకండు, విండ్లు తమచేతులఁ బూని నృపుల్ గనుంగొనన్? ౧౮

కృపు—వత్సా! జను లీలాగుననే చెప్పుకొనుచున్నారు.

అశ్వ—ఏమి? నాతండ్రిశిరస్సె యొకదురాత్ముఁడు ముట్టుకొనెనా?

సూతు—(భయముతో) కుమార తేజోరాశి యగునమ్మహాత్మునకుఁ గ్రొత్తగా నిట్టిపరాభవము సంభవించినది.

అశ్వ—హా! పుత్త్రవత్సల హా! తండ్రీ! అదృష్టహీనుఁడ నయిననానిమిత్తము నీశస్త్రమును బరిత్యజించి యటువంటిక్షుద్రునిచేతఁ బరాభూతుఁడ వయితివి గదా? కానీ.

ఉ. శోకముతో ననిన్ గళితనుం డగుమద్గురునుత్తమాంగమున్,
గాకియొ, కుక్కయో, ద్రుపదనందనుఁడో, స్పృశియించుఁగాక, ద
ర్వీకరభీకరాస్త్రధనవిస్తృతి మత్తిలుశత్త్రునెత్తిపై,
నాకడకాలు నే నునిచినా నిదిగో, మఱి కేలు గాదు సూ. ౧౯

ఆ! దురాత్మ! పాంచాలాపసద!

శా. మో మద్గుర్విగతిఁ దోఁగ నాజనకుఁ డమ్మేల్ విల్లు వర్జింప, నీ
వామై మెల్లఁగ జేరి, తచ్ఛిరముపై హస్తం బిడం జాలినా
వా మూర్ఖా! మది నప్పు డేమఱితి వశ్వత్థామ యే మయ్యెరా?
మీమీమూఁకలు దూదిబుంగ లగుఁ జూమ్మీ నాదుబాణాగ్నికిన్. ౨౦.

హా! యుధిష్ఠిర! యుధిష్ఠిర! అజాతశత్రూ! అమిథ్యావాదీ! ధర్మపుత్త్ర! నీ తెమ్ములకుఁ గాని నీకుఁగాని నాతండ్రి యేమియపకారము గావించెను రాజా? పోనీ. అసత్యపరిధానవక్రిచేతస్కుం డగుపీనితో నేమి? అర్జునా! సాత్యకీ! బాహుశాలివృకోదరా! మాధవా! సురాసురమనుజలోకైకధనుర్ధరుండును, బ్రాహ్మణుండును, వయోవృద్ధుండును. సర్వజనధనురాచార్యుండును, విశేషించి నాకుఁ దండ్రియు నగుభారద్వాజునియుత్తమాంగమును బాంచాలకులకలంకుఁ డగునరపశువు తనకరంబున స్పృశియించుచుండ, మీ రెల్లరు చూచి యూరకుండుట యుచితమే గదా? ఛీ; పీఁడస్త్రితో నేమి? పీం డ్రిందఱుఁ బాపాత్ములే.

తే. గీ. వీతమర్యాదులై గురుపాతకంబు
సలిపి సహియించి చూచినసకలమనుజ
పశుల మిమ్మెల్ల, నేఁ గృష్ణపార్థభీమ
యుక్తముగ భూతబలి యిత్తు రక్తమునను. ౨౧

కృపు—అబ్బాయీ! దివ్యాస్త్రకోవిదుండ వయి పితృసమానుండ వగు బాహుశాలిక నీ కట్లు చేయుట యేమి యసాధ్యము?

అశ్వ—ఓరోరి పాండవమత్స్యపాంచాలక్షత్త్రియహతకులార!

చ. గురునిశిరంబు ముట్టి రణకోపమునన్ ; జ్వలదగ్నితుల్య మా
పరశున జామదగ్న్యుఁడు నృపాలుర నెమ్మెయిఁ జేసె వింటిరే ?
నరపతులార ! దారుణరణంబున రోషకషాయితాత్ముఁడై
యరిరుధిరప్రవాహముల నట్టులు ద్రోణి యొనర్ప లేఁడొకో. ౨౨

సూతుఁడా! నీవు శీఘ్రముగాఁ బోయి మహాహవలక్షణ మనుమదీయరథంబును సమస్తయుద్ధోపకరణములతోడను దీసికొని రా.

సూతు—చిత్తము కుమారా (నిష్క్రమించుచున్నాఁడు.)

కృపు—వత్సా! అవశ్యము ప్రతిక్రియ చేయఁ గాఁ దగినయీదారుణపరాభవానలంబును నీవు గాక మాబోఁటులు చల్లార్ప నేర్తురా ?

అశ్వ—అట్లయిన నే నిఁక నేమి చేయ వలెను.

కృపు—సేనాధిపత్యమున కభిషిక్తుండ వయి నీవు యుద్ధభూమికిఁ బోవలయు నని నాతాత్పర్యము.

అశ్వ—మామా ! ఇది పరాధీనము, నపరిగణనంబును.

కృపు—నాయనా ! ఇది పరాధీనమును గాదు; అపరిగణనంబును గాదు. చూడు.

తే గీ. భీష్ముఁడును ద్రోణుఁడును లేని పెద్దకొఱఁత,
పాయు నెట్టులు ధృతరాష్ట్రబలములకును.
వారితోఁ దులఁదూఁగెడుబాహుశాలి
వీవు సేనాధిపతివి గా వేని వత్స ? ౨౩

విలువిద్యయందు నాఁటి తేటినినుబోఁటిశూరునికి ముల్లోకములు నోపవన, నిఁక యుధిష్ఠిరబల మెంతపాటిది ? కాఁబట్టి కౌరవనాయకుం డభిషేకోపకరణంబులను గూర్చుకొని, నీనిమిత్త మిప్పు డెదురు చూచు చుండు నని నేను దలంచెదను.

అశ్వ—అలా గయిన, మామా ! పరాభవాగ్ని చేత దగ్ధమగుచున్న నా హృదయంబు, తత్ప్రతీకార మగునభిషేకమునకుఁ దత్తఱపడుచున్నది; కాఁబట్టి నే నిప్పుడు పోయి నాతండ్రి యస్తమించుటకు విచారగ్రస్తుఁడయియున్న దుర్యోధనుని సేనాధిపతి నయి కౌఁగిలించికొని, నెయ్యంబున నూఱడించి, సంతాపశాంతి గావించెదను.

కృపు—అబ్బాయి ! ఇది బాగున్నది. మన మతనియొద్దకే పోవుదము.

(నడుచుచున్నారు.)

(తరువాతఁ గర్ణదుర్యోధనులు ప్రవేశించుచున్నారు.)

దుర్యో—అంగరాజ !

తే. గీ. చుట్టముల శత్రువులు సంప, శోకజలధి
శస్త్ర మను తెప్ప నీఁదుఁ దేజస్వి [illegible]దుఁ;
కొడుకుచావును విని పోరఁ గుంభభవుఁడు,
శస్త్రమును దాల్ప కేటికి సన్యసించె? ౨౮

అవును. ఎట్టివానికిఁ గాని నైజగుణంబు పోదని చెప్పెడు పెద్దలమాట యబద్ధమగునా? శోకాంధచేతస్కుం డయి యీద్రోణుండు క్షత్రియధర్మమయినకాఠిన్యమును విడిచిపెట్టి, బ్రాహ్మణసులభ మయినమార్దవమును బరిగ్రహించినాఁడు

కర్ణ—రాజా! కౌరవేశ్వర! ఇది యట్లు కాదు సుమీ.

దుర్యో—మఱి యెట్లు?

కర్ణ—ఆయనయభిప్రాయ మిది. అతఁ డీభూమండలం బంతయు నశ్వత్థామ నభిషేకింపవలె నని జూచు చుండువాఁడు; కాఁబట్టి యాకోరిక వ్యర్థ మయినందున బ్రాహ్మణుండను వృద్ధుండను నయిననా కీవృథాశస్త్రగ్రహణ మెందు కని యట్లు చేసినవాఁడు.

దుర్యో—(తలపంకించి) ఇది యాలాగే కావచ్చును.

కర్ణ—ఇందుచేతనే, కౌరవపాండవపక్షపాతమున రాజు లందఱుఁ దమలోఁ దారు పోరాడి చావఁగోరి, యీతండు మనలోని ప్రధానపురుషుల కపాయము వచ్చునప్పుడు చూచి చూడనట్టు లూరకుండుచు వచ్చినాఁడు.

దుర్యో—ఇదియును ముందు చెప్పినదాని కనుకూలముగనే యున్నది.

కర్ణ—ఇంతే కాదు. రాజా! ద్రుపదరా జితనికి బాల్యస్నేహితుఁ డయినను జిన్నప్పటినుండి యితనియభిప్రాయ మెఱింగి యుండుటచేతనే యీమహాత్మునికిఁ దనరాష్ట్రములో నిలువ నింత నీడ నైన నిచ్చినాఁడు కాఁడు.

దుర్యో—సెబాసు అంగరాజా! లెస్సగా నాలోచించితివి.

కర్ణ—మిత్రమా! ఇది నాయొక్కనియభిప్రాయమే కాదు. ఎఱిఁగినవా రెవ్వరును దీనిని వేఱుగాఁ దలంచుకొనరు.

దుర్యో—అవును. ఇది నిశ్చయమే. ఏమి సందేహము?

తే. గీ. అతిరథుఁడు తాను ముందుగా నభయ మిచ్చి
సైంధవున, కర్జునుఁడు వానిఁ జంపు చుండ
నితఁడు తద్రక్షణమున నుపేక్ష చేసె;
నిట్టి కా తున్న దానికి నేమి కతము? ౨౯

కృపు—(చూచి) అబ్బాయీ! ఇదిగో దుర్యోధనుఁడు సూతపుత్రునితోఁగూడ నీమఱ్ఱిచెట్టునీడను గూర్చుండియున్నాఁడు. మనము నక్కడకుఁ బోదము. (అట్లుచేసి)

ఇద్దఱును—విజయతాం విజయతాం రాజన్.

దుర్యో—(చూచి) ఓహో కృపాచార్యులవారు నశ్వత్థామయు నా ? (ఆసనమునుండి లేచి) గురువర్యా ! నమస్కరించుచున్నాను. (అశ్వత్థామను గూర్చి) ఆచార్యపుత్రా !

ఉ. దగ్గఱ రమ్ము; నాకతనఁ దండ్రికిఁ బాసినబిడ్డ వైతె ? నన్
బిగ్గఁ గవుంగిలింపు సఖ ! నీకడు మెత్తనిమేను హత్తఁగా;
నగ్గురుబాహులట్టిభవదాయతబాహులు మేను సోఁకినన్,
గగ్గురుపాటు సంభవము గాదెటు లారట మొందుచుండినన్ ? ౨౬

(కౌఁగలించుకొని పక్కను గూరుచుండఁబెట్టుకొనుచున్నాఁడు.)

అశ్వ—(కన్నీరు విడుచుచున్నాఁడు.)

కర్ణ—ద్రోణాయనీ ! తీవ్రమయినశోకానలమున నేల పరితపించెదవు ?

దుర్యో—ఆచార్యపుత్ర! ఈదుఃఖసాగరమునందు మనకిరువురకును భేదమేమి?

ఆ. వె. తండ్రి నీకుఁ; జూడఁ దండ్రినెచ్చెలి నాకు;
నీకు గురువు, వింట నాకు గురువు;
అతఁడు మేను దొఱఁగ, నార్తి చెప్పఁ బరంబె ?
మఱుఁగుచున్ననీదుమదికె యెఱుఁక. ౨౭

కృపు—వత్సా ! ఈకురుపతి చెప్పిన దంతయు యథార్థము.

అశ్వ—రాజా ! నీవు కూడ నిట్లు పంచుకొనుటచేత నాశోకభారము గొంత చులుకపడినది. కాని.

ఆ. వె. నేను బ్రదికి యుండఁగానె నాజనకుని
జుట్టు దుష్టరిపుఁడు పట్టుకొనియెఁ;
నింక లోకమందు నితరులౌ తండ్రులు
కొడుకులకును నాస పడుదురయ్య ? ౨౮

కర్ణ—ద్రోణజా ! అందుకుఁ జేయునది యేమి ? ఎల్లవారలపరాభవమును బోఁగొట్టఁ జాలినతాను, బుద్ధిపూర్వకముగా శస్త్రమును బరిత్యజించి యంతటిదురవస్థ దెచ్చుకొన్నాఁడు.

అశ్వ—అంగరాజా ! నీ వేమనియెదవు ? అందుకుఁ జేయునది యేమా ? అయిన నాచేయునది యేమో చెప్పెద వినుము.

* శా. వాలుం బూనుమలాధ్యుఁ డేఁ డెవఁడొ శుంభత్పాండవానీకినిన్,
బాలుండున్, ముది, చూలు, నెవ్వఁ డెవఁడో పాంచాలురం, దేఁడెవం
డాలోకించెఁ దదుగ్రకర్మ, మెవఁ డేఁ డడ్డం బనిన్ నాకుఁ, ద
త్కాలుం డైనను, వానివానికి మహాకాలుండ నే నయ్యెదన్. ౨౯

మఱియు నోజామదగ్న్యశిష్య! కర్ణ!

చ. మడువు లొనర్చి నిక్కడనె మార్తురనెత్తుటితోడ రాముఁ, డి
ప్పుడు నదియే పరాభవము, భూపుఁడు మత్పితృమౌళి ముట్టె; నా
కడ వెలుఁ గొందుచున్నరిపుఘస్మరశస్త్రము లవ్వియే సుమీ;
యడిగితి గాన లెస్స విను, మాపనియే యిపు డేను జేసెదన్. ౩౦

దుర్యో—ఆచార్యపుత్ర! అనన్యసాధారణ మై తథావిధ మైననీబాహుపరాక్రమమునకు సాటి యున్నదా?

కృపు—రాజా! అశ్వత్థామ మహాసమరభారము పయి వేసికొన్నాఁడుగదా! ఇతఁడు ధనుర్ధరుఁ డయిన ముజ్జగంబులును జయింప సమర్థుఁ, డీఁక యుధిష్ఠిరబల మెంతపాటిది? కాఁబట్టి యీతని సేనాధిపత్యమున కభిషేకించుట సముచితం బని నే నూహించెదను.

దుర్యో—మీరు లెస్సగా నాలోచించి చెప్పితిరి. అయిన నిది పూర్వమందే యంగరాజునకుఁ జెంది పోయినది.

కృప—రాజా! అసదృశ మయినపితృపరాభవశోకసముద్రమున మునిఁగి యున్నయితని, నంగరాజునిమిత్త ముపేక్షించుట యుక్తముగాదు. ఆశత్రుకులము నే సంహరింపఁ దలఁచి యున్నయితనికి నీ విట్లు చేసినఁ గష్టముగా నుండదా?

అశ్వ—రాజా! ఇంక యుక్తాయుక్తవిచార మెందుకు?

మ. ఎదఁ జే యుంచుక నిద్రపో దధిప! నీ వీరేయి నల్జాములున్;
కదనంపుంగథ చేఁటితో ముగియు; నిష్కర్ణంసారి, నిష్పాండవం,
బిది నిస్సోమక, మయ్యెడుం జగము; నేనే యీధరాభార మం
త దొల్లంగించెద, దుష్టరాజకులకాంతారంబు ఖండించుచున్. ౩౧

కర్ణు—ద్రోణాత్మజా! ఇది చెప్పుట సుకరమే గాని చేయుట దుష్కరము. ఈపనికిఁ గౌరవసేనలో ననేకులు సమర్థులు.

పాఠాంతరము. *ఉ. వాలును గేలఁ బూనుబలవంతులఁ బాండవసేనలందుఁ, బాం
చాలకులంబునందు ముదుసళ్ళను బిల్లలఁ జూలుఱన్, మహా
కాలుఁ డనంగ నప్పు డడి కాంచిన వైరుల నెల్లఁ ద్రుంతు నే
నాలములోనఁ, గ్రోధభయదాకృతినై పగ యెల్లఁ దీఱఁగన్.

అశ్వ—అంగరాజా! ఈపనికిఁ గౌరవసేనలో ననేకులు సమర్థులు; నిజమే. అయినను నాదుఃఖముకొలఁది నే నిట్లు పలికితిని గాని వీరపురుషుల నాక్షేపింప వలయు నని కాదు.

కర్ణ—మూఢుఁడా! దుఃఖ ముండినఁ గన్నీళ్ళు విడువ వలయును; క్రోధ ముండిన నాయుధసహాయుఁడ వయి యుద్ధములో నుఱుక వలయును. అంతేకాని యిట్లు పరితాపములఁ గొట్టుట యెందుకు?

అశ్వ—(క్రోధముతో) ఓరోరి! రాధాగర్భభారభూత! సూతాపసద! ఇదేమిరా న న్నాక్షేపించెదవు?

కర్ణ—క. సూతుఁడనో సూతసుతుఁడనో
యీతప్పున కేమి లేర; యెవఁడో యొకఁడన్;
జాతము దైవాధీనము;
ఖ్యాతంబగు పౌరుషము మదాయత్త మగున్. ౩౨

అశ్వ—ఓరికర్ణా! నీ వే మనియెదవు; నాదుఃఖమును గన్నీళ్ళతోనా దీర్చుకొమ్మనియెదవు? ఖడ్గముతోఁ గా దేవి? చూడుము,

మ. భవదస్త్రంబులు వోలె నావి, గురుశాపప్రాప్తి వమ్మయ్యెనో?
బవరంబు న్విడ నాడి వచ్చితినొ నీభంగిన్ భయం బొందుచున్?
స్తవముల్ చేసెడుసూతవంశమున సంజాతుండనో నీవలెన్?
బవ యుస్రంబునఁ గాని యస్త్రమునఁ దీర్పన్ లేను రా? బాలిశా? ౩౩

కర్ణ—(క్రోధముతో) ఓరివాచాటా! ఓరివృథాశస్త్రగ్రహణదుర్విదగ్ధ! ఓరిబ్రహ్మచారీ!

క. వమ్మయ్యెనో సొమ్మయ్యెనో
యమ్ముల నే విడిచి పెట్ట నాలములోనన్,
నెమ్మనమున పాంచాలభ
యమ్మున నీబాహుశాలి యగుతండ్రివలెన్. ౩౪

అశ్వ—(క్రోధముతో) ఓరిరథకారకులకళంక! రాధాగర్భభారభూత! ఓరియాయుధానభిజ్ఞ! తండ్రిగారిని గూడ నాక్షేపించుచున్నావట్రా?

చ. విదితజగత్త్రయైకభుజవిక్రముఁ డాయన భీరుఁడో జయా
స్పదుఁ డగుశూరుఁడో యెఱుఁగుఁ బ్రత్యహ మీభువి తద్రణక్రియన్;
వదలెను శస్త్ర మెట్లొ తెలుపంగను ధర్మసుతుండె సాక్షి; నీ
వదరెదు పాఱుఁబోత! తులువా! యపు డచ్చట నీవు లేవురా? ౩౫

కర్ణ—(నవ్వి) ఓహో! నేను పాఱుఁబోతను; నీవు పోటుమానిసివి; నీ తండ్రిని దలఁచుకొన్న నాకు మిక్కిలి సందియము గలుగుచున్నది. ఓరిమూఢ!

తే. గీ. శస్త్రము డిగిన నేమి? యశస్త్రపాణు
లాయుధము నెత్తురిపుదర్ప మడఁప లేరె?
రాజచక్రంబు నెదుర శిరంబు గోయ,
నువిదలాగున నీతండ్రి యోర్చెఁ గాక. ౩౬

అశ్వ—(క్రోధముతో దేహము వడఁకు చుండ) దురాత్మా! రాజవల్లభ ప్రగల్భ! అసంబద్ధప్రలాప! సూతకులసంభవ!

ఆ. వె. భయము వడియొ, దుఃఖభారంబుననొ, నాదు
తండ్రి ద్రుపదసుతు నదల్పఁ డయ్యె;
నడిచి పడెదునిన్ను నౌదల నాకడ
కాలఁ దన్నుచుంటిఁ; గాచుకొర.

(అట్లు చేయుటకు లేచుచున్నాఁడు.)

కృప దుర్యోధనులు—గురుపుత్ర! శాంతింపుము శాంతింపుము.

(వారించుచున్నారు)

అశ్వ—(తన్నుట నభినయించుచున్నాఁడు)

కర్ణ—(క్రోధముతో లేచి కత్తిదూసి) ఓరిదురాత్మా! బ్రహ్మబంధుఁడా! ఆత్మశ్లాఘీ!

తే. గీ. బ్రాహ్మణుండవు గాఁబట్టి బ్రతికిపోయి;
తయిన నీ విప్పు డెత్తినయట్టికాలు
కఱకుఁగరవాలమునను నే నఱకి వైతు,
దునిసి పడె నని తలఁచుకొ మనసునందు. ౩౭

అశ్వ—ఓరిమూఢుఁడా! నేను బ్రాహ్మణుండను గనుకనా బ్రతికిపోయితిని? ఇదిగోఁ! జూడు నా బ్రాహ్మణ్యమును విడిచిపెట్టినాఁడను (యజ్ఞోపవీతమును ద్రెంచివేసి మరలఁ గ్రోధముతో)

తే. గీ. ఇపుడె మిథ్యాప్రతిజ్ఞుఁ గావింతుఁ జూడు
మల్లగాండీవి, నీ వింక నడిచి పడిన;
శస్త్రమును దాల్చి రార; రాఁ జాల వేని
క్రింద నస్త్రంబు నిడి మోడ్పుఁ గేలు వట్టు. ౩౮

ఇద్దఱును (కత్తులనుదూసి యొండొరుల నఱుకుకొన నుద్యోగించుచున్నారు.)

కృపదుర్యోధనులు—(వారించుచున్నారు.)

దుర్యో—ఆచార్యపుత్ర! ఆయుధమును దూయ నేటికి?

కృపు—వత్సా! సూతపుత్ర! కత్తి యెత్త నేటికి?

అశ్వ—మామా! మామా! నీ వేందుకు అడ్డగించెదవు? తండ్రిగారిని నిందించు చున్న యీసూతాపసదుఁడును కేవలము ధృష్టద్యుమ్నపక్షపాతి.

కర్ణ—రాజా! నన్ను నీ విప్పుడు వారింపఁ గూడదు.

ఆ. వె. క్రోధ మెంతయున్నఁ గుత్తుక దిగ మ్రింగి,
వీరుఁ డధము నిట్లుపేక్ష సేయ,
దుర్మదంబు హెచ్చి, తుదకు నీలాగునఁ
బొగడుకొనును దనదుమగతనంబు. ౮౦

అశ్వ—రాజా! వీనిని వదలు వదలు. రానీ. నాభుజములసందున నితనికి సులభముగాఁ దుద ముట్టించెదను. మఱియును గౌరవేశ్వరా! గురువుగారి నధిక్షేపించినయీదురాత్ముని స్నేహముచేతనో కార్యముచేతనో గాని నాబారివలన రక్షింపఁ గోరుచున్నావు. నీ కివి రెండును వ్యర్థములే. చూడు.

ఆ. వె. ప్రథితగుణుఁడ వీవు, పాపప్రియుఁడు వీఁడు;
విధుకులుఁడ వీవు, వీఁడు సూతుఁ;
డేటిమైత్రి? కూల్చునే వీఁడు నరు? వీడు;
జగ మకర్ణ పార్థ మగును నేఁడు. ౮౧

(నఱుకఁ దలఁచుచున్నాఁడు.)

కర్ణ—(కత్తియెత్తి) ఓరి పాపీ! బ్రాహ్మణాధమ! ఇదిగో! నీవు చచ్చితివిరా! రాజా! విడువిడు. నన్ను వారింపకు. (చంపఁ దలఁచుచున్నాఁడు.)

కృపదుర్యోధనులు—(అడ్డగించుచున్నారు.)

దుర్యో—కర్ణ! గురుపుత్ర! ఇప్పుడు మీ కీ వెఱ్ఱి యేమి?

కృపు—అబ్బాయీ! ప్రస్తుత మొకటి, నీతొందర మఱియొకటి. ఇది యేమివెఱ్ఱి? ఇపు డీరాజకులమునకు స్వబలవ్యసనము నీవలననే గలుగుచున్నది. ఇది పెడత్రోవ గాదా?

అశ్వ—మామా! పరుషప్రలాపి యగు నీరథకారకులకలంకుని మదము సదమదము సేయుట సంభవింప దయ్యెను.

కృపు—నాయనా! స్వబలప్రధానవిరోధమున కిది సమయము కా దోయి.

అశ్వ—మామా! అలాగయిన—

తే. గీ. రణముఖంబున వీఁడు శాత్రవులచేతఁ
జచ్చునందాఁక విడిచితి శస్త్ర మేను;
పార్థభీముల కీదళవాయి జడియ,
నపుడె రారాజు సఖుని న న్నరసికొనును. ౮౨

(ఖడ్గము విడుచుచున్నాఁడు.)

కర్ణ—(నవ్వి) నీవంటివాఁ డాయుధమును జేతఁ బట్టుకొన్నను నది చిరకాలముక్రిందనే విడిచిపెట్టినట్టు. ఏమనఁగా వ్యర్థ మగుటవలన.

క. నాకరమునఁ గరవాలము
గైకొని యుండంగ లాఁతిఖడ్గం బేలా?
నాకైదువు దీర్పనిపని
యేకైదువు దీర్పఁ జాలు నీలోకమునన్? ౪౩

(తెరలో) హా! దురాత్మా! ద్రౌపదీకేశాంబరాకర్షణ! మహాపాతకీ! ధార్తరాష్ట్రాపసదా! చిరకాలమునకు నాయెదురఁ బడితివి గదరా! ఓరిక్షుద్రపశువా! ఇప్పు డెందుఁ బోయెదవురా? ఓరోరికర్ణ! ఓరిదుర్యోధన! ఓరిశకునీ! ఓరోరి పాండవవిద్వేషులార! ధనుర్ధరు లయినమానధనులు మీ రెల్లరు నాలకింపుఁడు.

ఉ. ఎన్నృపశుండు ద్రౌపదిని నేడ్తెఱఁ గొప్పును బట్టి యీడ్చెనో,
మానధనుల్ గనుంగొనఁగ మానినిపుట్టము లెవ్వఁ డొల్చెనో,
యేనియురస్స్థలక్షతజ మేఁ జవి చూడఁ బ్రతిజ్ఞ గొంటినో,
యానయహీనుఁ గాచికొనుఁడా; పడె నాభుజపంజరంబునన్. ౪౪

అందఱు—(ఆకర్ణించుచున్నారు.)

అశ్వ—అంగరాజ! సేనాధిపతీ! జామదగ్న్యశిష్య! ద్రోణాపహాసీ! భుజబలపరిరక్షితసకలలోక!

"క. నాకరమునఁ గరవాలము ..
గైకొని యుండంగ లాఁతిఖడ్గం బేలా?
నాకైదువు దీర్పనిపని
యేకైదువు దీర్పఁ జాలు నీలోకమునన్?"

అని బీరములు పలికినాఁడవు గదా? సరే. ఇదిగో! దానికిఁ దగినయవసరము వెంటనే సంప్రాప్త మయినది. చూతము. ఇప్పుడు భీమునిబారిఁ బడకుండ దుశ్శాసనుని సంరక్షింపుము.

కర్ణ—ఆ! నేను జీవించియుండఁగా యువరాజునీడ నయినను స్పృశించుటకు వృకోదరుఁడు శక్తుఁ డగునా? యువరాజా! వెఱవకు వెఱవకు. ఇదిగో! నేను వచ్చితిని. (నిష్క్రమించుచున్నాఁడు.)

అశ్వ—రాజా! కౌరవేశ్వరా! భీష్మద్రోణులు లేరు గదా యని భీమార్జునులు విచ్చలవిడిగాఁ గౌరవబలమును గలగుండు పడఁ జేయుచున్నారు. అట్టివారల నీవిధ మయినరాధేయుఁడు గాని గాంగేయుఁడు గాని నివారింపఁ జాలఁడు. కాఁబట్టి నీవే పోయి సయిదోడుప్రాణములు సంరక్షించుకొమ్ము.

దుర్యో—ఆయుధహస్తుఁడ నయి నేను జీవించి యుండఁగా, దురాత్ముఁ డైనభీముఁడు గాని గీముఁడు గాని నాతమ్మునినీడ నయినఁ ద్రొక్కఁగలఁడా? తమ్ముఁడా! భయపడకు భయపడకు. ఓరీ రౌతుఁడురా అక్కడ? రథము రథము.

(నిష్క్రమించుచున్నాఁడు.)

[తెరలోపలఁ గలకలము.]

అశ్వ—(ముందు చూచి) మామా! మామా! అయ్యయ్యో! ఎంతకష్టము! తనయన్నగారిప్రతిజ్ఞ కెక్కడ భంగము గలుగునో యనుభయముతోడ గాండీవి కర్ణదుర్యోధనుల నిద్దఱను దుర్వారమైనశరధారావర్షమున ముంచుచు నెదురు కొనుటకుఁ బరుగెత్తుకొని వచ్చుచున్నాఁడు. హా! హా! యెంతగష్ట మెంతకష్టము! పాపము! దుశ్శాసనునిరక్తము భీముఁడు నిశ్శంకముగాఁ ద్రాగుచున్నాఁడు. అబ్బబ్బా! దుర్యోధనునితమ్మునికి సంభవించెడి యిట్టియాపదను నేను జూచి సహింపఁ జాలను. అనృత మయినను సరే. మామా! శస్త్రము శస్త్రము.

ఆ వె. సూనృతంబుకన్న శుభ మగు ననృతంబె;
నరకమునకె పోదు; నాక మేల?
పవనతనయువలన యువరాజుఁ గావంగ,
నుడిచినను గృపాణి నుడువ నేను. ౮౫

(ఖడ్గము గ్రహింపఁబోవుచున్నాఁడు.)

(తెరలో) మహాత్మా! భారద్వాజతనూజ! ఈవఱ కెన్నఁడు నతిక్రమింపని సత్యవాక్యము నిప్పు డేల యతిక్రమించెదవు?

కృపు—అబ్బాయీ! అశరీరవాణి నిన్నసత్యమువలనఁ గాపాడుచున్నది.

అశ్వ—ఏమిది! దైవాజ్ఞయు నాయుద్ధగమనమునకు వ్యతిరిక్తముగానే యున్నది. అన్నన్నా! ఎంతపాపము! దేవతలుగూడఁ బాండవపక్షపాతు లయి ప్రవర్తించుచున్నారే. ఆహా! భీముఁడు దుశ్శాసనునిరక్తము సర్వథా గ్రోలుచున్నాఁడు.

ఆ. వె. దుస్ససేను పేరురస్సు భీముఁడు వ్రచ్చి
రుధిరపూర మిట్లు గ్రోలు చుండ,
నూర కుంటి, నింక యుద్ధంబులోఁ బ్రియ
మేమి గూర్తుఁ గౌరవేశ్వరునకు? ౮౬

మామా ! కర్ణునిమీఁదికోపమున నే ననార్య మయినకార్యమును జేసితిని. నీవైన రారాజునకుఁ దోడుపడుము.

కృపు—ఈవిషయమున నేను బోయి ప్రతీకారముఁ జేసెదను. నీవు శిబిరమునకుఁ బోయి యుండుము.

(నిష్క్రమించిరి.)

గద్య. ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదలబ్ధసరసకవితాధురంధర వడ్డాది సాధువంశక్షీర
నీరాకరరాకాసుధాకరాచ్చనామాత్యపౌత్ర హారితసగోత్ర పవిత్రగుణకదంబ
లక్ష్మాంబాగర్భశుక్తిముక్తాఫల సూరపరాజప్రధానతనూభవ విబుధ
విధేయ సుబ్బరాయ నామధేయాంధ్రీకృత వేణీసంహార
నాటకంబునందుఁ దృతీయాంకము.

శ్రీరస్తు.

శ్రీపరమాత్మనేనమః

వేణీసంహారనాటకము.

చతుర్థాంకము.

—:o:—

[తరువాతఁ బ్రహారమూర్ఛితుండును రథస్థుండు నగుదుర్యోధనుని యుద్ధరంగమునకుఁ దొలఁగించుచు సూతుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

సూతు—(తొందరగాఁ బోవుచున్నాఁడు.)

(తెరలో) కౌరవపక్షపాతమునఁ బ్రాణధనంబులు పిడికిలించుకొని భుజబలదర్పమున మహాసమరదోహలు లయి తిరుగుచున్న యోరాజన్యులారా! మీరు పాఱిపోక ధైర్యము తెచ్చుకొని నిలువఁబడుఁడు. దుశ్శాసనునివక్షస్స్థలమును ప్రక్షాళించి త్రాగఁగా మిగిలినరక్తమును, స్నానము చేసినట్లు శరీర మంతటఁ బూసికొని, భీమసేనుఁడు మహాబీభత్సవేషముతో నుండుట విలోకించి, సేనలన్నియు విషాదమునఁ దమతమయాయుధములను విడిచిపెట్టి తిరిగి చూడక పలాయనము నొందుచున్నవి.

సూతు—(చూచి) ఆహా! ఇదిగో! గాలిచేఁ గదలుచామరము హేమకమండలువు దాఁక, మనుజమాతంగతురంగసంఘంబులకళేబరంబులచేత మిట్టపల్లంబుగా నున్నపాళికలనఁ బఱపు చుండుటంజేసి గణగణ యని చిఱుగంటలు మొరయుచుండఁ, గొట్టకొనను బంధించిన బెడఁగుపడగ యడియాలంబుగాఁ గ్రాలుచున్నయరద మెక్కి, పరబలపరాక్రమప్రసరంబును శరవర్షమున నడఁచివేయుచుఁ గృపాచార్యుండు మాసేనల కూఱటగా నతిత్వరితముగాఁ బోయి యర్జునునితో నెక్కటికయ్యంబు సేయుచున్న రాధేయునకుఁ దోడుపడియె. అమ్మయ్య! ఇప్పటిముట్టునకు మాబలములకుఁ గొంతయాధారము గలిగినది.

[తెరలోఁ గలకలానంతరము.]

భీము—ఓహో! కౌరవచమూయోధులార! ఓహో! పాండవవరూథినీయోధులార! నన్నుఁ జూచిన భయంబున ధనువులు, ఖడ్గములు, శక్తులుఁ, దోమరములుఁ, గ్రింద జాఱవిడిచి పాఱిపోయెద రేల? వెఱవకు వెఱవకుఁడు.

నేను మఱి యెవ్వఁడను గాను. దుశ్శాసనునిగుండెలు బద్దలుజేసి త్రాగినరుధిరాసవంబున మత్తిల్లి, కించి దవశిష్టప్రతిజ్ఞామహోత్సవంబునకుఁ దత్తఱ పడుచున్న పార్థమధ్యముఁడను, భీమసేనుండను, దుర్యోధనద్యూతనిర్జితదాసుండను. వినుండు మీ రందఱు సాక్షులు.

ఉ. మానధనుండు కార్ముకసమంచితుఁడై కురురాజు సూడ, వా
తానిసఖుండు కర్ణుఁడు, మఱిం గురుబంధులు, శల్యుఁడుం గనన్,
బానము చేసినా నిపుడె, పాండువధూకచ(స్త్రీ)కర్షణన్
బ్రాణము లుండ గోళ్ళ నెద వ్రచ్చి, కవోష్ణపుఁబచ్చినెత్తుటిన్ ౧

సూతు—(విని భయముతో) అరే ! కౌరవరాజకుమారమహారణ్యమున కుత్పాతమారుతుఁ డయినదురాత్ముఁడు భీముఁ డిదిగో ! సమీపించుచున్నాఁడు. ఈరాజు మూర్ఛ దేఱునంతకును దేరు దూరముగాఁ దోలుకొని పోయి నిలిపెదను. ఒకవేళ దుశ్శాసను నెడఁ బోలె నితనియెడఁ గూడ నీక్రూరుఁడు దురాత్మ్రగము చేయునేమో ? (త్వరితముగాఁ బోయి చూచి) ఆహా ! ఈచెరువులోనితామర పువ్వులమీఁదనుండి పరిమళముతో వీచెడుచల్లగాలిచేతఁ బల్లవంబులు గదల, నుల్లసిల్లుచున్న దదిగోఁ బెద్దమఱ్ఱిచెట్టు ; యుద్ధవ్యాపారముచేత శరీరము సొలసిన వీరపురుషున కిది విశ్రమింపఁ దగినసట్టుగదా ! ఇక్కడ నప్రియతో పవీజిత తాలవృంతశీతలంబును హరిచందనచ్ఛటాశీతలంబును సహజపరిమళమిళితంబును నయి ప్రాణము లేచి వచ్చినట్టు వీచుచున్నయీతమ్మికొలనిమీఁది చల్లగాలి మేను సోఁకుటచేత నీమహారాజు మూర్ఛదేఱును శత్రువుచేతఁ గేతనము నఱికివేయఁ బడినదిగావున నీరథమును నిర్నిరోధముగాఁ జెట్టుక్రిందికిఁ బోఁగలదు. (అక్కడఁ బ్రవేశించి) ఎవ రక్కడ ? (పాఱఁజూచి) ఏఁడీ ? సేవకుఁ డొక్కఁడును లేఁడు. అవిధముగానున్న భీమసేనునిఁ జూచియు, నీవిధముగానున్న మహారాజును జూచియు వాండ్రిందఱు నిశ్చయముగా శిబిరమునకే పాఱిపోయిరి. ఆహా ! ఎంతకష్టము !

చ. దొరఁకొని సింధురాజుతలఁ ద్రుంచెఁ గిరీటి, గురుండు గాచినన్;
హరిణమునట్లు చీరె నిపు డక్కట ! భీముఁడు, దుస్ససేను ; దు
ష్కరపుఁబ్రతిజ్ఞలున్ సుఫలగాఁ బగవారికి నెగ్గఁ జేసెదున్;
గురుకులమందు నింక విధి క్రూరతఁ బాయఁడ యంచు నెంచెదన్. ౨

(రాజును జూచి) ఏమిది! మహారాజిప్పటికిని దెప్పిఱిల కున్నాఁడు! అయ్యో ! ఎంత కష్టము! (నిట్టూర్పువిడిచి)

తే. గీ. మదపుఁటేనిక యన్నికొమ్మలను విఱువఁ
జివర కొకకొమ్మతో నున్న చెట్టుఁ బోలెఁ;

గోమరు లందఱుఁ దెగినయీాకులము, కట్టా!
దైవకృప నీవొక్కిమిగులుటఁ దప్పి దారి. 3.

హా! హతవిధీ! భరతకులవిముఖ!

తే. గీ. చెక్కు చెదరక పెనుగదచేతఁ బూని
సందియం బించు కంతయుఁ బొందకున్న
పవనతనయునియీాకొఱప్రతిన గూడ
నీబలంబున నెఱవేఱు నిశ్చయంబు. ౪.

దుర్యో—(తెలివివచ్చి ధీరముగా) ఆ! దుర్యోధనుఁడను నేను జీవించియుం డఁగా దురాత్ముఁ డయిన పవనతనయునిప్రతిజ్ఞ యెట్లు నెఱవేఱును? తమ్ముఁడా! దుశ్శాసనా! జడియకు జడియకు. ఇదిగో! నేను వచ్చితిని. సూతుఁడా! దుశ్శాసనుఁ డున్నయెడకు రథముఁ బోనిమ్ము.

సూతు—ఆయుష్మంతుఁడా! గుఱ్ఱములు రథమును వహింప లేవు. (వెనుకఁ దిరిగి) నీమనోరథమును మేమును.

దుర్యో—(రథమునుండి దిగి గర్వముతో) ఈరథగమనాలస్యముతో నేమి?

సూతు—(తెల్లఁబోయి సకరుణముగా) దేవా! శాంతింపు శాంతింపుము.

దుర్యో—ఇస్సిరో? సూతుఁడా! రథం బేటికి? నేను కేవల మరాతిసమ్మర్ద సంఘట్టసంచారి నగుదుర్యోధనుండను గదా! గదామాత్ర సహాయుఁడ నయి యుద్ధరంగమునఁ బ్రవేశించెదను.

సూతు—దేవా! అది నిజమే. ఏమి సందేహము?

దుర్యో—అలాగయిన నీ విట్లు పలికెద వేమి? చూడు.

తే. గీ. ప్రకృతిదుర్లలితుం డగుబాలు నను ఁ
బాపహింసింపఁ గాంచి, యాపనికిఁ బోవు
నన్ను వారణ సేయుచున్నావు; నీకు
లేదొ క్రోధంబు? దయ లేదొ? లేదొ సిగ్గు? ౫.

సూతు—(దుఃఖముతోఁ గాళ్ళమీాఁదఁబడి) దేవా! ఇంతకు నాపాపపుప్రకో దరుండు సంపూర్ణ ప్రతిజ్ఞుండయి పోయియుండును గాఁబట్టి యిట్లు విన్నవించెదను.

దుర్యో—(వెంటనే భూమిపయిఁబడి) హా! తమ్ముఁడా! దుశ్శాసన! హా! మదాజ్ఞావిరోధితపాండవ! హా! విక్రమైకరస! హా! మదంకదుర్లలిత! హా! విద్విషత్ప్రకర మదద్విరదకంఠీరవ! హా! యువరాజ! పలుక వేమి? (నిట్టూర్పువిడిచి)

ఉ. ఒప్పెడునాదుప్రోపునకు యోగ్యుఁడ వైనను, భోగసౌఖ్య మె
క్కప్పుడు నే ఘటింపను; పృథాగ్రజుఁడం గద నీకుఁ దమ్ముఁడా!

యిప్పుడు సంభవం బయినయీ పెనుముప్పున కేన కారణం;
బప్పుడు పంచినా నవినయంబునకున్ నినుఁ; గావ నియ్యెడన్. ౬.
(మూర్ఛిల్లుచున్నాఁడు.)

సూతు — రాజా! ఊఁఱడిల్లు మూఁఱడిల్లుము.

దుర్యో — (తెలివి వచ్చి) ఇస్సీ! సూత! ఏమి పని చేసితివి?

తే. గీ. దుష్టమృగమున కెర యిచ్చి తొలఁగి నట్లు,
బాలు, నాజ్ఞానువర్తిఁ, గావంగఁ దగిన
యనుజు దుశ్శాసనుని నరి కప్పగించి,
కటకటా! నాదుప్రాణము గాచికొంటి. ౭.

సూతు — మహారాజ! మర్మభేదు లయినయాలుఁగులచేతను, శక్తితోమర ప్రాసాదులచేతను మహారథు లందఱుఁ దెలివి దప్పి పడి పోవుటవలనను, దేవరయుఁ జేష్టలుదక్కి వ్రాలుటవలనను రథమిట్లు మరలించితిని.

దుర్యో — సూతుఁడా! ఎంతవిరుద్ధము చేసితివి?

క. ఆపాండవపశుఘ్నుఁగదా
వ్యాపారవృద్ధ్యనులఁ దెలివి నందమి గల్గెన్;
బాపని నెత్తుటిసజ్జను
నాపాపియొ నేనొ యెఱుఁగవా? యది తప్పెన్. ౮.

(నిట్టూర్పువిడిచి యాకాశము చూచి) హా! హతవిధీ! కృపావిరహిత! భరతకుల విముఖ!

తే. గీ. చంపుకొని పొమ్మ నన్నెటో సరగ నీవె,
పాపవృకోదరునిబారిఁ బడఁగ నొల్ల;

సూతు — హరి! హరీ! ఏ మిది మహారాజా!

దుర్యో — సకల మగుబంధువర్గంబుఁ జంపుకొన్న
భ్రష్టునకు నాకు జయ మేల? రాజ్య మేల? ౯.

(సప్రహారుండయి యొకపురుషుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

పురు — అయ్యా! సారథిద్వితీయుం డగుదుర్యోధనమహారాజు నిచ్చోట మీరు చూచినారా? ఏ మిది! ఒక్కఁడును మాట లాడఁడు! కానీ. ఇదిగోఁ బరికరములను ధరించినకొందఱుపురుషు లక్కడ గుంపుగా నగపడుచున్నారు. అక్కడకుఁ బోయి యడిగెదను. (చూచి) ఏ మది వా రందఱు గాఢముగా దెబ్బలు దగిలినతమ తేనిహృద యమునఁ జిక్కుకొన్నఘనసన్నాహజాలదుర్భేద్యముఖంబు లయినశిలీముఖంబులను గంకముఖంబులతోడ మెలపునఁ బుచ్చుచున్నారు; కాఁబట్టి వీరి కాగొడవ తెలియదు. పోనీ

మఱియొకచోటఁ గనుఁగొనియెదను. ఇదిగోఁ! కొందఱు వీరపురుషు లిక్కడఁ జేరి యున్నారు. ఇయ్యెడకుఁ బోయి యడిగెదను. (చేరి) అయ్యలారా! కురునాథుఁ డెందున్నాఁడో యెఱుఁగుదురా? ఏమిది! వీరు నన్నుఁజూచి పెద్దపెట్టున నేడ్చుచున్నారు! (చూచి) వీరికిని దెలియదు. అహో! ఇక్కడ నెంతదుష్కరము జరుగుచున్నది! ఇదిగో! నీ వీరమాత తనకుమారుఁడు యుద్ధములోఁ జనిపోవుట నాలకించి, రక్తాంబరధారిణియు సమగ్రభూషణయు నయినతనకోడలితోఁ గూడఁ జిచ్చుఱుకుచున్నది. (సశ్లాఘముగా) బాగు! వీరమాతా! బాగు! నీ వింకొకజన్మమునఁ బుత్రశోకము లేనిదాన వయ్యెదవు. కానీ. వేఱొకచోట వరసెదను. (మఱియొకవైపుచూచి) ఇదిగోఁ! గాయములనిండ గాయఃఁలు పడినను, వానికిఁ జికిత్స చేసికొనక యీజోదులు, వట్టిసల్లముతో నిలిచియున్న యీగుఱ్ఱమును జూచి యేడ్చుచున్నారు. దీని నారోహించి యుద్ధమునకుఁ బోయినవీరియేలిక చచ్చియుండును. ఇది నిశ్చయము. కాఁబట్టి వీరికి నెఱుక లేదు. పోనీ. కొండొకయెడకుఁబోయి విచారించెదను. (పాఱఁ జూచి) ఏమిది! సర్వజనులును దమతమయవస్థకుఁ దగినదుఃఖము ననుభవించుచు నదృష్టహీనులై తిరుగులాడుచున్నారు. ఇం దెవని నడుగుదును? ఎవని నిందింతును? పోనీ. నేనే విచారించుకొనెదను. (నడిచి) కాదు. దైవమును నిందించెదను. ఓహో! దైవమా! పదునొకం డక్షోహిణులసేనలకు నధినాథుఁడు, నూఱుగురు సోదరులకునన్నగారు, భీష్మద్రోణకర్ణాశ్వత్థామశల్యకృపకృతవర్మప్రముఖు లయినదొరలకును దక్కినరాజచక్రంబునకును నియామకుఁడు, సకలపృథివీమండలమునకు నిరంకుశప్రభుఁడు, నయిన దుర్యోధనమహారాజు నిప్పుడు వెదకించుచున్నావు. అతఁ డెచ్చట నుండెనో తెలియఁ జాలకున్నాను. (ఆలోచించి నిట్టూర్పువిడిచి) దైవమును దూఱ నేల? ఇదియంతయు దీనివిక్కృతియే గదా! విదురనీతినిరాకరణబీజంబును, భీష్మహితోపదేశతిరస్కారాంకురంబును, శకునిహితకప్రోత్సాహనాది నిరూఢమూలంబును, చిరకాలసంబద్ధవైరాలవాలంబును నగులాక్షాగృహద్యూతవిషవృక్షంబు ద్రౌపదీకేశాంబరాకర్షణమిషంబునఁ బువ్వుపూచి, తుద కీచందంబున ఫలించినది. (ఒండువలను చూచి) ఇదిగో! వివిధరత్నప్రభామిశ్రితం బయి తరణికిరణవారంబునుం బోలె దిగంతముల నింద్రచాపములను బుట్టించుచు నొకయరదంబు ఖండితధ్వజవేణుదండం బయి కానంబడుచున్నది. దీనిం బట్టి నిశ్చయముగా దుర్యోధనమహారా జక్కడ విశ్రమించియుండు నని నేను దలంచెదను. (పోయి చూచి) జయము జయము మహారాజా!

సూతు—(చూచి) దేవా! సమరములోనుండి సుందరకుఁడు వచ్చినాఁడు.

దుర్యో—(చూచి) ఓరీ! సుందరకా! అంగరాజునకుఁగుశలమే గదా?

సుంద—దేవా! కేవలశరీరమాత్రంబున.

దుర్యో—(తొందరగా) సుందరకా! ఏమి! అర్జునుఁడతనిగుఱ్ఱములను జంపెనా? సారథిని వధించెనా? రథమును భగ్నము చేసెనా?

సుంద—దేవా! అతనిరథము నే కాదు; మనోరథమును గూడ భగ్నము చేసెను.

దుర్యో—(రోషముతో) ఓరీ! ఏమిరా యిది? ఊరిసినపుండుల నుప్పు వెట్టినట్టు లీవఱకే వ్యాకులపడుచున్న నామనస్సును నీసందిగ్ధపుమాటలచేత మఱింతవ్యాకులపఱుచుచున్నావు. ఆ దేమో స్పష్టముగాఁ జెప్పఁగదర!

సుంద—అయ్యా! చిత్తము. దేవరవారిమకుటమణిప్రభావముచేత నాగాయుముల వేదన యుపశమిల్లినది. (గర్వముతో నడిచి) దేవా! చిత్తగింపుఁడు. ఇదిగో! దుశ్శాసన కుమారునివధ—

(ఇట్లు సగము చెప్పి నోరుమూసికొనుచున్నాఁడు.)

సూతు—సుందరకా! చెప్పుచెప్పు. అది రాజుగా రీవఱకే విన్నారు.

దుర్యో—సుందరకా! చెప్పుము. అది విన్నాము.

సుంద—దేవా! చిత్తగింపుఁడు, ఇదిగో! దుశ్శాసనకుమారునివధ నిరీక్షించి క్రోధావేశంబునఁ బ్రభువరేణ్యుం డయినకర్ణుండు భీషణమ్ముగా నెమ్మొగమ్మునఁ గనుబొమ్మలుముడివఱుచి, హస్తమ్మున యతిలాఘవమ్మున సంధానమోక్షణమ్ములు తెలియనలవి గాకుండ, నఖండబాణవర్షము గురియించుచు దురాచారుం డగునాభీమసేనహతకుని నెదురుకొనెను.

ఇద్దఱు—తరువాతఁ దరువాత?

సుంద—అనంతర మోదేవా! ఇరువీడులందును గ్రందుకొనుచున్న కరితురగపదాతి సముదయంబులపదఘట్టనముల నెగసినధరాపరాగంబుచేతను, నటునిటు నడుగొం డలవలెఁ, దిరుగులాడెడు వేదండతండములచేతను,సంభవించి కాఱుగ్రమ్మిన చిమ్మచీఁకటికతమ్మున నుభయబలమ్ములు నంధీభూతంబులయి భూతలంబును జూడలేకపోయెను.

ఇద్దఱు—తరువాతఁ దరువాత?

సుంద—తరువాత నోస్వామీ! ఆకర్ణాంతము పూర్ణముగా నారి నాకర్షించి విడుచుటవలనఁ గలిగినభీషణధనుష్టంకారంబులు, ప్రళయధారాధరగంభీరగర్జారవానుకారంబు లయి, శ్రవణపుటంబులు వ్రక్కలించుచుండెను.

దుర్యో—తరువాత?

సుంద—తరువాత నోమహాప్రభూ! వా రిరువురకును జరిగిన భీతిల్లినదారుణరణంబునఁ బరస్పరసింహనాదంబు లనియెడునుఱుములును, నన్యోన్యపరిముక్తవివిధాయుధసంఘట్టనంబున మండెడుమయుమఱుపు లనియెడు మెఱుములును, బహుళరుధిరబిందువు

లనియెడుఖద్యోతబృందములును గలిగి, నిరంతరస్తనితధనుర్జలధరవిసృతశరధారా వర్షంబున దుర్దర్శనం బయి, దుర్దినంబు సంభూతం బయ్యె.

దుర్యో—తరువాత ?

సుంద—పిమ్మట నో దేవా! ఇంతలోఁ దనయన్నగారికిఁ బరాభవ మగు నని భీతి యెత్తి. వజ్రనిర్ఘాతనిర్ఘోషసదృశం బగుచక్రనేమిసంఘట్టనధ్వానంబు ఘోటకహేషారవంబుల నినుమడింప, శిఖరావబద్ధకపిధ్వజప్రభలు కన్నుల మిఱుమిట్లు గొలుప, శంఖచక్రగదాశార్ఙ్గలాంఛితచతుర్భుజుం డగుకృష్ణుండు హయాగ్రంబులపగ్గంబులు నడల విడిచి నొగలపయిం గూరుచుండఁ, బిట్టపిడుగులుం బోలె బిట్టొత్తిన పాంచజన్యదేవదత్తంబులపెద్దయెలివు దిఙ్మండలంబు చెవుడు పఱుపఁ, జూపఱకు భీతి కొలిపెడు తనయరదంబును బరువెత్తించుకొని కడురయంబునఁ గిరీటి యటకుఁ జనుదెంచె.

దుర్యో—తరువాతఁ దరువాత ?

సుంద—దేవా! అటుతరువాత నీవిధమున భీమార్జును లిద్దఱును దన తండ్రిని దాఁకుట యాలోకించి, తత్తఱపాటుతోఁ దలనుండి జాఱినరతనాలకుళ్ళాయి నైన గణియింపక, చెవియంట వింటినారిని దివిచి, లక్ష్యలాఘవంబులు దీపింపఁ, బుంఖానుపుంఖంబులుగాఁ బఱపి, యంపవానల నరిబలంబుల ముంచివేయుచుఁ, బదపదమని సారథిని దొరపెట్టుచుఁ, దత్క్షణంబ వృషసేనకుమారుం డచ్చోటికి విచ్చేసెను.

దుర్యో—(గర్వముతో) తరువాతఁ దరువాత ?

సుంద—తరువాత దేవా! అట్లు వచ్చి వెంటనే యావృషసేనకుమారుండు, నూఱినకాటుకతీరున నునుపుదేరి నిగనిగ లాడుచుండెడుపుంఖములయందు సోగనుగా గ్రద్దఱెక్కలు బిగియించి కట్టి, క్రొత్తగా సానఁబట్టిన మెఱుఁగారువెడఁదవాతిదొడ్డ నారసంబులు గుప్పఁగూరలుగాఁ బఱపి, ముహూర్తమాత్రములోపల నాకవ్వడి యరదంబును బువ్వులు పూచినచెట్టులాగున నలుఁగులతోఁ గప్పివేసెను.

ఇద్దఱు—(సంతోషముతో) తరువాతఁ దరువాత ?

సుంద—అటుపిమ్మట దేవా! అయ్యర్జునుండు తీవ్రముగా బల్లెములవంటివాఁడికోలలు వేనవేలు పఱపి చిఱునవ్వు నవ్వి యాతని కిట్లనియె. ఓరోరివృషసేన! నీతండ్రి యట్టివాఁడే నాయెదుర దురమున నిలువలేక యున్నాఁడు. నీ వెంతరా పిల్లవాఁడవు? వేఱొకయెడ కేగి నీయీడుకుమారులతోఁ బోరు సలుపుము. అనవుడు వానుడువు లాలించి తనజనకుని నధిక్షేపించినాఁడనుకోపంబున మొగమంతయుఁ జేవుఱింప, బొమ్మముడితో హుమ్మని యవుడు కఱచి, వృషసేనకుమారుండు గాండీవికి నాకర్ణాకృష్ట

ముక్తంబు లయి మర్మంబులు భేదించుతీవ్రనారాచపరంపరలఁ బ్రత్యుత్తరం బిచ్చెఁ గాని పరుషవచనంబుల నీయఁ డయ్యె.

దుర్యో — వహవా! వృషసేనుఁడా! వహవా! తరువాతఁ దరువాత?

సుంద — దేవా! అనంతరము శాతశరాభిఘాతవేదనా పరిభూతకోపాతిరేకుండును, శరవర్షతిరోహితుండును నగునయ్యర్జునుండు గాండీవజ్యాశబ్దనిర్జితగర్జితారవుం డయి యెల్లవారు అచ్చపడునట్లు తనయస్త్రశిక్షాపాండిత్యంబునకు, బాహుబలంబునకు ననురూపం బయినవ్యాపారము చేయఁజాగెను.

దుర్యో —(అభిప్రాయగర్భముగా) తరువాతఁ దరువాత?

సుంద — మహాప్రభూ! అటుపిమ్మట నట్లు మహాశ్చర్యంబుగా సమరచాతుర్యంబును జూపుచున్న తనశత్రువును జూచి వృషసేనకుమారుండును దూణీరమునఁ బాణి చేర్చుటయు, నారి తివియుటయు నలుఁగు దొడుగుటయు, నేయుటయు సహస్రాక్షున కయినఁ దెలియ నలవి గాకుండ నతివిచిత్రంబుగాఁ దనకరలాఘవశరలాఘవంబులు చూపఁ దొడఁగెను.

దుర్యో — తరువాతఁ దరువాత?

సుంద — స్వామీ! అనంతర మేమి చెప్పుదు? అప్పు డెల్లవారును దమతమ యుద్ధంబులు నిలిపివేసి, చిరకాలము నుండి మనంబులఁ గుములుకొనుచున్న క్రోధానలంబును జల్లార్చుకొని యీయుభయవీరులు సేయువిచిత్రసమరంబును మహాశ్చర్యంబుతోఁ జూచుచుండి యిరువాగువారు నొక్కుమ్మడిగా 'వృషసేనుఁడా! బళి బళి!'' యని మిన్నుముట్ట మహాకలకలంబు గావించిరి.

దుర్యో —(ఆశ్చర్యముతో) తరువాతఁ దరువాత?

సుంద — తరువాత దేవా! ఇట్లు మేటివిలుకాండ్ర నందఱ నతిక్రమించి తనకుమారుఁడు బాహుపరాక్రమంబు చూపుచుండినతఱి స్వామి యైనకర్ణుండు హర్షశోకకరుణాశంకాసంకులమానసుం డయి భీమసేనునిపయి సహస్రంబులు తూపులును, వృషసేనునిపై సాస్రంబులు చూపులును బ్రసరింపఁ జేయుచుండెను.

దుర్యో —(భయముతో) తరువాతఁ దరువాత?

సుంద — దేవా! తరువాత నట్లావృషసేనకుమారుని నిరువీడులవారును బళిబళి యని ప్రశంసించుటచేత గాండీవి మండిపడి మెఱుఁగులు గ్రక్కుచున్న కఱకుటమ్ముల నొక్కుమ్మొగి నక్కుమారుని తేరిమీఁదను, సారథిమీఁదను, గుఱ్ఱములమీఁదను, వింటిమీఁదను, నారిమీఁదను, రాజలాంఛన మగువెల్లగొడుగుమీఁదను వీరావేశంబున వర్షధారలవలె లెక్క లేక కురియించెను.

దుర్యో—(భయముతో) తరువాతఁ దరువాత?

సుంద—దేవా! తరువాతవృషసేనకుమారుండు భగ్నరథుండు ఖండితకోదండుండునయి గుబాలున భూతలంబునకు లంఘించి తనశత్రువు ప్రయోగించెడు వాలుటమ్ములను జక్రమువోలె గిఱ్ఱునఁ దిరిగి తప్పించుకొనుచుండెను.

దుర్యో—(అడలుతో) తరువాతఁ దరువాత?

సుంద—అటుపిమ్మట దేవా! తననందనునిస్యందనము చక్కు చేసె నను నక్కసునం బ్రభు వైనకర్ణుండు భీమసేనునితాఁకుడు నొకగణన సేయక వాఁడిసాయకంబుల నర్జునునిపయి నిగిడింపఁ జాగెను. ఇంతలోఁ దనపరిజనుండు కొనివచ్చిన వేఱొకతేరి నారోహించి వృషసేనకుమారుండు వెండియు గాండివిసే తలపడి, యోరోరి మదీయజనకాధిక్షేపవాచాట! మధ్యమపాండవా! నాశరంబులు నీశరీరంబును విడిచిపెట్టి వేఱొకయెడకుఁ బోవ నిష్టపడకున్నవి. ఇదిగోఁ! గాచుకొమ్మని వేనవేలు వాలుటమ్ము లతని సెమ్మేను గ్రమ్ముకొనం బ్రయోగించి యుఱుము ముఱిమినట్లు పెద్ద సింహనాదంబు గావించెను.

దుర్యో—(విస్మయముతో) ఔరా! అతితేతినవాఁడు గాకపోయినను గుఱ్ఱవాఁ డెంతపరాక్రమము చూపెను! తరువాతఁ దరువాత?

సుంద—పిమ్మట దేవా! ధనంజయుఁడు తనమీఁదికి వచ్చుబాణములనెల్ల నింతలింతలు చిదురుపలు గావించి రోషావేశంబునఁ గనత్కనకకింకిణీజాలఝుంకారవిరావిణియు, మేఘావరోధముక్తనభోమండలనిర్మలాకారిణియు, నిశితశ్యామలస్నిగ్ధముఖియు, వివిధరత్నప్రభాభాసురభీషణస్వరూపిణియు, రమణీయదర్శనయు నయి తనయరదంబునఁ బ్రజ్వలించుచున్నశక్తి నట్టె యంది పుచ్చుకొని నవ్వుచు నక్కుమారున కభిముఖముగా విడిచిపెట్టెను.

దుర్యో—(విషాదముతో) అయ్యయ్యో! తరువాతఁ దరువాత?

సుంద—అటుపిమ్మట దేవా! నింగి యంతయు మ్రింగివేయునట్లు బగుబగున మండుచుఁ గుమారునిదెసకు వచ్చుచున్నయాశక్తిని జూచినతోడనే స్వామియయిన కర్ణునికిఁ జేతినుండి ధనుర్బాణంబులును, హృదయంబునుండి వీరసులభోత్సాహంబును, కన్నులనుండి బాష్పబిందుసందోహంబును, వదనంబునుండి వికాసంబును నొక్కమాఱుగా జాఱిపోయెను. అర్జునుండు హసించెను. భీమసేనుండు సింహనాదంబు చేసెను. అతిదారుణ మతిదుష్కర మని మనబలంబులు హాహాకార మొనరించెను.

దుర్యో—(విచారముతో) తరువాతఁ దరువాత?

సుంద—అటుపిమ్మట నోస్వామీ! వృషసేనకుమారుఁడు దానికి లేశ మైన భయం బొందక వాఁడి యయినయొకయర్ధచంద్రబాణమును వింటఁ దొడిగి, గుఱిపెట్టి

చెవి యంట గొనయంబు లాగి, యాశక్తికి సూటిగా దానిని విడిచిపెట్టిన, ఫాలాక్షునిచేత భాగీరథియుంబోలె మధ్యభాగమున నే యది ముత్తునియగాఁ జేయఁ బడియె.

దుర్యో—సెబాసు! వృషసేనుఁడా! సెబాసు! తరువాతఁ దరువాత!

సుంద—తరువాత నో దేవా! హల్లకల్లోలం బగుసముద్రంబులాగునఁ గోలాహలంబు గావించెడువీరవాంఛులసాధువాదంబులకతంబునఁ దూర్యారావంబులు వినంబడ వయ్యెను. అంతరిక్షమున వీక్షించెడుగరుడగంధర్వసిద్ధసాధ్యాది వియచ్చరులు గురిసిన పుష్పవర్షంబున సమరాంగణంబు సంఛన్నం బయ్యె.

దుర్యో—ఆహా! బాలకునిపరాక్రమము! తరువాతఁ దరువాత?

సుంద—తరువాత దేవా! సామి యయినకర్ణుం డీవిధంబునం బలికె. ఓవృకోదరా! నీకు నాకును యుద్ధ మింకను ముగియలేదు; అయినను ముహూర్త మాత్రము నన్ననుమతింపుము. కొంచెముసేపు నాకుమారునియు నీతమ్మునియు ధనుర్వేదశిక్షానైపుణ్యము చూడ వేడుక పొడముచున్నది. ఇది నీవును జూడఁ దగినదే గదా? అని కర్ణుఁడును భీమసేనుండును రణవ్యాపారనిర్బంధము నుండి విముక్తులయి, ముహూర్త మాత్రము పరస్పరవైరముల నుంచివేసికొని, వృషసేనధనంజయులు సలుపుద్వంద్వయుద్ధంబు నిరీక్షించుచుండిరి.

దుర్యో—(సాభిప్రాయముగా) తరువాతఁ దరువాత!

సుంద—తరువాత దేవా! శక్తినిఖండించినాఁడను రోసమున నాసమయమున గాండీవి యిట్లనియె. ఓరోరిదుర్యోధనాది—(సగము చెప్పి సిగ్గుపడుచున్నాఁడు.)

దుర్యో—సుందరకా! చెప్పుము. అది పరుఁ డన్నమాట గదా!

సుంద—దేవా! యవధారు. ఓరోరిదుర్యోధనాదికౌరవసేనా ప్రభువులారా! ఓరియవినయార్ణవకర్ణధార! కర్ణ! మీరు నేను దగ్గఱలేనియప్పుడు నాకొడుకు నభిమన్యుని నధర్మముగా నేకాకిని జేసి, చంపితిరి గదా! ఇదిగో! నేను మీ రందఱుఁ జూచుచుండఁగా ధర్మయుద్ధమున నీవృషసేనకుమారుని నామైకశేషునిఁ గావించెదను. అని పలికి దర్పాతిరేకంబున నిర్ఘాతఘోషభీషణమౌర్వీచండనాదం బగుగాండీవంబు సారించిన, సామియైనకర్ణుండును గాలపృష్ఠం బనునిజకార్ముకంబు నెక్కువెట్టె.

దుర్యో—(సావహిత్థముగా) తరువాతఁ దరువాత?

సుంద—తరువాత నో దేవా! కర్ణునితో వెండియు యుద్ధంబు సేయఁబూనెడు భీమసేనుని వారించి, యర్జునుండు తా నొక్కరుండ కర్ణవృషసేనుల తేరు లనెడు

కూలముల నొరసికొనునట్లు బాణౌఘద్వయంబును బ్రవహింపఁజేసెను. అంత వారిరువురును బరస్పరస్నేహంబునఁ దమధనుర్విద్యాపాండిత్యవిశేషంబును జూపుచు నయ్యర్జునుం దలపడిరి.

దుర్యో—తరువాతఁ దరువాత ?

సుంద—తరువాత నేమిచెప్పుదు దేవా ! పాండవమధ్యముండు 'ఖండగాండీవమౌర్వీనిర్ఘోషమాత్రవిజ్ఞాతం బగుశరవర్షం బజస్రంబునఁ గురియించుడు, దానికతన భూమియు నాకసంబును, గర్ణుండుఁ గుమారుండును, వారువంబులు వీరవారంబును, దేరును సారథియును, కేతనంబు నాతపత్త్రంబును, దిక్కులు గిక్కులును గన్నుల కగోచరంబు లయ్యె.

దుర్యో—(విస్మయముతో) తరువాతఁ దరువాత ?

సుంద—దేవా ! పిమ్మట నొకక్షణమాత్రములో నాయంపవాన వెలిసెను. అంతలోఁ బాండవసైన్యంబునందు హర్షముతోఁ బెద్దసింహనాదంబులును, కౌరవసైన్యంబున వృషసేనుఁడు చచ్చెఁజచ్చె ననుహాహాకారంబులును, నొక్కపెట్ట యెగసెను.

దుర్యో—(సబాష్పరోషం బయి) తరువాతఁ దరువాత ?

సుంద—తరువాత దేవా ! హతసారథితురంగముండును, ఖండితచ్ఛత్త్రచామరచాపకేతనుండును నయి హృదయమర్మభేదక మ్మగునొకవాలుటమ్మున మేను వ్రీలి, స్వర్గభ్రష్టుం డయినసురకుమారుండునుం బోలెఁ దేరిమీఁదఁ బడియున్న యావృషసేనకుమారునిఁ జూచి వచ్చితిని.

దుర్యో—అహహా ! వృషసేనకుమార ! అటుపిమ్మట వినుట చాలును. హా ! వత్స ! హా ! వృషసేన ! హా ! మదంకదుర్లలిత ! హా ! మదాజ్ఞానుసారి ! హా ! గదాయుద్ధప్రియశిష్య ! హా ! శౌర్యసాగర ! హా ! రాధేయకులప్రరోహ ! హా ! ప్రియదర్శన ! హా ! దుశ్శాసననిర్విశేష ! హా ! సర్వగురువత్సల ! పలుకవేమిరా కుమార.

తే. గీ. కొలిచినను జేరలకు మీఱు గొప్పకనులు,
మోను లెత్తెడునూనూఁగుమీసములును,
గలిగి శశిఁ బోలునీముఖకమల మకట !
కర్ణుఁ డెటు గాంచె, నీవు మ్రాఁగన్ను వెట్ట ? ౧౦

సూతు—దేవా ! దుఃఖసాగరమున మునుంగకుము.

దుర్యో—సూతుఁడా! దుఃఖవంతులును బుణ్యాత్ములే సుమీ. ఇఁక మాకో—

తే. గీ. కనులయెదుర బంధుగణ మెల్ల హత మయ్యె,
నసెడుపరిభవపు దవానలమున
హృదయ మెప్పుడును దహించుక పోయెడు;
నేటిదుఃఖ మింక నేటబాధ? (మూర్ఛిల్లుచున్నాఁడు.) ౧౧

సూతు—ఓఅడిల్లు మాఅడిల్లుము. (చేలచెఱంగున విసరుచు) దేవా! అతిదుఃఖమును బొందకుము.

దుర్యో—(తెలివి వచ్చి) సుందరకా! నాచెలికాఁడు కర్ణుఁ డప్పు డేమి చేసెను?

సుంద—తరువాత దేవా! అత్తెఱంగున జీవంబులు విడిచినకొడుకును జూచి, యంగరాజు, కాలువలు గట్టుకన్నీరు చేతులతోఁ దుడుచుకొనుచుఁ, దనశరవేదనను గణియింపక వెండియు గాండీవిని దలపడియె. అట్లు పుత్రవధామర్షంబున జీవితంబుపై నాస రోసి పరాక్రమింపవచ్చినయాకర్ణునిఁ జూచి, భీమసేననకులసహదేవులును పాంచాలప్రముఖబంధుగణంబును నయ్యర్జునునరదంబును బొదివికొనిరి.

దుర్యో—తరువాతఁ దరువాత?

సుంద—దేవా! తరువాత నయ్యర్జునుచేతిగాండీవం బనుమహాప్రళయపయోధరంబు, తెఱపి యీకుండ నఖండశరధారావర్షంబున దశదిశలను ముంచుచుండఁ, గనుంగొని యంగరాజుతో శల్యుం డిట్లనియె. అంగరాజా! గుఱ్ఱంబులు చచ్చినవి. నొగలుఁ జక్రనేమియు విఱిగినవి. ఇట్టిరథ మెక్కి నీవు భీమార్జునుల నెదురుకొనుట మేలు కాదు. అని చెప్పి మరలించి యాయనను రథమునుండి దింపి పలుదెఱఁగుల నూఱడించెను.

దుర్యో—తరువాతఁ దరువాత?

సుంద—దేవా! గొండొకతడ వాలసించి తరువాతఁ దనపరిజనునిఁ జూచి యంగరాజు, నీవు త్వరితముగా వేఱొకయరదము గొనితెమ్మని సెలవిచ్చిన, వాఁడు నట్లు కావించె. అప్పు డాయన నావైపు చూచి, సుందరకా! ఇటురమ్మని పిలిచిన, నేను వినయముతో సమీపమునకుఁ బోయి నిలిచితిని. అంతటఁ దనముఖపట్టమును దీసి చేతఁ బట్టుకొని, నెత్తుటితో నిండి యున్నగాయములయందు బాణాగ్రమును ముంచి దేవరవారి కీజాబును వ్రాసి పంపెను. (పట్టిక సమర్పించుచున్నాఁడు.)

దుర్యో—(పుచ్చుకొని చదువుచున్నాఁడు.)

స్వస్తిశ్రీ మహారాజదుర్యోధన !

ఈగడియవఱకు గాఢముగాఁ గంఠాశ్లేషము గావించుకొని యుద్ధరంగము నుండి కర్ణుండు సలుపువిజ్ఞాపనము.

మ. వరదివ్యాస్త్రవిశారదుం డితని కెవ్వం డీ డనిన్ ? నాకు నా
గ్గురువై ద్రోణులకంటె నెక్కు-డితఁడే కూల్చెం బృథాసూనులన్,
దురమం దంచు, బహూకరింతు నను; నే దుశ్శాసనారిన్ భయా
తురతం గూలుపనైతి; నీఁగు వగ నీద్రోహ్రినో కన్నీటనో. ౧౨

దుర్యో—వయస్యా ! కర్ణుఁడా ! ఏమిది ! నూఱుగురుతమ్ములును జచ్చి దుఃఖపడుచున్న నన్ను నీవచోభల్లఘాతములచేత మఱింత దుఃఖ పెట్టుచున్నావు. సుందరకా ! సరే. ఇప్పు డంగరాజు ప్రియత్న మేమి ?

సుంద—దేవా ! ఆయన యిప్పు డాత్మవధయందుఁ గృతనిశ్చయుఁ డయి కవచవిసర్జనంబు గావించి యుద్ధమునకుఁ బోవ నుండెను.

దుర్యో—(విని యదరిపడి లేచి) సుందరకా ! నీవు త్వరితముగాఁబోయి మిత్రుఁ డైనయంగరాజుతో నావచనంబులుగా నిట్లు పలుకుము. "మిత్రమా ! నీ విప్పుడు జయకాంక్షను వదలుకొనుము. మనయిరువురసంకల్పము నొకటియేగదా!

ఉ. పాండవులన్ వధించి, హతబంధుల కిచ్చి నివాపవారి, చా
వుండినవాండ్రతోఁ గలసి యొక్క-మ శోడిచి, యింక మీఁద నె
న్నండును లేదు గావున ఘనంబుగ నొండొరుఁ గౌఁగిలించి, యీ
మొండిశరీరముల్ విడిచి పోదము, దుఃఖమొ సౌఖ్యమో తుదిన్. ౧౩

ఇంక దుఃఖమును గుఱించి నిన్ను నే నేమని యూఱడింతును ?

క. సూనుఁడు గాఁ డనుకో వృష
సేనుఁడు నీ; కట్ల దుస్ససేనుఁడు నాకున్
దా నను జన్ముఁడు గాఁ; డిఁక
నే ని న్నేమందు ? నన్ను నే మనె దీవున్ ?" అని ౧౪

సుంద—చిత్తము దేవా ! (నిష్క్రమించుచున్నాఁడు.)

దుర్యో—ఓయీ ! బండికండ్లచప్పుడులా గున్నది.

సూతు—(ఆలకించి) దేవా ! అది యిప్పు డధిక మగుచున్నది.

దుర్యో—సరే, పరిజనుఁడు రథమును దోలుకొని వచ్చుచున్నాఁడు. నీవు పోయి దాని నాయితంబు సేయుము.

సూతు—చిత్తము దేవా ! (నిష్క్రమించి మరలఁ బ్రవేశించుచున్నాఁడు.)

దుర్యో—ఏమిది రథ మెక్కి రావంపితివి ?

సూతు—దేవ ! ఇదిగో ! అమ్మగారును నాయనగారును సంజయునితో రథారూఢు లయి తమయొద్దకె వచ్చుచున్నారు.

దుర్యో—హాహా ! దైవ మెంతబీభత్సము చేసెను ! సూతుఁడా ! నీవు త్వరితముగా రథము నాయితంబు చేసికొని రమ్ము. నేనును నాయనగారి కగపడకుండ దాఁగి యుండెదను.

సూతు—దేవా ! వారికి నీవుతప్ప మఱి యెవ్వరుఁ జుట్టంబులు లేరుగదా ! దేవర కూడ వారి నూఱడింపక పోవుట యుచిత మగునా ?

దుర్యో—సూతుఁడా ! అదృష్టహీనుఁడను నేను వారి నేమనియూఱడింతును? చూడు,

చ. అని కిటు వచ్చుచుండ, మము నమ్మయుఁ దండ్రియుఁ, బాష్పబిందువుల్
గనులను రాల మూర్ధములు ఘ్రాణము చేసిక యంచి; రిప్పు డే
మనుదు నొకండ డగ్గతి ? కటాకట ! మిఁగిలితి దుస్ససేను; వ
త్తినయుని యట్టిదారుణవధ న్విని, యాముదియంధు లోర్తురే ? ౧౫

ఐనను దల్లిదండ్రు లవశ్యము వందనీయులు గదా ! (నిష్క్రమించుచున్నారు.)

గద్య. ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదలబ్ధసరసకవితాధురంధర వడ్డాది సాం వంశక్షీర
నీరాకరరాకాసుధాకరాచ్చనామాత్యపౌత్ర హరితసగోత్ర పవిత్రగుణకదంబ
లక్ష్మాంబాగర్భశుక్తిముక్తాఫల సూరపరాజప్రధానతనూభవ విబుధ
విధేయ సుబ్బరాయ నామధేయాంధ్రీకృత వేణీసంహార
నాటకంబునందుఁ జతుర్థాంకము.

శ్రీ రస్తు.

శ్రీపరమాత్మనేనమః

వేణీ సంహార నాటకము.

(0)

పంచమాంకము.

[తరువాత రథ మెక్కి గాంధారియు సంజయుఁడును ధృతరాష్ట్రుఁడును ప్రవేశించుచున్నారు.]

ధృత—వత్స !సంజయ ! కురుకులవనంబున నొక్కయాకులాగున మిగిలియున్న నాకొడుకు దుర్యోధనుఁ డేమయిన బ్రతికి యున్నాడాఁ ? లేదా?

గాంధా—సంజయా ! నిజముగా బ్రతికి యుండెనేని యెక్కడనున్నాఁడో చెప్పుము.

సంజ—ఇదిగో ! మహారాజొక్కఁడు నీమఱ్ఱిచెట్టునీడను గూరుచున్నాఁడు.

గాంధా—కుఱ్ఱవాఁ డొక్కఁడే యని చెప్పుచున్నావు. ఇపుడు నూఱుగురు తమ్ములును వానిపార్శ్వభాగమున లేరా ?

సంజ—నాయనా ; అమ్మా ! రథము నిమ్మళముగా దిగుండి.

ఇద్దఱు—(దిగుచున్నారు.)

[తరువాత దుర్యోధనుఁడు ప్రవేశించి సిగ్గుతోఁ గూర్చున్నాఁడు]

సంజ—(దగ్గఱఁ బోయి) జయము జయము మహారాజ ! ఇదిగో ! నాయనగారు అమ్మగారితోఁగూడ వేంచేసినారు. వారిని జూడ వేమి మహారాజా?

దుర్యో—(తెలతెలఁబోవుచున్నాఁడు.)

ధృత—చ. ఘనకవచంబు దీయఁగనె, కంకటముఖంబున నల్గు లూడ్చి, వే
గను వ్రణపట్టికల్ వయిచి కట్టుడు, దిండున నత్తమిల్లి, ద
ద్వ్వన జితశత్రులన్ నృపులఁ బుత్రక ! నీవు ప్రియంబునం గనుం
గొనఁ, జెవిఁ జేరి వేదననుగూరిచి నిన్నడుగన్ దురాత్ముఁడన్.

(ధృతరాష్ట్రుఁడు గాంధారియుఁ దడవి చూచి కౌఁగిలించుకొనుచున్నారు.)

గాంధా—కుమారా ! తీవ్రమయిన గాయముల వేదనచేత క్షోభపడుచు మాతోఁగూడ మాటలాడఁ జాలకున్నావా ? తండ్రీ.

ధృత — వత్స ! దుర్యోధన ! ఏ మిది ? మును పెప్పుడు నిట్లు కావే ! మాతోఁ గూడఁ బలుక వేమి ?

గాంధా — కుఱ్ఱా ! నీవే మాతో మాట లాడక పోయిన, నిఁక దుశ్శాసనుఁడును దుర్మర్షణుఁడును దక్కిన కొడుకులు నిప్పుడు మాట లాడుదురా యన్నా ?

(రోదనము చేయుచున్నది.)

దుర్యో — ఉ. తమ్ములచావు చూచితిని దత్ప్రతికారము సేయ లేక; నే
నమ్మరో ! నీకు నయ్యకును నాఁటనిదుఃఖము దెచ్చినాను; స్వ
చ్ఛ మ్మగుచున్న యీ భరతసంతతి మాపఁగఁ బుట్టుపాతకిన్;
నమ్ముఁడి మీకు నేను సుతనాశుఁడఁ గాని సుతుండఁగాఁ జుఁడీ.

గాంధా — బిడ్డా ! ఏలయిట్లు పరిదేవనంబు చేసెదవు ? నీ వయిన నీయంధుల కిద్దఱకును దారిఁ జూపుటకుఁ జిరంజీవి వయి బ్రదుకుము. నాకు రాజ్యముతో నేమి? వైరముతో నేమి ? (రోదనము చేయుచున్నది.)

దుర్యో — తే. గీ. అమ్మరో ! యిట్టివెడమాట లాడఁ దగునె ?
పుట్టినది రాచపుట్టువు పొగలె నేల ?
సుతశతము రూపు మాయుట చూడ; వెంత
కఠినురాలవో శిలు నన్నుఁ గావఁ దలఁతు.

ఇది నిశ్చయముగాఁ బుత్రశోకమువలనివికారము.

సంజ — మహారాజా! చేఁద నూతఁబడినఁ బ్రాఁడు కూడ నక్కడఁ బాఱవేయఁ గూడ దనులోకోక్తి యబద్ధమా యేమి ?

దుర్యో — ఈయుక్తి చాల దోయి. ఉపక్రియాప్రమాణము లేనియప్పు డుపకరణముతో నేమి ప్రయోజనము ? (రోదనము చేయుచున్నాఁడు.)

ధృత — (దుర్యోధనునిఁ గౌఁగిలించుకొని) అబ్బాయీ! ఊఱడిల్లుము. మిక్కిలి దీనుల మయినతలిదండ్రులను మ మ్మూఱడింపుము.

దుర్యో — తండ్రీ ! ఇప్పుడు మి మ్మూఱడించుటకు దుష్కరము; కాని —

ఆ. వె. కుంతి నిప్పు డేను గొడుకులు సచ్చిన
దానిఁగా నొనర్తుఁ దథ్యముగను;
మీరు దానితోఁ గుమారులకొఱ కేడ్చి,
యూఱడించుకొనెద రొకరి నొకరు. ౪

గాంధా — బిడ్డా! నీ వొక్కఁడ వయిన బ్రతికిన నంతే చాలును; నే నెవరిని గూర్చి శోకింతును ? కొడుకా ! ఇది యుద్ధమునకు సమయము గాదు. శాంతింపుము

ఇదిగో! దోసిలి పట్టి బతిమాలుకొనుచున్నాను. సమరవ్యాపారము విడిచిపెట్టుము. నామాటలు పెడచెవిని బెట్టకు తండ్రీ!

ధృత—వత్సా! ఎల్లచుట్టములును జచ్చిపోయి దుఃఖించుచున్న మీయమ్మ మాటను నామాటను విను. తండ్రీ! మూడు.

ఉ. ఏరిబలాన దాయలను నెంచవొ రే రల ద్రోణభీష్మ, లా
తీరునఁ గర్ణపుత్రుని వధించినక్రిడికి జంకు లోకముల్;
వైరి వధించె నూఱుగురు వత్సల; నీవె మిగుల్ ప్రతిజ్ఞకుఁ;
బోరికఁ మాను తండ్రి! మముఁ బ్రోవుము కన్నులు లేని దీనులఁ. ౫.

దుర్యో—యుద్ధము మాని నేను జేయునది యేమి?

గాంధా—పుత్రకా! మీతండ్రిగారును విదురుఁడును జెప్పినట్లు చేయుము.

సంజ—రాజా! ఇది సత్యము.

దుర్యో—సంజయా! ఇంకను నుపదేశింపఁ దగినయంశ మున్నదా?

సంజ—రాజా! జయము గోరువారికిఁ బ్రాణమున్నంతవఱకుఁ బ్రజ్ఞావంతు లుపదేశింప వలసినదే.

దుర్యో—(క్రోధముతో) అట్లయినఁ బ్రజ్ఞావంతుల రగుమీహితోపదేశ మేమో యిప్పుడె విన్నగా విందము.

ధృత—కొడుకా! యుక్తముగాఁబలికినయీసంజయునిమీఁదఁ గోపపడియెద వేమి? నిన్ను శాంతించితివేని దానిని నేనే చెప్పెదను విను.

దుర్యో—నాయనా! సెల విమ్ము.

ధృత—వత్సా! పెక్కుమాట లేల? ఇప్పుడు యుధిష్ఠిరునకుఁ గోరిన పణంబు నిచ్చి సంధి చేసికొనుము.

దుర్యో—తండ్రీ! పుత్రులయందలిప్రేమవలనిభయమునంజేసి యంబయును, బాలిశత్వమునంజేసి సంజయుఁడును నట్లు పలికినఁ బలికిరి గాక, మీకుఁ గూడ నిది యేమి వెఱ్ఱి? కాకపోయినఁ బుత్రశోకజ్వర మెంతకుఁ జాలదు. నాయనా! నూఱుగురుతమ్ములతో నిండియున్నప్పుడు, నాఁడన్నివిధంబుల సామవాక్యములచేతఁ గృష్ణుండు నన్నుబతిమాలుకొనిన నిరాకరించి, యిప్పుడు భీష్ముండును ద్రోణుండును దమ్ములును సకలరాజచక్రంబును బేరుమాయుట చూచి, కేవల మీతుచ్ఛశరీరము మీఁదియపేక్షచేత, నుదాత్తపురుషలజ్జాకరంబును, నసుఖావహంబును నయిన పాండవులతోడిసంధికి, దుర్యోధనుఁడెట్లు లంగీకరించును? ఇంక నొకటి చెప్పెద. నయకోవిదుఁడా! సంజయా!

ఆ. వె. హీను లయినరిపులతో నెట్లు రాజులు
సంధి చేసికొందురు చక్కఁ జెపుము;

నేను భ్రాతృశతము లేనివాఁడను గద !
పాండుసుతులు కొఱఁత పడనివారు.

ధృత — వత్సా ! ఇట్టియవస్థయం దయినను నాప్రార్థనమును ధర్మరాజ న్యథాకరింపఁ డిది నిశ్చయము. ఇంకొకటి. యుధిష్ఠిరుఁడు నిన్ను హీనునిఁగా నెంచునని నీ తాత్పర్యము. అది సరి కాదు. అతఁడు సర్వదా తన్ను నీకంటెఁ దక్కువవానిఁగానే తలంచుకొనుచుండును.

దుర్యో — అది యెట్లు?

ధృత — ఇదిగో ! విను. తనతమ్ములలో నొక్కనికేని కీడు మూఁడినఁ, దాను బ్రాణములఁ బాయువాఁడుగా యుధిష్ఠిరుఁడు శపథముఁ జేసినాఁడు. అందుచేతఁ యుద్ధమునం దెల్లప్పుడు నొక్కతీరున సాగి రాదు గావునఁ దమ్ములదెస నేవేళ కేమి పుట్టునో యనుభయంబున నీ కనుకూల మయిన తెఱంగుననే యతఁడు సంధ సేయుట కిచ్చగించును.

సంజ — ఇది యథార్థము.

గాంధా — బిడ్డా ! యుక్తియుక్తముగా నున్న మీతండ్రిగారిమాట దాఁటక నడుచుకొనుము.

దుర్యో — నాయనా ! అమ్మా ! సంజయా !

చ. అనుజుఁ డొకండు చచ్చినను నాతఁడు సావఁ బ్రతిజ్ఞ పట్టె; నా
యనుజులు నూర్వురుం దెగిన, నక్కట ! ప్రాణముఁ బాయనైతి; నే
నని మొన దుస్ససేనుహృదయంబున నెత్తురు ద్రావ భీము, నా
పెనుగద నుగ్గు సేయ కటు చేలనె సంధిని జేసికొంటకుఁ?

గాంధా — హా ! దుశ్శాసనకుమార ! దుర్మర్షణ ! హా ! వికర్ణ ! అహా ! వీరశతమును గన్నగాంధారీ ! దుఃఖశతము నే గాని సుతశతమును గన లేదా ? అయ్యో ! మందభాగ్యురాల నయిన నాయిట్టియాపద లోకమునందుఁ గన్నదా ? విన్నదా ? (అందఱు రోదనము చేయుచున్నారు.)

సంజ — (కన్నీరు దుడుచుకొని) నాయనా ! అమ్మా ! మహారాజునకు దుఃఖశాంతి చేయుట కయి మీ రిక్కడకుఁ వచ్చితిరి. మీఁదు మిక్కిలి మీరు కూడ నధైర్యపడియెద రేమి ? ఊఱడిల్లుఁడు.

ధృత — కుమారా ! మనయదృష్టము ఇట్లుండెను. నీవు వైరులయెడల రోషమును విడిచి పెట్టవయితివి. నీబ్రతుకు నే యాధారము చేసికొని యిట్లు శోకించుచున్న మీయమ్మకును నాకును మఱియెవరు దిక్కు? ఎట్లు బ్రదుకుదుము ?

దుర్యో — నాయనా ! వినుండు.

ఆ. వె. విరివిసిరుల ననుభవించి, యనేకరా
జన్యమకుటదీప్తచరణు లగుచు,
సుతులు నూర్వురరుల సోలించి వ్రాలిరి;
బ్రతుకుఁ జీరు సగరుపగిదిఁ, దండ్రి ! రా

ఒంటిదేలం గయిన నాకు రాచపాడి తప్పుట సంభవించును గదా ?

(తెరలోపలఁ బెద్దకలకలము.)

గాంధా—(విని భయముతో) సంజయా ! ఏమిది ? హాహాకారములతోఁ దూర్యధ్వను లెగయుచున్నవి !

సంజ—అమ్మా ! మీవంటిభీరుజనమున కిది నిలువ వలసినచోటు గాదు.

ధృత—వత్సా ! సంజయ ! ఈహాహాకార మంత కంతకు నెక్కువయయి భయము పుట్టించుచున్నది. అది యేమో తెలిసికొనుము. దీని కేదో గొప్పకారణ ముండక పోదు.

దుర్యో—తండ్రీ ! అనుగ్రహింపుము. మనయెడల దైవము పరాఙ్ముఖు డయ్యెను గదా ! మరల నేదేని మహోపద్రవము చెవిని బడక మునుపే, నాకు యుద్ధమునకుఁ బోవ ననుజ్ఞ యిండు.

గాంధా—బిడ్డా ! మందభాగ్యురాల నయిననన్ను ముహూర్తమాత్ర మూఱడింపవోయి తండ్రీ !

ధృత—అబ్బాయీ ! నీవు యుద్ధమునందే కృతనిశ్చయుఁడ వయితివేని, శత్రువులను రహస్యముగాఁ గడతేర్చునుపాయ మాలోచింపుము.

దుర్యో— ఉ. ఏఁ గన వాదుబంధువుల నెల్ల వధించినవారిఁ, జాటుగా
బాగె వధింప ? యుద్ధమున వైరులు మెచ్చనిచంపు చంపొకో ?

గాంధా—బిడ్డా ! నీ వేకాకి వయితివి గదా ! ఎవ్వరు నీకుఁ దోడుపడు వారు ?

దుర్యో— ఈగతి సేన నీనుతుల నెక్కటి చంపనె ? వైరు లెంత ? య
వ్వా ! గను మిప్పుడే జగ మపాండవమా; నిఁకఁ దోడు దైవమే.

(తెరలోఁ గలకలానంతరమున)

ఓహో ! యోధులార ! ఇప్పుడు జరిగినమహాయుద్ధమును గౌరవేశ్వరునకు విన్నవింపుఁడు. అప్రియము వినఁ జాల కున్నఁ దప్పి పోవునా ? ఇప్పుడు కాలాను రూపముగా నేమి ప్రతివిధానము చేసికో వలసి యుండునో ?

మ. మునికోల న్విడి; యర్జునాంకపుశరంబుల్ స్వాంగముం గాఁడ, వ
చ్చినజాడన్ రథ మీడ్చుకొంచుఁ జన దేజీల్, మెల్ల శల్యుండు, లో
చనబాష్పంబులె కర్ణువార్త పల్కుచున్ స్పష్టంబుగాఁ దెల్పఁ, జొ
చ్చె నిదే శూన్యరథంబుతో శిబిరమున్, జింతిల్లఁగాఁ గౌరవుల్. ౧౦

దుర్యో—(భయముతో) సూతుఁడా! పిడుగువలె వినఁబడుచున్న యీనుడు ఎవఁడు పలికెనో తెలిసికో వలయును. ఓరీ! యెవఁడురా అక్కడ?

(తత్తఱపాటుతో సూతుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

సూతు—హా! చచ్చితిఁగద! (భూమిమీఁదఁ బడుచున్నాఁడు.)

దుర్యో—చెప్పు చెప్పు.

సూతు—దేవా! మఱి యే మున్నది?

ఆ. వె. అలమనోరథంబువలె శూన్యభావంబు
నెనయుకర్ణురథము నెక్కి వచ్చి,
శల్యరూపమునను శల్యుండు చొరఁబడి,
జనము నెల్ల మూర్ఛ మునుఁగఁ జేసె. ౧౧

దుర్యో—హా! వయస్య! కర్ణ! (మూర్ఛిల్లుచున్నాఁడు.)

గాంధా—బిడ్డా! ఊఱడిల్లు మాఱడిల్లుము.

సంజ—ఊఱడిల్లు మూఱడిల్లు మహారాజ!

ధృత—అయ్యో! ఎంతకష్ట మెంతకష్టము!

క. అలమున ద్రోణభీష్ములు
గూలుటనే ప్రాపు దక్కెఁ గురుసైన్యంబుల్;
మే లయినసఖుఁడు కర్ణుఁడు
నీలీలను నిహతుఁ డయ్యె; నిఁక నెట్లొక్కో. ౧౨

కుమారా! ఊఱడిల్లు మాఱడిల్లుము. ఓమాయదైవమా!

ఉ. కన్నులు లేవు; పుత్రశతకం బనిఁ జచ్చె; నగాధశోకవా
రాన్నిధి నింతితోడుతఁ గరంబు మునింగితి; నయ్యయో! యిఁకే
మున్నది? బందుగుల్ చెలులు నొజ్జలు నాడిగ శూన్య మైరి నీ
వున్నగడన్; సుయోధనునిపట్టునఁ గూడను నాస వీడితిన్. ౧౩

వత్సా! దుర్యోధన! దీనురా లయినమీయమ్మ నూఱడింపుము.

దుర్యో—(మూర్ఛ దెలిసి)

తే. గీ. కర్ణుఁడా! నీకు నామీఁదఁ గలుగుప్రేమ
పయికిఁ బొరలంక, నింపుగఁ బలుకవేమి?

పాయ నెన్నఁడు; నీ కెగ్గు సేయ; నైన,
మిత్రు విడిచితె వృషసేనుమీఁదిప్రేమ? ౧౪

(మరల మూర్ఛిల్లుచున్నాఁడు.)

అందఱు—(ఊఱడించుచున్నారు.)

దుర్యో—(ఊఱడిల్లి)

తే. గీ. అకట! నాప్రాణములకంటె నధికుఁ డయిన
యంగరా జెల్లు టాఁకించి, ప్రాణములను
విడువనందుకె, కడు సిగ్గుపడుచు నుంటి:
నింక నే నూఱడిల్లుట యెట్లు తండ్రి? ౧౫

మఱియు—

తే. గీ. వగవ వలసిన వగవ, నే బాలుఁడైన
దుస్ససేనునివధకు, బంధువులమృతికి;
నాకు నత్యుపకార మొనర్చినట్టి
కర్ణుకుల మెల్ల, మాపితిఁ గాన వగతు. ౧౬

గాంధా—బిడ్డా! క్షణమాత్రము కంటఁ దడి పెట్టకుము.

ధృత—కుమారా! నీ వొక్కమాఱు కన్నీరు దుడుచుకొనుము.

దుర్యో—తే. గీ. నానిమిత్తము తనదుప్రాణములు విడిచె,
నెంత లెంతలచేతను నీడఁబోక;
యట్టికర్ణునికొఱకు, నే నవద నగుచు
నశ్రుజలమును విడువ, న న్నాఁగఁ దగునె? ౧౭

సూతుఁడా! నే నెన్నఁడుఁ దలఁచుకొనిదియు, నాకులమున కంతక మయినదియు నగునీఘోరకర్మ మెవఁడు చేసెనో?

సూతు—దేవా! జను లీలాగునఁ జెప్పుకొనుచున్నారు.

"ఆ. వె. తేరికల్లొకింత ధారుణిఁ గ్రుంగ, రా
ధేయుఁ డెత్తికొనెడి తెఱపిలోన,
మనబలంబు రూపు మాపినయర్జును
నలుఁగు లతనియాసువు లపహరించె. ౧౮

దుర్యో—క. అలకర్ణుమోముచందురుఁ
దలఁచిన, శోకాబ్ధి పొంగుఁ; దక్షిణ మది, నా
యలుక యనుతీవ్రబడబా
నలశిఖలను మరల శోషణంబును జెందున్. ౧౯

తండ్రీ! అమ్మా! మీ రూఁబడిల్లుఁడు.

ఆ. వె. శోకమునను బుట్టి, చుఱచుఱ నిపుడు నా
యుల్ల మేర్చుమంట నోర్వఁ జాల;
సమవిపత్తులందు శంక మీ కేల? నా
కాలమునకుఁ బోవ నాన తిండు. ౨౦

ధృత—(దుర్యోధనునిఁ గౌఁగిలించుకొని)

ఆ. వె. సాహసంబులందు శంక నాకు నిజంబె;
తల్లడిల్లు గుండె తలఁప భీము;
మానకొండ! నీకు మాయ గిట్టదు; కూట
సమర మరుల; దెట్లు చత్తు నేను? ౨౧

గాంధా—బిడ్డా! నూఱుగురుబిడ్డల మంటఁ గలిపినయాభీమునితో నే మరల నిప్పుడు యుద్ధము సేయఁ జూచుచున్నావా!

దుర్యో—అమ్మా! భీమునిమాట య టుండనీ,

ఆ. వె. నాకునోరథంబు, నా మేనిగందంపుఁ
జర్చ, నాదుకనులచందమామఁ,
దల్లి! నీకుమారుఁ, దండ్రి! నినయశిష్యుఁ
గర్ణుఁ జంపినట్టిఖలు వధింతు. ౨౨

సూతుఁడా! ఇంక నిప్పు డాలస్య మెందుకు? నారథమును సన్నద్ధముచేసి తీసికొని రా. నీవును బాండవులకు భయపడితివేని నిలిచి పో. గదామాత్రసహాయుఁడ నయి, నే నొక్కఁడన యుద్ధమునకుఁ బోయెదను.

సూతు—దేవ! నీ వన్యథా తలంపకుము. ఇదిగో! నేను వచ్చుచున్నాను.
(నిష్క్రమించుచున్నాఁడు.)

ధృత—నాయనా! దుర్యోధన! మమ్ము మండఁ బెట్టుటకే నీవు నిశ్చయించుకొంటివేని, యున్నపాటివీరులలో సేనానిఁగా నెవ్వని నయిన నభిషేకింపుము.

దుర్యో—అభిషిక్తుఁ డయి యున్నాఁడే.

గాంధా—బిడ్డా! హతాశురాలిని నన్ను మరల సావలంబననుగాఁ జేయఁ గలిగినయతఁ డెవ్వఁడో చెప్పుము.

ధృత—అబ్బాయీ! శల్యుఁడో? అశ్వత్థామయో?

సంజ—క. కూలఁగ భీష్ముఁడు, ద్రోణుఁడు
కాలము సేయంగఁ, గెడయఁ గర్ణుండును, భూ
పాలా! బలపతి యాశ. యిఁ
కాలములో శల్యుఁ డోర్చు నప్పాండవులన్. ౨౩

దుర్యో—నాయనా! శల్యుఁ డెందుకు? అశ్వత్థామ యెందుకు?

ఆ. వె. కర్ణుఁ గౌఁగిలింపఁ గలిగితినో, పార్థు
జీవములు హరింపఁ జేసితినో;
కాల్వ లగుచుఁ దొరఁగుకన్నీటిచే నభి
షేచనంబు నాకె చేసికొంటి. ౨౪

(తెరలోఁ గలకలధ్వని చేసి) ఓహో! కౌరవబలప్రధానయోధులార! మమ్ముఁ జూచి భయపడి యట్టిటు పాఱిపోయెద రేమి? దుర్యోధనుఁ డెక్కడ నున్నాఁడో చెప్పుఁడు. (అందఱు నదరిపడి యాలకించు చుండఁగా సూతుఁడు తత్తఱపాటుతోఁ బ్రవేశించుచున్నాఁడు.)

సూతు—దేవా!

తే. గీ. ఇరువు రొక్కరథం బెక్కి, యిందు నందు
నిన్ను నడుగుచు వచ్చుచు నున్నవారు;

అందఱు ఎవ రెవరు?

సూతు—కర్ణప్రాణంబుఁ బాపినఘాతుకుండు,
సుగ్రీవకర్ముఁ డయిన వృకోదరుండు. ౨౫

గాంధా—(భయముతో) బిడ్డా! ఇందుకుఁ జేయునది యేమి?

దుర్యో—అమ్మా! ఇదిగో! గద నాదగ్గఱనే యున్నదిగద!

గాంధా—హా! అదృష్టహీనురాలను నేను జచ్చితినిరా బిడ్డా!

దుర్యో—అమ్మా! నీ విప్పుడు దైన్యపడకు. సంజయ! సంజయ! నాదుఃఖమును బోఁగొట్టు చెలికాండ్రు వచ్చినారు. ఈతల్లిదండ్రులను రథ మెక్కించుకొని పోయి, శిబిరమునఁ బ్రవేశపెట్టుము.

ధృత—నాయనా! మీభావ మేమో తెలిసికొనియెద; క్షణమాత్రము నిలువ నిమ్ము.

దుర్యో—ఈ తెలిసికొనుట కేమి? తండ్రీ! పొండి.

ధృత & గాంధా—(కొంచెము నడచి కూరుచున్నారు.)

[తరువాత రథారూఢు లయినభీమార్జునులు ప్రవేశించుచున్నారు.]

భీము—ఓదుర్యోధనపరిజనులారా! మీరు తొట్రుపాటుతో వెలవెలఁ బోవుచుఁ దిరిగెద రేల? మావలన వెఱవకుఁడు.

సీ. కపటంపుజూదంబు కల్పించినశకుండు, లక్కయి ల్గాల్చినమొక్కలీఁడు,
పాంచాలికొప్పును బైఁట దూల్చినగాలి, యట్టిట్టు గాని మహాభిమాని,
బానిసీలఁగఁ బాండుసూనులఁ గొనుపాపి, దుశ్శాసనప్రభృతులకు రాజు,
కులువ కౌనూర్గురు తోఁబుట్టువులయన్న, యంగరాజునకును బ్రాణసఖుఁడు,

నగుమహారాజుగారు మీయధిపు లిప్పు
డెందుఁ గొలు వున్నవారో మా కెఱుఁగఁ జెపుఁడ;
మేము పగచేత రా లేదు; మిన్న కతని
వదనమును జూచి పోవంగ వచ్చినాము.

ధృత—సంజయా! ఈక్రూరుని యొత్తి పొడుపు మహాదారుణము గానున్నదిగదా!

సంజ—తండ్రీ! వా రీవఱకే పనిచేత మిగులు లేకుండఁ దమయప్రియ మంతయుఁ దీర్చుకొన్నారు. ఇప్పుడు మాటలచేత మనకు మఱలఁ జేయుచున్నారు.

దుర్యో—సూతుఁడా! నే నీయిగ్దఱయొద్దఁ గూరుచున్నా నని చెప్పు.

సూతు—చిత్తము (పోయి) ఓభీమార్జునులారా! మహారా జిదిగో నాయన గారితోడను నమ్మగారితోడను, నీమఱ్ఱిచెట్టునీడను గూరుచున్నాఁడు.

అరు—అన్నయ్యా! పుత్రశోకపీడితు లయినతల్లిదండ్రులను మనదర్శనముచేత మఱింత యడలఁ బెట్టుట బాగుండదు. పోవుద మనుగ్రహింపుము.

భీము—మూఢుఁడా! సదాచారము దాఁటఁ గూడునా? తల్లిదండ్రులు వంద నీయు లన్నమాట నీచెవి నెప్పుడుఁ బడ లేదా యేమి? (దగ్గఱఁబోయి) సంజయా. మా తాపితలకు మానమస్కారము దెలుపుము. కాదుండు. మేమే తెలిపెదము! (తేరు దిగినారు.)

భీము—తమ్ముఁడా! నామకర్మములను దెలుపుకొనుచు గురులకు నమస్కరింప వలయును జుమీ!

అర్జు—(దగ్గఱఁబోయి) నాయనా! అమ్మా!

చ. అరులను నందఱం గెలుచు నంచును మీనుతు లేని నమ్మిరో,
గరువముచేత నెవ్వఁడు జగం బఖిలంబు తృణీకరించెనో,
దురమున నట్టికర్ణుపసఁ దూల్చినపాండవమధ్యముండుఁ, మీ
యిరువురు తల్లిదండ్రుల కిదే ప్రణమిల్లెడు భక్తితోడుతన్. —౨౭

భీము—తే గీ. కురుకుమారుల నెల్ల నుగ్గుగ నొనర్చి,
దుస్ససేనునిరొమ్ము నెత్తుటను బలిసి,
యిఁక నుయోధనుతొడలు ఛేదింప నున్న
భీముఁ డిదె మ్రొక్కుచున్నాఁడు పితల కిపుడు. —౨౮

ధృత—దురాత్మా! వృకోదరా! శత్రువుల కపకారముఁ జేసినవాఁడవు నీవు మాత్రమే కావురా. క్షత్రకులంబు పుట్టిన దాదిగా వీరులు సమరమున జయాపజయం బులఁ బొందుచునే యున్నారు. ఎందు కీ్రపతాపోక్తులచేత మమ్మడలఁ బెట్టెదవు?

భీము—తండ్రీ! కోపపడకు.

ఉ. పాండవపత్నిఁ గృష్ణను భవత్సభ కీడిచి తెచ్చి, యామెయు
ద్దండరుషాగ్ని మ్రగ్గ మిడుతల్ బలె రాడ్గణ మంటి గాని, నా
దండితనంబు మెప్పవకు దర్పముచేతను జెప్పఁ; దండ్రి! నీ
వుండఁగ పుత్రపౌత్రులు మహోద్ధతిఁ జేసెడి వెల్లఁ జూచుచున్. ౩౧

దుర్యో — ఓరోరి మరుత్తనయా! ఏమిరా యిది? నింద్యమయిననీకర్మమును వృద్ధ రాజునొద్దఁ బొగడుకొనుచున్నావు?

మహాస్రగ్ధర. పసరంబుల్ నీకు, నీ, కప్పతికిఁ, గవలకున్, భార్య యాద్యూతదాసిన్,
బొసఁగన్ రారాజ నా నాముదల, గొని సభన్ ముందలం బట్టినా; రీ
యసదృగ్వైరంబునం దాహతు లగునృపు లేయప్రియుల్ చెప్ప రా; నీ
ఉసఁ జూతున్, భూరిబాహాబలధనమదదుర్వారు, నన్ గెల్వ మాజిన్.

ఆ! దురాత్మ! ఇదిగో నీవు లేవురా. (క్రోధమునఁ జంపఁ బోవుచున్నాఁడు.)

ధృత — (పట్టుకొని కూరుచుండఁ బెట్టుచున్నాఁడు.)

భీము — (క్రోధము నభినయించుచున్నాఁడు.)

అర్జు — అన్నయ్యా! ఇప్పుడు క్రోధమున కేమి కారణము?

తే. గీ. శౌర్యముల నప్రియం బేమి సేయ లేక,
వీఁడు మాటలఁ జేయుచున్నాఁడు సుమ్మి;
యైనతమ్ములు నూర్గురు నడవిఁ గలిసి,
దుఃఖమునఁ జేరుకొనుపీనితోడి దేమి?

భీము — ఓరోరి భరతకులకలంక!

తే. గీ. ఇప్పుడే పట్టి వధియించి, యేను దుస్స
సేనునొద్దకు నినుఁ బంప లేనె, తులువ!
మద్గదాకోటినిర్భిద్యమానయుష్మ
దస్థిశబ్దంబు విని గురు లడలరేని? ౩౨

మఱియు నోరిమూఢా!

ఉ. ఆఁడుది పోలె నీవు నెగు లశ్రుజలంబులఁ దీర్చుకొంట, సై
దోడునురంబు వ్రచ్చుతఱి, దూరముగా నిలుచుండి చూచుటన్,
వాడునృపుండ వీ వనుచు పాయవు, మీకుల మన్నతమ్ములేఁ
దూఁడుల కేనుఁ గైనపటుదోర్బలభీముఁడు భీముఁ డల్గినన్. 33

దుర్యో — దురాత్మా! భరతకులాధమ! ద్యూతదాస! పాండవపశువా! నీవలె నేను వ్యర్థప్రలాపములను వచియింపఁ జాలనురా. మఱేమన్న —

తే. గీ. నాగదాదండమునను భిన్నంబు లైన
ఱొమ్మునెమ్ములు వెలిభూషణమ్ము లగను,
యుద్ధమునఁ బెద్దనిద్దుర నొందునన్ను
నిపుడె నీసోదరులు చూచి యేడ్వఁ గలరు. ౩౮

భీము — (నవ్వి) అటు లయిన నీవిషయమున మే మశ్రద్ధతో నుండ రాదు. ఇదిగో! విను నాప్రతిజ్ఞ.

మహాస్రగ్ధర. బెడిదం బౌ కేలుదోయిన్ బిఱబిఱను గదం బిట్టుగాఁ ద్రిప్పి, యూరుల్
పొడిగా నిన్మోది, పాదంబును దల నిడుచుం బ్రొద్దుటం, జూడ నేఁడుల్;
కడిమిం ద్వన్ముఖ్యులం జక్కడఁచి గలదసృక్చందనం బానఖాగ్రం
బొడల న్నేఁ బూసికొం చభ్యుదయభయదభూషోజ్జ్వలన్మూర్తి నౌదున్.

(తెరలో) ఓహో! భీమార్జునులారా! ఇదిగో! నిహతాశేషవిపక్షచక్రుండును నాక్రాంతపరశురామాభిరామయశోవిశాలుండును, ప్రతాపసంతాపితదిఙ్మండలస్థాపితస్వజనుండును, నజాతశత్రుండును నగు దేవర యుధిష్ఠిరమహారాజుగా రిట్టు లాజ్ఞాపించుచున్నారు.

ఇద్దఱు — మహారాజుగారే మని యాజ్ఞాపించుచున్నారు?

(మరలఁ దెరలో)

చ. అనిఁ దెగువారియంగముల కాపు లొసంగుఁడి యగ్నిసంస్కృతుల్;
కనుఁగవనీళ్ళతోడ నుదకంబును బంధుల కిండు బాంధవుల్;
కనుఁడి హతప్రజాటవిని జ్ఞాతులకంకె విఖండితాంగముల్;
గొనకొని, పొద్దుతో రిపులుఁ గ్రుంకిరి; సైన్యములన్ మరల్పుఁడీ. ౩౯

ఇద్దఱు — మహారాజానాజ్ఞ నెఱవేఱుఁ గాక. (నిష్క్రమించుచున్నారు.)

(తెరలో) ఓరోరి గాండీవాకర్షణబాహుశాలీ! అర్జునా! అర్జునా! ఇప్పు డెటఁ బోయెదవురా.

కపిరాజవిరాజితము. విడిచితి నీవఱకు న్నిముఁ గెల్చెదువి ల్లిది, కర్ణుని పైపగచే;
నడవిని బోలె విశూరరణంబునఁ బ్రౌఢపరాక్రమ మయ్యెను మీ;
కడిదను వీడినమద్గురుమూర్ధము నంటుట నెంచుచు వచ్చితి; ని
ప్పుడు ద్రుపదాన్వయఘస్మరుఁ డౌగురుపుత్రుఁడు ద్రుంపఁడె పాండవులన్?

ధృత — (విని సంతోషముతో) అబ్బాయీ! దుర్యోధన! ద్రోణవధపరిభవోద్దీపితక్రోధానలుండును, దండిప్రకం బైన బరాక్రమవంతుండును, శిక్షావంతుండును, సమరసమానుండును నగు నశ్వత్థామ యిదిగో! వచ్చుచున్నాఁడు; నీ వీవీరున కెదురు వోయి సంభావింపుము.

గాంధా—కుమారా! ఈమహాభాగున కెదురు పొమ్ము.

దుర్యో—నాయనా! అమ్మా! కర్ణునిచావు గోరినయావృథాయశావన శస్త్ర బలభరునితో నేమి ప్రయోజనము?

ధృత—కొడుకా! ఈసమయములో నిటువంటిపరాక్రమవంతులకు వెగటుగా మాటలాడఁ గూడదు.

(అశ్వత్థామ ప్రవేశించుచున్నాఁడు.)

అశ్వ—జయతుజయతు కౌరవేశ్వరః.

దుర్యో—(లేచి) గురుపుత్త్ర! ఇటు కూరుచుండుము. (కూరుచుండఁ బెట్టుకొనుచున్నాఁడు.)

అశ్వ—రాజా! కౌరవేశ్వర!

తే. గీ. కర్ణముల కింపుగాఁ బల్కి, కర్ణుఁ డాజి
యందుఁ జేసినపని, తెల్ల మయ్యెఁ గాదె?
ద్రౌణి యిప్పు డధిజ్యశరాసుఁ డగుచు
వచ్చె; నీవైరులను దాఁకు? వగప కింక. ౩౮

దుర్యో—(అసూయతో) ఆచార్యపుత్త్ర!

ఆ. వె. అంగరాజు చచ్చినంతట గద, నీవు
యుద్ధ మొనరఁ జేయ నుండినావు;
నేను జచ్చువఱకు నీవు ప్రతీక్షింపు;
కర్ణునకును నాకుఁ గలదె వేఱు? ౩౯

అశ్వ—ఏమి? ఇప్పటికిని గర్ణునియందుఁ బక్షపాతమును, మాయెడలఁ దిరస్కారమునా? రాజా! కౌరవేశ్వరా! తథాస్తు. (నిష్క్రమించెను.)

ధృత—కుఱ్ఱా! నీ కిది యేమి వెఱ్ఱి? ఈసమయములో నంతమహాభాగుఁ డయినయశ్వత్థామకు, నీవు పుల్లవిఱుపుమాటలచేత మనసు విఱుగఁ జేసితివి.

దుర్యో—ఇతని కేమి యప్రియము? నే నసత్యము పలికినాఁడనా? ఇది నాకుఁ గ్రోధస్థానము గా దేమి? చూడు,

చ. ధనువులు పూను రాజులకుఁ దల్ప నశక్యపుఁ బేర్మివాని, నీ
కొనరినభాగ్యదోషమున యుద్ధమునం దెగినట్టివాని, నిం
దన మొనరించె, నాయెదుర, నాప్రియమిత్త్రుని, నంగరాజు; న
ర్జునునకు ద్రోణపుత్త్రునకుఁ, జూడ విశేష మదేమొ చెప్పుమా. ౪౦

ధృత—నాయనా! నిన్ననవలసిన దేమి? భరతకులమున కిది యవసాన సమయము. గాంధారీ! మందభాగ్యుఁడను నే నిప్పు డేమి చేయుదును? (ఆలోచించి) కానీ. సంజయా! భారద్వాజుఁడయినయశ్వత్థామతో నాపలుకులుగా నిట్లు పలుకుము.

చ. తడవుగ వీనిలోఁ గుడుచు స్తన్యము నేమఱినాఁడవయ్య? నీ
వొడలను బ్రాఁక, నావలువయూఁత బుర దయ్యెను నీదుబాల్యమం
దుడుగనిభ్రాతృదుఃఖముననో, చిరమైత్రినొ, వ్యత్యయంబుగా
నుడివినవీనినో, గురుతనూభవ! పెంపకుమయ్య క్రోధముఁ. ౮౧

సంజ—చిత్తము. (లేచుచున్నాఁడు.)

ధృత—మఱియు నిట్లని కూడ వచియింపుము.

చ. అనృతము వించు నీజనకుఁ డట్టులు శస్త్రము నుజ్జగించుటఁ,
గనుఁగొన నంతవానికిని గల్గినతాదృశ మానవజ్ఞ యుఁ,
దనయుఁడ వైననీదుబలదర్పములుం, దలపోసితే, సుయో
ధనుపలు కెంతవా? ప్రతివిధానము సేయుదు గాక ద్రోణజా! ౮౨

సంజ—చిత్తము. (నిష్క్రమించుచున్నాఁడు.)

దుర్యో—సూతుఁడా! మాయుద్ధరథమును సన్నద్ధము సేయుము.

సూతు—చిత్తము దేవా! (నిష్క్రమించుచున్నాఁడు.)

ధృత—గాంధారీ! మన మీలాగున మద్రాధిపతి యయినశల్యునివిడిదికిం బోవుదము. అబ్బాయీ! నీవు నిట్లు చేయుము. (చెవిలో) ఈలా గీలాగు (అందఱు నిష్క్రమించుచున్నారు.)

గద్య. ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదలబ్ధసరసకవితాధురంధర వడ్డాది సాధువంశక్షీర
నీరాకరరాకాసుధాకరాచ్చనామాత్యపౌత్ర హారితసగోత్ర పవిత్రగుణకదంబ
లక్ష్మాంబాగర్భశుక్తిముక్తాఫల సూరపరాజప్రధానతనూభవ విబుధ
విధేయ సుబ్బరాయ నామధేయాంధ్రీకృత వేణీసంహార
నాటకంబునందుఁ బంచమాంకము.

శ్రీ ర స్తు.

శ్రీపరమాత్మనేనమః

వేణీసంహారనాటకము.

షష్ఠాంకము.

—:o:—

[తరువాత నాసనస్థుఁడయి ధర్మరాజును, ద్రౌపదియుఁ, జేటియుఁ, బురుషుఁడును బ్రవేశించుచున్నారు.]

యుధిష్ఠిరుఁడు—(విచారముతో నిట్టూర్పు విడిచి)

ఉ. ఎట్టెటొ భీష్మసాగరము నీదియు, ద్రోణమహాగ్నియార్చియుఁ,
గట్టిఁడికర్ణపన్నగము గాసిలఁ జేసియు, శల్యుఁ గూల్చియుఁ,
గట్ట! యొకింత తక్కువగఁ గాంచుజయంబున, మాకు నెల్లని
ప్పట్టున, భీమసాహసపుఁబల్కున జీవితశంక పుట్టెఁగా! ౧

ద్రౌపది—(కన్నీళ్ళతో) మహారాజా! పాంచాలిచేత నని యెందు కనరు?

యుధి—ద్రౌపదీ! నాచేతనే సుమీ! (పురుషునిఁ జూచి) బుధక!

పురు—దేవా! ఆజ్ఞాపింపుఁడు.

యుధి—నీవు పోయి సహదేవునితో నిట్లు చెప్పుము. భీమసేనుండు క్రోధావేశంబున "నే నీదినంబునఁ దప్పక సుయోధనుని వధించెదను; లేకున్న నేను జచ్చెద" నని చేసినదారుణప్రతిజ్ఞను దెలిసికొని, మహాభిమాని యయిన దుర్యోధనుఁడు మాయ మయ్యెను. కావున వానిజాడ నెఱింగి వచ్చుటకు, మిక్కిలి నిపుణ మయినబుద్ధి గలిగినట్టియు, నయ్యయికందువల నెఱింగినట్టియు, భక్తివిశ్వాసములు గలిగినట్టియు సచివులు, తప్పటలతోడఁ జాటించుచు, శమంతపంచకమునఁ జరింప వలయును; దుర్యోధనుజాడఁ దెలిసి వచ్చినవారికి, ధనము మొదలుగాఁ గలపసదనంబు లీయఁబడు నని, స్పష్టముగాఁ దెలుప వలయును.

మఱియు—

సీ. నీళ్ళజాడలు దీయ నేర్పుజాలరు లూబినేలలం దినుకల నెమక వలయు;
నల్లిబిల్లిగఁ దీఁగ లల్లుడొంకల లెఱుంగుగొల్లలు పొదలఁ గన్గొనఁగ వలయు;
నిజపరశరణాంకనిపుణు లొసెఱుకలు వ్యాఘ్రాటవులయందు నరయవలయు;
రంధ్రజ్ఞులైనమేల్ప్రణిధులు జడదారివేసాల మునులొద్ద వెదుక వలయు;

పురు—దేవా! చిత్రము.

యుధి—మఱియు నిట్లని కూడఁ జెప్పుము.

తే. గీ. అలుకుచు రహస్యమున మాట లాడువారి,
నుప్పులను, రోగులను గూడఁ, జూడ వలయుఁ;
బులుఁగులరయింగు, మృగములకలఁత, రాచ
గుఱుతునడుగులు, నడవిలో నెఱుఁగ వలయు. ౨

పురు—చిత్తము దేవా! (నిష్క్రమించి మరల వచ్చి సంతోషముతో) దేవా! పాంచాలకుఁడు వచ్చినాఁడు.

యుధి—శీఘ్రముగాఁ దీసికొని రా.

పురు—(నిష్క్రమించి పాంచాలకునితో మరల వచ్చి) ఇదిగో! రాజుగారు; సన్నిధికిం బొమ్ము.

పాంచా—(సమీపించి) దేవా! జయముజయము. దేవరకును దేవేరికినిఁ బ్రియముఁ దెలుప వచ్చితిని.

యుధి—భద్ర! పాంచాలక! దురాత్ముఁ డయినయాకౌరవాధమునిజాడ యే మయినఁ దెలిసినదా యేమి?

పాంచా—దేవా! జాడ మాత్రమే గాదు; దేవీకేశాంబరాకర్షణమహాపాతకహేతుభూతుం డగునాదురాత్ముఁడే తెలిసికోఁబడెను.

యుధి—(సంతోషముతోఁ బాంచాలకునిఁ గౌఁగిలించుకొని) భద్ర! మేలు మేలు! ప్రియ మెఱింగించితివి. మఱి కంటికి కగపడినాఁడా?

పాంచా—దేవా! యుద్ధమున కగపడినాఁడా యనుండు.

ద్రౌప—(భయముతో) ఏమి నానాథుఁడు సమరగోచరుఁడై యున్నాఁడా?

యుధి—(సంశయముతో) నిజముగా మాతమ్ముఁడు యుద్ధములోనే యున్నాఁడా?

పాంచా—మహారాజుగారితో నేను మఱియొకలాగు మనవి చేసికొందునా?

యుధి—తే. గీ. కారణము లేకయే మది కలఁతపడుచు,
నూరక వివేకహీనత నొందు చుండె;
గదను ధరియించుభీముని క్రమ మెఱిఁగియుఁ,
సందియముఁ బొందుచున్నాను జయమునందు. 3

(ద్రౌపదివంకఁ జూచి యామెమోమునుండి కన్నీళ్ళు దుడిచివేయుచు) ఓసుక్షత్రియురాలా!

చ. గురువులు బంధువుల్ నృపతికోట్లు గనన్, మన కైననాఁటిదు
ష్పరిభవ ముత్తరింప నిరుపద్రవ మున్నవి; యెవ్వి యన్న, సుం
దరి! మన మైన వందఱముఁ, దప్పక ప్రాణము పాయఁగా వలెన్;
గురుకులపాంసనుం డయిన, గొబ్బునఁ జావ వలెన్ రణంబునన్. ౪

అయినను సందేహ మెందుకు?

తే. గీ. ప్రతినచేడు నేమొ యని, భయపడుచు నున్న
యమ్మహావీరుచే నిశ్చయముగఁ జచ్చు,
నిందుఁగొలువున నీతలవెండ్రుకలను
బట్టి, ని న్నీడిపించినపాపపశువు. ౫

పాంచాలకా! చెప్పుచెప్పు. ఆదురాత్ముఁ డెట్లు లగపడెను? ఇప్పు డెక్కడ నేమి జరుగుచున్నది?

పాంచా—దేవా! దేవీ! చిత్తగింపుఁడు. దేవరవారిచేత నట్లు మహోగ్రుం డయినశల్యుండు దెగుటయు, శకునిశలభంబు సహదేవానలంబునం బడి మ్రగ్గుటయుఁ, దక్కినకొలఁదిపాటిజోదులు, తమదళవాయిచావును జనములయాక్రందనమును జూచి, రణరంగమునకుఁ దొలంగిపోవుటయు, మనసైన్యంబులు శత్రుపరాజయంబు గాంచి పొంగుచు, విచిత్రపరాక్రమంబున ధృష్టద్యుమ్నాధిష్ఠితంబు లయి యుండుటయుఁ, గృపకృతవర్మాశ్వత్థామలు విచ్చుమొగ్గవుటయు నాలోకించి, దురాత్ముఁ డక్కౌరవాధముఁడు బెంగగొని, భీమసేనునిదారుణప్రతిజ్ఞకు నడలి యెక్కడనో యడఁగి పోయెను.

యుధి—ఛీ! యేమి పని చేసెను? తరువాతఁదరువాత?

ద్రౌప—ముందుసంగతి చెప్పు.

పాంచా—దేవా! దేవీ! అవధరింపుఁడు. తరువాత భీమార్జును లిద్దఱును, వాసుదేవాధిష్ఠితం బయినరథం బెక్కి, శమంతపంచక మంతటను వెదకిరి; గాని వానిజాడ కొంచె మయినను దెలియ రాదయ్యెను. పిమ్మట మాకొఁటిభృత్యులు దైవమును దలంచి శోకించు చుండిరి. అర్జునుం డున్ను రని వేఁడినిట్టూర్పులు పుచ్చుచుండె. వర్షకాలమున నంధకారబంధుర మగురాత్రివేళఁ, దళతళ మనియెడు మెఱుంగులతెఱంగున వెలింగెడుపింగళేక్షణంబుల, భీమసేనుండు నిజగదాదండంబును బ్రజ్వలింపం జేయుచుండె. భగవంతుఁ డయినకృష్ణుండు విధిచెయ్వుల దూఱుచుండె. అట్టిసమయంబున నొకానొకపురుషుండు, తనచేత మాంసభారమును బట్టుకొని, క్రొత్తగాఁ జంపిన మృగమునెత్తుటం జొత్తిల్లినకాళ్ళతోడను, గట్టుఁబట్టతోడను, బరుగుపరుగున వగర్చు

కొనుచు భీమసేనునిసన్నిధికి వచ్చి, నిట్టూర్పులసందడిని సగముసగము వినఁబడియెడు నక్షరములచేత నూహింపఁ దగిన మాటలతో, నిట్లు విన్నవించెను. దేవా! ఈచేరువ నొకమహాహ్రదంబుతీరంబున మడుఁగులో దిగినయడుగులజాడలు రెండు గనంబడుచున్నవి. అం దొకటి నీళ్లనుండి వెడలి వచ్చినట్లున్నది. రెండవది యట్లు గాదు. మీఁద దేవరచిత్తము. అనుటయు మే మందఱముఁ దొందరగా బయలుదేఱి యామడువుఁ జూపుటకు నప్పురుషుని ముం దుంచుకొని పోయితిమి. అనంతర మారెండుపదపద్ధతి దుర్యోధనుని దగుట నిరూపించి భగవంతుండు కృష్ణుం డిట్లనియె. ఓవృకోదర! దుర్యోధనుఁడు జలస్తంభవిద్య నెఱుంగును గదా. దానంజేసి నిశ్చయముగా నీకు జడిసి, వాఁ డీమడువున దాఁగి యున్నవాఁడు. అనిన నబ్బలానుజునిమాట విని యుబ్బి, దిక్కు లెల్లం బూరటిల్ల మొసళ్లు మొద లయినజలజంతువులు తల్లడిల్ల, మడువంతయుఁ గలఁగి పోవ, భీమసేనుండు భీకరంబుగాఁ బెద్దబొబ్బపెట్టి యిట్లనియె. ఓరోరివృథాప్రఖ్యాపితాలీకపౌరుషాభిమానీ! పాంచాలరాజతనయాకేశాంబరాకర్షణమహాపాతకీ! ధార్తరాష్ట్రపసదా!

చ. పొడమితి విందువంశమునఁ; బూనితి విప్పటికి న్మహాగదన్;
విడువక దుస్ససేనునివెచ్చనినెత్తురు ద్రావుశత్రు నన్
గడునిరసించి; తట్లు మధుకైటభవైరిని ధిక్కరించి; తి
ప్పుడు పసరంబ! పంకమున మున్గి యడంగితి నాకు జంకుచున్. ౬

మఱియు నోరిమానధనా! కౌరవాధమా!

ఉ. కౌరవనిష్కుటంబు లొగిఁ గాంతులు చచ్చి, విముక్తకేశవి
స్తారము లౌట, నాకతన ద్రౌపదిక్రోధమహానలంబు చ
ల్లాఱెను; దుస్ససేనుహృదయంబున నెత్తురు ద్రావఁ జూచి, యీ
మారుతి నేమి చేసి? ఇది మానము చంపుకొనంగ వేళయే? ౭

ద్రౌప — నాథా! నీవు మరల వచ్చి నాకంటఁ బడితివేని నాకోపము తీఱినట్టే.

యుధి — ద్రౌపదీ! యీసమయమున నమంగళములను నోట రానీయఁగూడదు. భద్ర! తరువాతఁదరువాత?

పాంచా — దేవా! తరువాత నివ్విధంబునం బలుకుచు, వృకోదరుండు వీర్యక్రోధోద్ధతుం డయి, భీషణగదాదండంబును బిఱబిఱం దిప్పుచు, నువ్వెత్తుగ లోన నుఱికి, యుల్లంఘితతీరంబు, నుత్సన్ననలినంబు, నున్మూర్ఛితగ్రాహంబును, నుద్భ్రాంతసమస్తశకుంతంబును నయి యమ్మహాహ్రదం బంతట నుడిగుండములు పడునట్లు భయంకరముగా నీ రంతయుఁ గలిపి వేసెను.

యుధి—భద్రి! అట్లయినను వెలువడ లేదుగదా?

పాంచా—దేవా! యెట్లు వెలువడ కుండును?

చ. వెలుచ భుజంబులం జఱచి, భీముఁడు పెన్మడువుం గలంచినన్,

బలుఁదటికొండకవ్వమునఁ బాల్కడలి న్మను కాలకూటముం

బలె, నొకమూలనుండి కురుపాంసనుఁ డుత్కటకోపపావక

జ్వలతమవిస్ఫులింగముల సత్వరుఁడై వెడలెన్ హ్రదంబునన్. ౧౮

యుధి—సుకృతిరియా! మేలు మేలు!

ద్రౌప—యుద్ధమునకు వచ్చినాఁడా లేదా?

పాంచా—అట్లు లాజలాశయంబునుండి వయికి లేచి, యిరుగరంబులఁ బెనుగదను బిఱబిఱం ద్రిప్పుచు, దుర్యోధనుం డిట్లనియె. వృకోదరా! నీభయంబున నేను డాఁగితి నని సమర్థిచుకొనుచున్నావా? మూఢుఁడా! పాండుపుత్రులను జంపకుండఁ బరులకంటం బడుటకు సిగ్గుపడుచు, బడలిక దీర్చుకొనుటకై పాతాళమునకుఁ బోయి యుంటిని. అను చుండునంతలోఁ, గృష్ణార్జును లిద్దఱునుం బోయి, నీళ్లలో గదాయుద్ధము సేయఁగూడ దని, భీమదుర్యోధనుల నొడ్డునకుఁ దీసికొని వచ్చిరి.

అప్పుడు కౌరవనాథుండు గూరుచుండి, తనచేతిగదను క్రిందఁ బెట్టి, వచ్చి పోయిననూఱుగురుతమ్ములయు, వాజివారణవీరభటులయుఁ, గళేబరంబులను, గాకులను గ్రద్దలును రాపులుఁగులును నక్కలును కుక్కలును బీఁకికొనితినుచుండుటచేత భీభత్సం బైనదియు, దుర్యోధనబలంబు పేరు మాసినదయు, మనవీరులసింహనాదమ్ములకతమ్మున నిమ్మడిగా మొరసెడురణతూర్యములచేత సంకుల మయినదియుఁ, దనచుట్టములందొకడైన లేనిదియుఁ బగవారిబంధువులతో నిండియున్నదియు, నగుకౌరవయుద్ధరంగంబును దేఱి పాఱఁ జూచి యారారా జున్నరని వేఁడినిట్టూర్పులు పుచ్చుచుండె.

యుధి—తరువాతఁ దరువాత?

పాంచా—దేవా! అయ్యవసరంబున వృకోదరుం డిట్లనియె. ఓయికౌరవ రాజా! బంధుజనమునుగూర్చి దైన్యపడుటచే నేమి ప్రయోజనము? పాండవులు సమర్థులు, నే నసహాయుఁడ నని విషాదంబు నొందకుము.

తే. గీ. నీవు యుద్ధంబు సేయ, మాయేవ్వరందు

నిచ్చ వచ్చినవానిని నేలుకొనుము;

కవచము ధరించి, వలయుకైదువులు గొంచు,

సలుపు మాతనితో రణోత్సవము నేఁడు. ౧౯

అనుపలుకు లాలించి యాకురురాజు, కొంచెము గన్నీటితోఁ గూడుకొనిన చూపును భీమార్జునులమీఁద నిలిపి యిట్లనియె.

ఆ. వె. కర్ణు, దుస్ససేనుఁ, గడతేర్చినట్టిమీ
యిరువురును, సమాను లిపుడు నాకు;
నప్రియుండ వయిన, నతిసాహసుండ వౌ
నీవ, ప్రియతముండ వెంచ ననికి. ౧౦

అని లేచి పరస్పరక్రోధాక్షేపపరుషవాక్యలహప్రసారితఘోరసంగ్రాములై భీమదుర్యోధనులు, నిజభుజాదండంబుల విచిత్రగదాపరిఘంబులు శోభిల్ల, మండలప్రచారంబుల విహరించుటకు నారంభించిరి. అంత నేనును భగవంతుం డయినచక్రాయుధునిచే దేవరయొద్దకుఁ బంపఁబడితిని. మహానుభావుం డయినదేవకీనందనుండు మీతో నిట్లు మనవి చేయు మనియె. భీమసేనుం డపర్యుషితప్రతిజ్ఞుం డగుటయు దుర్యోధనుండు విచ్చ్వెము గ్గగుటయుఁ జూడ, మాకు మిక్కిలి విషాదంబు గలిగినది. ఇంక నిప్పుడో, భీమసేనుచేత సుయోధనుండు చిక్కినాఁడు గావున, నిష్కంటకం బయిన యీభూతలం బంతయు నీ వేలుకొమ్ము. అభ్యుదయోచితంబు లగునవరతమంగళసమారంభంబులు సమకట్టింపుము. సందేహము వలదు.

మ. తగ నింప న్వలె రత్నకుంభములు త్వద్రాజ్యాభిషేకార్థమై;
మిగులం బండువు సేయఁగా వలెను బేర్మిం ద్రౌపదీవేణికిన్ !
జగతిన్ క్షత్రితరుచ్ఛిదాపరశుభాస్వత్పాణి యారాముఁడున్,
మొగిఁ గ్రుద్ధుం డగుభీముఁడున్, సమరముం బూనంగ జం కేటికిన్ ?

ద్రౌప—త్రిభువననాధనాథుం డగుదేవుం డిట్టు లానతిచ్చుచుండ, మఱియొకలాగేల జరుగును ?

పాంచా—ఇది కేవల మయ్యసురాంతకునియాశీర్వచనము కాదు. ఆదేశమే.

యుధి—భగవంతుం డగునమ్మహాత్మునిసందేశమున నెవ్వఁడు సంశయించును? ఎవఁడురా అక్కడ ?

[కంచుకి ప్రవేశించుచున్నాఁడు.]

కంచు—దేవా ! ఆజ్ఞాపింపుఁడు.

యుధి—దేవకీనందనుం డయినదేవునిప్రసాదంబున, భీమునివిజయమంగళశంసార్థంబుగాఁ, దదుచితసమారంభముల సమకట్ట వలయును.

కంచు—చిత్తము దేవా ! (ఉత్సాహముతో నడచి) ఓహో ! సంవిధాతృపురస్సరు లగునంతఃపురద్వారికులారా! యథాప్రధానంబుగా మీ రందఱు వినుండు.

భుజబలపరిక్షేపోత్తీర్ణకౌరవపరిభవసాగరుండును, నిర్వ్యూఢదుర్ధరప్రతిజ్ఞాభరుఁడును, సుయోధనానుజశతోద్ధూననప్రభంజనుండును బ్రభంజనతనయుండును, బలవంతుండును, దుశ్శాసనోరస్స్థలవిదళననరసింహుండును, దుర్యోధనోరుస్తంభభంగవినిశ్చితవిజయుండును నగువృకోదరునికి, విజయమంగళంబుల సమకట్టవలయు నని, స్నేహపక్షపాతిమానసంబున నిదిగో! దేవరయుధిష్ఠిరమహారాజుగా రాజ్ఞాపించుచున్నారు.

(ఆకాశమందు)—ఏ మంటిరి? అంతట నధికతరముగా సమకట్టియున్నామే; నీవు చూడవా యేమి యనుచున్నారా?

కంచు — నాయనలారా! మేలుమేలు! చెప్పకయే మేలు చేయుట మనోగతంబయినస్వామిభక్తిని వెల్లడించును గదా!

యుధి—ఓయిజయంధర!

కంచు—దేవా! ఆజ్ఞాపింపుఁడు.

యుధి—నీవు పోయి, మాకు మేలువార్తను దెచ్చినయీపాంచాలకునిఁ బసదనంబులఁ బరితోషపెట్టుము.

కంచు—చిత్తము దేవా! (పాంచాలకునితో నిష్క్రమించుచున్నాఁడు.)

ద్రౌప—మహారాజా! హృదయేశుఁ డయినభీమసేనుఁడు మరల నద్దురాత్మునితోడ "మాయేవురయందు నిచ్చవచ్చినవానిని నేలుకొను" మని యెందునిమిత్తమనెను? ఒకవేళ వాఁడు మాద్రీసుతు లిద్దఱిలో నొకనిఁ గోరుకొని యాతనితో సమరంబు సేయఁ బూనిన, మహోపద్రవంబు సంభవిల్లును గదా?

యుధి—ద్రౌపదీ! ఆజరాసంధపరిపంథితాత్పర్య మిది; సకలబంధువులును, వీరభటులును జచ్చిపోయి, పదునొకం డక్షౌహిణులసేనలకుఁ, గృపకృతవర్మాశ్వత్థామలు మువ్వురు మాత్రమే మిగిలిరి; కావున, దుర్యోధనుం డిప్పుడు బంధురహితుండును, శరీరమాత్రవిభవుండునునయి, యున్నవాఁడు. అందుచేత నొకవేళ, నభిమానమును వదలిపెట్టి వీఁ డస్త్రసన్న్యాసము పుచ్చుకొనినను, దపోవనము ప్రవేశించినను, బితృముఖంబున సంధిని గోరినను, సకలరిపులను జయింతు నని, పూనినతనప్రతిజ్ఞ నెఱవేఱకుండు నని యెంచి, వానికిఁ గొంచె మాస పుట్ట, నట్లు వచియించెను. పాండవు లయిదుగురలో, నొకనితోడ నయిన యుద్ధము సేయుటకు, దుర్యోధనుఁడు చాలఁడు సుమీ. అయినను వృకోదరునకే వీనితోడ గదాయుద్ధము కావలయు నని నేను తలంచుచున్నాను. ఓసుక్షత్రియురాలా! చూడు.

మ. అలుకన్ బెన్గదఁ బూనుభీమునికి సత్యం బీ దైవం బాజిలోఁ;
బలరామోపముఁ డాసుయోధనుఁ డనిన్, బ్రాంచద్గదాకౌశలిన్;
గలుగున్ భద్రము ధార్తరాష్ట్రనళినీగంధేభుఁ డౌకుజ్జికున్;
దలఁతున్ భీమునికే సుయోధనునితోఁ; దర్కింప నే నొండ్లకున్. ౧౨

(తెరలో) ఓహో ! దప్పి గొంటిని. దప్పిగొంటిని. కొంచెము నీళ్ళను, నీడయు నిచ్చి నన్ను సంభావింప వలయును.

యుధి — (విని) ఓరీ ! యెవఁడురా అక్కడ ?

[కంచుకి ప్రవేశించుచున్నాఁడు.]

కంచు — దేవా ! ఆజ్ఞాపింపుఁడు.

యుధి — అ దేమో తెలిసికొని రా.

కంచు — చిత్తము దేవా ! (నిష్క్రమించి మరలఁ బ్రవేశించి)

కంచు — దేవా ! వడగొట్టి యొకయతిథి వచ్చియున్నాఁడు.

యుధి — శీఘ్రముగాఁ దీసికొని రా.

కంచు — చిత్తము దేవా ! (నిష్క్రమించుచున్నాఁడు.)

[తరువాత మునివేషధారి యయినచార్వాకుఁ డనెడురాక్షసుఁడు
ప్రవేశించుచున్నాఁడు.]

రాక్ష — (తనలో) నేను దుర్యోధనునిమిత్రుఁడ నయినందుకుఁ బాండవుల నెట్లయిన వంచింప వలయును. (ప్రకాశముగా) దప్పిగొంటిని దప్పిగొంటిని. కొంచెము నీళ్ళను నీడయు నిచ్చి నన్ను సంభావింప వలయును. (రాజును జేరుచున్నాఁడు) (అందఱు లేచి నిలువఁబడుచున్నారు.)

యుధి — మునీంద్రా ! నమస్కరించుచున్నాను.

రాక్ష — ఇది సముదాచారమునకు వేళ గాదు. కొంచెము జల మిచ్చి నన్ను సంభావింపుము.

యుధి — మునీంద్రా ! మీ రీయాసనమునఁ గూరుచుండుఁడు.

రాక్ష — (కూరుచుండి) మీరు కూడ మీమీస్థలములఁ గూరుచుండుఁడు.

యుధి — ఓరీ ! యెవఁడురా అక్కడ ?

[బంగారుగిండి చేతఁ బట్టుకొని కంచుకి ప్రవేశించుచున్నాఁడు.]

కంచు — దేవా ! ఇదిగోఁ ! జల్లనిపరిమళోదకముచేతఁ బూర్ణ మయిన భృంగారము. ఇది దాహము పుచ్చుకొనుటకుఁ బంచపాత్రము....

యుధి — మునీంద్రా ! నీరుపట్టు ను దీర్చుకొండి.

రాజు—(కాళ్ళు గడుగుకొని యాలోచించి) ఓహో! నీవు క్షత్రియుని లాగున నున్నావు.

యుధి—దేవరవారు చక్కగా నెఱింగితిరి; నేను క్షత్రియుండనే.

రాజు—ప్రతిదినము నూరక పోరాడుచు, స్వజనవినాశము చేసికొనెడు మీ నీళ్ళు మొదలగునవి, పరిగ్రహింపఁ గూడదు. కానీ, ఈనీడచేతను, సరస్వతీ నదిలోనితరంగములను స్పృశించి వీతెంచెడుచల్లగాలిచేతను, నేను శ్రమము దీర్చుకొనియెదను.

ద్రౌప—బుద్ధిమతికా! విసనకఱ్ఱతో మహర్షికి విసరవే.

చేటి—(అట్లు చేయుచున్నది.)

రాజు—పూజ్యురాలా! మాయెడల నిట్టియుపచారము లనుచితములుగదా!

యుధి—మునీంద్రా! మీ కెందుచేత నింతయలసట గలిగినది?

రాజు—ఓయీ! వటుజనసులభ మయినవేడుకచేతఁ, బూజ్యు లయిన క్షత్రియోత్తములద్వంద్వయుద్ధమును జూచుట కయి, శమంతపంచకమునఁ దిరుగుచుండి, యర్జునసుయోధనుల కగుగదాయుద్ధము నవలోకించి, బలవత్తర మయిన యాశరదాతపతీక్ష్ణ్యంబున కోర్వ లేక, యుద్ధము ముగియ కుండనే చక్కవచ్చితిని.

అందఱు—(విషాదమును బొందుచున్నారు.)

కంచు—మునీంద్రా! ఆలాగు కాదు. భీమసుయోధనుల కని చెప్పుఁడు.

రాజు—(అసూయతో) ఆ! సంగతి తెలియనివాఁడవు, నన్నెట్టు లాక్షేపించెదవు?

యుధి—మునీంద్రా! చెప్పుండి చెప్పుండి.

రాజు—క్షణమాత్రము విశ్రమించి నీ కంతయుఁ జెప్పెదను; కాని యీ ముసలివానికిఁ జెప్పను.

యుధి—చెప్పుండు. ఏమి? అర్జునసుయోధనులకే?

రాజు—అర్జునసుయోధనుల కగుగదాయుద్ధ మని నే నీ వఱకే చెప్పియుంటిని.

యుధి—భీమసుయోధనులకుఁ గాదా?

రాజు—అది యంతకు మునుపే జరిగి పోయినది.

[యుధిష్ఠిరుఁడును, ద్రౌపదియు మూర్ఛిల్లుచున్నారు.]

కంచు—(నీళ్లు చల్లి) దేవా! దేవీ! ఊఱడిల్లుఁడు.

చేటి—దేవీ! ఊఱడిల్లు మాఱడిల్లుము.

ఇద్దఱు—(తెలివిని బొందుచున్నారు.)

యుధి—మునీంద్రా! ఏమి చెప్పితిరి? భీమదుర్యోధనులకు గదాయుద్ధమంతకు మునుపే జరిగి పోయిన దేమి?

ద్రౌప—స్వామీ! ఏమో చెప్పండి అంతకు మునుపే జరిగి పోయినదా?

రాక్ష—కంచుకీ! వీ రిద్దఱు నెవరు?

కంచు—బ్రాహ్మణోత్తమా! ఈయన యుధిష్ఠిరమహారాజు. ఈమె ద్రౌపదీదేవి.

రాక్ష—హా! ఘాతుకుఁడనైన నేను దారుణమైనసంగతి నుపక్రమించితినిగదా!

ద్రౌప—హా! ప్రాణేశ్వరా! భీమసేన! (మూర్ఛిల్లు చున్నది.)

కంచు—ఇప్పుడు చెప్పిన దేమున్నది?

చేటి—దేవీ! ఊఱడిల్లు మూఱడిల్లుము.

యుధి—(కన్నీళ్లతో) బ్రాహ్మణోత్తమా!

తే. గీ. పదము సందిగ్ధముగ నుంటఁబట్టి, యిట్లు
తీవ్రదుఃఖంబుఁ బొందు యుధిష్ఠిరుండు;
భీమనిశ్చితవార్తను వినినపిదపఁ,
బ్రాణములఁ బాసి సౌఖ్యంబు పడఁగలండు. ౧౩

రాక్ష—(సంతోషముతోఁ దనలో) ఇదే నాప్రయత్నమును. (ప్రకాశముగా) ఆలాగయిన, నవశ్యము చెప్పవలసినసంగతులను, సంగ్రహముగాఁ జెప్పెదను. బంధువ్యసనమును విస్తరించి చెప్పి, మఱింతచింత కలిగింపఁ గూడదు.

యుధి—(కన్నీ రొలుకుచుండ)

తే. గీ. ప్రణతి గావింతు సరగఁ జెప్పంగదయ్య.
సంగ్రహంబుగనో సవిస్తరముగానో;
యనుజుఁడెస నేమి మూఁడెనో వినుట కేను,
సావధానత నుంటి, వాచంయమీంద్ర! ౧౪

రాక్ష—రాజా! వినుము.

ఉ. కరము గదాధ్వనుల్ నిగుడఁ, గౌరవభీములు పోరుచోటికిన్,

ద్రౌప—(హఠాత్తుగా లేచి) తరువాతఁ దరువాత?

రాక్ష—(తనలో) వీ రిద్దఱకు మరలఁ దెలివియున్నది రాకుండుటకు నే నేమి చేయుదును? (ప్రకాశముగా)

సరగ బలుండు రాఁ, గతనిసన్నిధిఁ బోరిరి చాలసేపు; పనం
తర మతిశిష్యవత్సలతఁ, దద్బలరాముఁడు సంజ్ఞసేయ, న
క్కురుపతి, దానికీ లెఱిఁగి, కూల్చె వృకోదరు నొక్కపెట్టునన్. ౧౫

యుధి—హా! తమ్ముఁడా! వృకోదరా! (మూర్ఛిల్లుచున్నాఁడు.)

ద్రౌప—హా! ప్రాణేశ్వరా! హా! భీమసేన! నాకుఁ గలిగినపరాభవమును సహింప లేక, నీజీవమును విడిచి పెట్టితివా? నాథా! హా! జటాసురబకహిడింబకిమ్మీరకీచకజరాసంధనిషూదన! హా! సౌగంధికాహరణచాటుకార! హా! పలుకవేమి? ప్రాణేశ్వరా! (మూర్ఛిల్లుచున్నది)

కంచు—(కన్నీళ్ళతో) హా! భీమసేనకుమార! హా! ధార్తరాష్ట్రకులకమలినీప్రాలేయవర్ష! మహారాజా! ఊఱడిల్లుము. బుద్ధిమతికా! దేవిగారి నూఱడింపవే. మునీంద్రా! మీరు కూడ మహారాజుగారి నూఱడింపుఁడు.

రాక్ష—(తనలో) ఆ! ప్రాణత్యాగము చేయ నూఱడించెదను. (ప్రకాశముగా) ఓయిభీమాగ్రజ! ఇంకను జెప్పవలసిన సంగతి యున్నది. ఒక్క క్షణ మూఱడిల్లుము.

యుధి—(మూర్ఛదేఱి) మునీంద్రా! ఇంకను జెప్ప వలసిన దున్నదా?

రాక్ష—అట్టు లానుకత్రియుండు నిహతుండై, వీరసులభం బైనపుణ్యగతిం బొందిన, భ్రాతృవధను జూచుటచేతఁ బొరలి పొరలి వచ్చుదుఃఖంబునఁ గన్నీరు కాలువలై పాఱ, నర్జునుండు, గాండీవంబు విడిచి పెట్టి, క్రొన్నెత్తుటం జొత్తిల్లి యున్న భీమునిగదను, బిగిసికొని పోయినయతనిచేతనుండి బలవంతముగా నూడఁదీసికొని, తన్నుఁ గృష్ణుండు సంధి సేయం దలంచి వారించుచున్నను, భ్రామితగదాఝుంకారమూర్ఛిత గంభీరవచనస్వనుం డై, చిఱునవ్వుతోఁ గౌరవేశ్వరుండు రా ర మ్మని పిలుచు చుంటం జేసి, నీమూఁడవసోదరుఁడు వెనుకదీయక, యాతనితోడ యుద్ధంబున కుపక్రమించెను. అప్పుడు మిక్కిలి లాఘవంబు గలిగిన యానుయోధనునిగదాఘాతంబున నివ్వచ్చుఁడు చచ్చునని కా నిశ్చయించి, బలరాముం డర్జునపక్షపాతి యయినకృష్ణుని బలవంతముగాఁ దనరథ మెక్కించుకొని, ద్వారకానగరంబునకుఁ గొంపోయెను.

యుధి—మేలు మే లర్జునా! గాండీవమును విడిచి పెట్టుటచేత, వెంటనే నీవు భీమునిమార్గమును బొందఁ గలవు. ఇఁక నే నేయుపాయమునఁ బ్రాణత్యాగ మహోత్సవము చేసికొఁ గలను?

ద్రౌప—హా! నాథా! భ్రాతృవత్సల! గదాయుద్ధమున నేర్పు చాలని నీతమ్ముఁడు, నీచేతిలోనిగదను బలవంతముగాఁ బుచ్చుకొని పగవాని కభిముఖముగాఁ బోవు చుండ, నీ వుపేక్షించుట యుక్త మగునా? (మూర్ఛిల్లుచున్నది.)

రాక్ష—తరువాత నేను—

యుధి—సరే..మునీంద్రా! ఆటుపయిని వినుట యెందుకు? హా! భీమసేన! హా! జతుగృహసముద్రితరణయానపాత్ర! హా! కిమ్మీరహిడింబాసురజరాసంధజయమల్ల! హా! కీచకసుయోధనానుజకమలినీమదకుంజర! హా! ద్యూతపణప్రణయి! హా! మామకశరీరస్థితిపరిఖేదశంకానిషూదన! హా! మదాజ్ఞాసంపాదక! హా! కౌరవవనదావానల!

ఉ. సుంతయు సిగ్గు లేకటులు జూదరి నైనపు డీవు భక్తిమై
దంతిసహస్రసత్వుఁడవు దాసుఁడ వైతివిగా! కృశించి; నీ
కంతకు నిప్పు డెక్కుడగు నాపదఁ జేసితినయ్య? తమ్ముఁడా!
యెంతయు దిక్కుమాలి విలపించెదున న్నెడఁబాపి తయ్యయో! ౧౬

ద్రౌప—(మూర్ఛ దెలిసి లేచి) మహారాజా! ఏ మయినది?

యుధి—ద్రౌపదీ! మఱే మున్నది?

మ. బకకిమ్మీరహిడింబసూదనుఁడు, దృప్యత్కీచకప్రాణఘా
తుకుఁడు, న్మాగధగంధసింధురభిదాదుర్వారనిర్ఘాతుఁడున్,
బ్రకటస్ఫారగదాగ్రదీర్ఘభుజుఁడు, న్నాతమ్ముఁడు, న్నీదునా
యకుఁ డోదుర్జయుఁ డర్జునాగ్రజుఁడు, కట్టా! యస్తమించెన్ గదా! ౧౭

ద్రౌ—(ఆకాశమునఁ జూపు నిలిపి) ప్రాణేశ్వరా! నీవు స్వయముగా నాకురులను ముడుతు నంటివి. వీరుఁ డయినక్షత్రియునకుఁ బలికిన దప్పుట యుక్తము గాదు; కావున నిదిగో! నేను వచ్చుచున్నా నుండుము. (వెండియు మూర్ఛిల్లుచున్నది)

యుధి—(ఆకాశమువంకఁ జూచి) అమ్మా! కుంతీ! విన్నావు గదా నీపుత్రునిసమాచారము! అనద నయి విలపించుచున్న న న్నొంటరిగా విడిచిపెట్టి, తా నెక్కడకో పోయినాఁడు తండ్రి! జరాసంధశత్రూ! నీ కింతలోనే నూఱేండ్లు నిండుటకు, నీయందులోకు లేమి వైపరీత్యము నాలోకించిరి? వారు గాదు. నేనే యనేకములు పోడ గాంచితిని.

చ. నృపు లరిగాఁపు లౌ వసుధ యెల్లను నా కిడి సిగ్గుగొంట, నేఁ
గపటపుజూదపుంబణముగా నిడ, నల్గక యొప్పుకొంట, నే
నెపుడు సుఖింప, నవ్విరటునింటను వంటలవాఁడ వౌట, తే
టపడఁజేసె, నీకు నాయెడ పకటా! కడు నల్ప [illegible] తమ్ముఁడా! ౧౮

మునీంద్రా! ఏ మన్నారు?

"చ. కరము గదాధ్వనుల్ నిగుడఁ గౌరవభీములు పోరుచోటికిన్,
సరగ బలుండు రా, నతనిసన్నిధిఁ బోరిరి చాలసే; పసం

తర మతిశిష్యవత్సలతఁ దద్బలరాముఁడు సంజ్ఞఁ జేయ, వ
క్కురుపతి దానికి లెఱిఁగి, కూల్చె వృకోదరు నొక్కపెట్టునన్." ౧౯.

రాక్ష—అవును. అది యాలాగే.

యుధి—ఛీ! నాయదృష్టము. (ఆకాశమువంకఁ జూచి) భగవానుఁడా! కామపాల! కృష్ణాగ్రజా! సుభద్రాభ్రాత!

మ. ఎద మేనత్తకుమారు లన్ప్రియము నీ కేది? నృపన్యాయమా
యది? నాతమ్మునితోడినీయనుజునెయ్యం బైన నూహింపవె;
ఇది యేమీ?ప్రియశిష్యు లిద్దఱును, నీ కీపక్షపాతంబు గూ
డదు; మాచో దయమాలి తేమనను? గట్టా! నేను నిర్భాగ్యుఁడన్. ౨౦

(ద్రౌపదిని జేరి) ఓపాంచాలీ! లేలెమ్మ. మన మిరువురమును సమానదుఃఖము గలవారమే. నీవు మాటిమాటికి మూర్ఛిల్లుచు, మీఁదుమిక్కిలి న న్నెల దహించెదవు.

ద్రౌప—(మూర్ఛదెలిసి) దుశ్శాసనుఁడు పట్టి యీడ్చుటచేత విడి పోయిన నాకేశపాశమును. దుర్యోధనరక్తమునఁ దడిసినచేతులతో, నానాథుఁడు ముడువ వలయును. చేటీ! బుద్ధిమతికా! నీయెదుటనే గదా నాథుఁడు ప్రతిజ్ఞ చేసెను? నాకు వేణీమహోత్సవంబు నారంభింప వలసిన దని దేవకీనందనుండును సందేశము పంపెను గదా? కావున నుత్ఫుల్లకుసుమగామంబులం గొని తెచ్చి, నావేణి నలంకరింపుము. భగవంతుం డగునవ్వరుషోత్తమునివచనప్రకార మాచరింపవే. ఆయనయాలోచన కల్ల గాఁగూడదుగదా! అయ్యో! శోకజ్వరంబున నే నిట్లు పలవరించెద నేల? ఇంకను గడుదూర మరుగనిప్రాణనాయకునే యనుగమించెదను. మహారాజా! నాకుఁ గాష్ఠములం బేర్చి. చితిని బ్రజ్వలింపం జేయుఁడు. మీరును క్షత్రియధర్మము ననుసరించి, నాథునిజీవిత మపహరించినశత్రువున కభిముఖు లయి పొండి.

యుధి—పాంచాలి బాగుగఁ జెప్పినది. కంచుకీ! దుఃఖమున మఱుఁగుచున్న యీద్రౌపదికిం జితిఁ బేర్చి యారాటం బుడుపుము. నాకును నజ్యం బయినవిల్లు తీసికొని రమ్ము. అయినను వి ల్లెందుకు?

తే. గీ. భ్రాతృవాత్సల్యమున గాండివంబు విడిచి,
ఆతని నెత్తుటఁ దడిసినయరుణగదను
గొనుచు నర్జునుఁ డరిగెఁ; గావునను నాకు
నదియ మే; లింకఁ జాలు జయాభిలాష. ౨౧.

రాక్ష—రాజా! నీచిత్తంబు రిపుజయవిముఖం బయినయెడల, నెక్కడనేని యొక్కడఁ బ్రాణపరిత్యాగము చేసికొనుము. వృథాగ నక్కడకుం బోవ నేల?

కంచు—(రోషముతో) ఛీ! మునిజనము పలుకఁ గూడనిరాక్షసోచ్చావచనమును వచించితివి.

రా—(తనలో) నన్ను వీఁడు తెలిసికొనెనాయేమి చెపుమా? (ప్రకాశముగా) ఓకంచుకీ! ఇదిగో నిటు వినుఁ. ఇప్పు డచట నర్జునసుయోధనులకు గదాయుద్ధము జరుగుచున్నదిగదా! గదాయుద్ధమున వా రిరువురభుజసారమునుగూడ నే నెఱుంగుదును. కావున నీవలె కేదుఃఖపడుచున్న యీరాజర్షికి, మరల నేమిదుర్వార్త వినవలసివచ్చునో యని, యిట్లు పలికితిని.

యుధి—(కన్నీరు విడుచుచు) మునీంద్రా! మేలుమేలు? నాకు హితము నెఱింగించితిరి.

కంచు—మహారాజా! దేవసమాను లగుదేవరవారు శోకాంధు లయి ప్రాకృతజనునివలె క్షాత్రధర్మమును బరిత్యజింతురా?

యుధి—అయ్యా! జయంధర!

తే. గీ. ఘనదహారిపురదర్పితోద్గాఢశౌర్య
పరిఘపీవరభుజభీమపార్థు లిపుడు,
పుడమిఁ బడి యుండ, వారి నుక్కడఁచి చెంత
శాత్రవుఁడు నిల్వఁ, జూడ నాశక్య మగునె? ౨౨.

ఓపాంచాలరాజపుత్రీ! నాదుర్నయంబునఁ గదా నీ కీదుర్దశ సంప్రాప్త మయినది. కానీ, ఎంతవేగముగా నగ్ని ప్రజ్వలించిన, నంతవేగముగా మనబంధుజనమును గలిసికొనఁగలము.

ద్రౌప—అయ్యా! చిదుగులం దెర్పుము, ఏమిది? మహారాజుగారివచనము నొక్కఁడైనను చేయకున్నాఁడు! హా! ప్రాణేశ్వరా! నీవు లేకుండుటను జేసి యిప్పుడు మహారాజు పరిజనులచేతఁ గూడఁ దిరస్కృతిని బొందుచున్నాఁడు.

రాక్ష—భరతవంశమునకోడండ్రి కిట్లు పత్యనుసరణము శ్లాఘనీయమే గదా!

యుధి—మునీంద్రా! మామాట నొకఁడును వినిపించుకొనకున్నాఁడు. మీరయిన నింధనప్రదానమున మమ్ముఁ గటాక్షింపుఁడు.

రాక్ష—రాజా! ఇది మునిజనవిరుద్ధము. (తనలో) నామనోరథములు పూర్ణముగా ఫలించినవి; కావున వీరికిఁ గనఁబడ కుండ నిక్కడనే యుండి, చిదుగుల ప్రోవును బ్రజ్వలింపఁ జేసెదను. (ప్రకాశముగా) రాజా! ఇట్టిచో మేము నిలుచుటకు శక్తులముగాము. (నిష్క్రమించుచున్నాఁడు.)

యుధి—ద్రౌపదీ! మనమాట యెవ్వడును విన కున్నాఁడు. కాని. నేనే స్వయముగా దారునంచయమును బోవు చేసి చితి నంటించెదను.

ద్రౌప—త్వరపడు మహారాజ!

[తెరలోపలఁ గలకలము.]

ద్రౌప—(భయముతో విని) మహారాజ ! ఇది యొకానొక తేజోబలదర్పితుని నిర్ఘోషమువలె వినఁబడుచున్నది. మరల నేదో యప్రియము వినవలసివచ్చును. అందుకే మన మాలస్యము చేయుచున్నాము,

యుధి—ఆలస్యము లేదు. లెమ్ము. (అందఱును నడచుచున్నారు.)

యుధి—ఓపాంచాలీ ! అమ్మగారికిని, నీసవతులకును, జెప్పవలసిన దేమో చెప్పి, నీపరిజనమును బంపివేయుము.

ద్రౌప—మహారాజా ! బకహిడింబకిమ్మీరజరాసంధజయమల్లుఁ డయిన మీ మధ్యమపుత్త్రుఁడు హతాశుచరాల నయిననాయందలిప్రేమచేతఁబరలోకమున కేగినాఁడని యత్తగారికి సందేశ మంపెదను.

యుధి—కల్యాణీ ! బుద్ధిమతికా ! అమ్మగారితో నాపలుకులుగా నిట్లు పలుకుము,

అ. వె. అంటుకొన్నలక్కయింట బిడ్డలు నీవు
 బైటఁబడితి రెవనిబాహుశక్తి,
 నట్టియూరుబలాఢ్యుఁ డైననీప్రియపుత్త్రి
 చావు నెట్లు వినుతు జననీ! నీకు?

ఓయిజయంధర ! నీవును సహదేవునొద్దకుంబోయి, పూజ్యునిఁ బాండుకులబృహస్పతిని బైమాత్రేయు నాతనిం గాంచి, సకలకురుకులకమలాకరదావానలుండగుయుధిష్ఠిరుండు పరలోకంబునకుంబోవుచుండి,యనుకూలునాశంసనీయునతిప్రాజ్ఞునాపత్సంపత్సమాన ధీరు ననుఁగుఁదమ్ముని నిన్ను బిగ్గఁ గౌఁగిలించుకొని, శిరము మూర్కొని, యిట్లు ప్రార్థించె నని చెప్పుము.

"ఉ. పిండ్లకుఁ జిన్న వయ్యు, నిజ మీవు సముండవు నాకుఁ దెల్వి; జ్యే
 ష్ఠుండను నేను సోదరతఁ; జూడ గురుండవు నీవు బుద్ధి, న
 ట్లుండుటఁ జేసి, మాశిఁ గరయుగ్మముఁ జేరిచి వేఁడుకొందు నిక్,
 గొండిక ! వీడు నాయెడలఁ గూర్మి; విదుర్పుము నీళ్ల దంత్రికిన్. ౨౮.

మతియుబాల్యంబున నాచేతఁ బెంపఁబడ్డవాఁడు, నిరతాభిమాని,మేరుసమానహృదయ సారుండు. నకులుండును, నామాటమీఁద నిలుపఁ దగినవాఁడు గావున, నాతనితోఁ గూడ నాపలుకులుగా నిట్లు పలుకుము. "వత్సా! నీవు మా మార్గ మనుసరింపఁ దగిన వాఁడవు గావు సుమీ.

మ. మము నీయన్నల నిద్దఱన్ మఱచి పొమ్మా తెల్విమైఁ; బాండువం
శము క్షీణించుడు, నశ్రుగర్భజల మిమ్మా; నీవు దాయాదగే
హమునం దైనను, యాదవాన్వయమునం దైన, న్మహారణ్యమ
ధ్యమునం దైన వసించి, ప్రోచుకొనవయ్యా నీయొడల్ తమ్ముఁడా!

జయంధర! నాతోడే నుమీ. ఈసమాచారము నీవు శీఘ్రముగాఁ బోయి చెప్ప వలయును.

ద్రౌపద—చేటి! బుద్ధిమతికా! నీవు ప్రియసఖి యయినసుభద్రయొద్దకుఁబోయి, నాపలుకుగా నిట్లు పలుకుము. "చెల్లెలా! మనకోడ లయినయుత్తరకు నిప్పుడు నాలుగవమాసము; కావున మనకులమును నిలువఁబెట్టఁదగినదానిగర్భమును నీవుబహు జాగ్రత్తతోఁ గాపాడ వలయును. పరలోకమునకుఁ బోయిన మేనమామలకును, మాకును గూడ, నెప్పు డయిన నీళ్లుముక్కలు విడిచి పెట్టుట కాధార మగు"నని.

యుధి—(కన్నీళ్లతో) హా! ఎంతకష్ట మెంతకష్టము!

ఉ. వారిఁ గొమ్మలన్ దెసలఁ బ్రాఁకి మహీతల మావరించియున్,
లావుగ మ్రాను గట్టి, విపులం బగుపాదున నున్నవృక్షమే
దైవవశంబునం గరము దగ్ధము గాఁగను, దానిమొక్కయం
దీ వడియాస నొందె దిది యిచ్చును నీడ యటంచుఁ గోమలీ! ౨౬

(కంచుకిని జూచి) అయ్యా! జయంధర! నామీఁద నొట్టుఁ బెట్టుకొన్నను నీవు వెళ్ళకున్నావు గదా!

కంచు—(రోదనము చేయుచు) హా! దేవా! పాండురాజా! నీకుమారు లయినయుధిష్ఠిరభీమార్జుననకులసహదేవుల కెంతదారుణ మయినయవస్థ సంభవించెను! హా! కుంతీదేవీ! భోజరాజభవనపతాక!

ఉ. అన్ననుగుండు నీకు, హరి కన్న, కిరీటికి బావ, కౌరవా
భ్యున్నతకంజకుంజరవృకోదరునగ్రజ, హలాయుధుం డరయో!
యెన్నక, యీజగంబునకు నెల్లను జల్లనినీడ నిచ్చునీ
కన్నకుమారు లన్నబలుగాన దహించెను, మత్తి వెత్త్రియో. ౨౭

(రోదనము చేయుచు నిష్క్రమించుచున్నాఁడు.)

యుధి—జయంధర! జయంధర!

[కంచుకి ప్రవేశించుచున్నాఁడు.]

కంచు—దేవా! ఆజ్ఞాపింపుఁడు.

యుధి—మీయదృష్టములు చూడ నీపాటివిగా నున్నవి; అయినను మరల నొకమాట చెప్పఁగోరుచున్నాను. ఒకవేళ మాతమ్ముఁ డర్జునుఁడే జయించెనేని, నీవా తనితో నాపలుకులుగా నిట్లు పలుకుము.

చ. అరయఁగ నాదుతమ్ముమృతి కాబలరాముఁడె హేతు వైన, నీ
పరమహితుండు కృష్ణునకుఁ బార్థుఁడ! యన్న గదా యతండు! తీ
వరపడఁ బోకుమీ యతనిపట్టున; నాపయి ప్రేమ వీడు; ని
ష్కారుణపుత్రశత్రుము స్మరలఁ గైకొన; కేగు మరణ్యసీమకున్. —ఇర

కంచు—చిత్తము. దేవా! (నిష్క్రమించుచున్నాఁడు)

యుధి—(అగ్నిని జూచి సంతోషముతో) ఓహో! నావంటిదుఃఖము గలజనులను, బ్రజ్వలించుచున్నతనశిఖ లనియెడుహస్తములచేతఁ బిలుచుచు, భగవానుఁ డయినహుతాశనుఁడు, చక్కఁగ వెలుంగుచున్నవాఁడు. కావున నాశరీర మిఁక నీయన కింధనముగా సమర్పించుకొనెదను.

ద్రౌప—మహారాజా! నాథునికి నాయం దధిక ప్రేమ గావున, ముందుగా నేను బోయెదను. ప్రసాదింపుఁడు.

యుధి—అట్లయిన నీమహోత్సవ మిరువురమును గలిసియే యనుభవింతము.

చేటి—ఓహో! లోకపాలురార! మీరయిన నడ్డుపడి వీరిని రక్షింపుఁడు. ఈయనచంద్రవంశపురాజర్షి, రాజసూయాధ్వరంబునహుతవహునిఁదృప్తిఁబొందించిన రాజ శ్రేష్ఠుఁడు, ఖాండవవనసంతర్పితహుతాశనుం డగునర్జునునకు జ్యేష్ఠభ్రాత, ప్రసిద్ధనామధేయుఁడు, యుధిష్ఠిరమహారాజు. ఈదేవి పాంచాలరాజకులదేవత, యజ్ఞవేదిమధ్యసముద్భవ, యాజ్ఞసేని; ఇట్టివీ రిద్దఱును విష్కారుణుఁ డయినయీకాలానలునకుఁ దమశరీరములను గట్టెపుడుకలనుగాఁ జేయుచున్నారు; అయ్యో! రక్షింపుఁడు రక్షింపుఁడు. (వారిముందఱఁ బడి) దేవా! దేవీ! ఏమి చేసెదరు?

యుధి—ఓసీ! బుద్ధిమతికా! ప్రాణసమానుఁ డయినతమ్ముఁడు, ప్రాణనాథుఁడును, బోయి నప్పుడు చేయఁ దగిన దేమో యది చేసెదము. కల్యాణి! లెమ్ము లెమ్ము. ఉదకమును దీసికొని రమ్ము.

చేటి—దేవా! చిత్తము (నిష్క్రమించి మరలఁ బ్రవేశించి) జయముజయము మహారాజా! ఇదిగో! జలపూర్ణ మయినభృంగారము.

యుధి—పాంచాలీ! నీవును నీయందుఁ బక్షపాతము గలభీమునికిని, బ్రియుఁ డయినయర్జునునికిని, శీఘ్రముగా నుదకక్రియ నాచరింపుము.

ద్రౌప—మహారాజా, మీరే యట్లు గావింపుఁడు. నే నగ్నిహోత్రమునఁ బ్రవేశించెదను,

యుధి—లోకాచార మతిక్రమింప రాదు గదా! బుద్ధిమతికా! ఉదక మిటు తే.

చేటి—(అట్లుచేయుచున్నది)

యుధి—(పాదప్రక్షాళనము చేసికొని యాచమించి ప్రాచీనావీతి యై దేవభాషతో) ఏష తావత్సలిలాంజలి ర్గాంగేయాయ భీష్మాయ గురవే, ప్రపితామహాయ శాంతనవాయ; అయ మపి పితామహాయ విచిత్రవీర్యాయ. (కంట నీరు పెట్టుకొని) తండ్రీ! ఇప్పుడు నీవంతు వచ్చినది. (మరల దేవభాషతో) అయ మపి తత్రభవతే స్వర్గస్థాయ గురవే సుగృహీతనామ్నే పిత్రే పాండవే.

ఆ. వె. తర్పణములు మీకుఁ దండ్రి! యింతటనుండి
యేను విడువ సంభవింప దెపుడుఁ;
గాన నిప్పు డేను గన్నీళ్లతో నిచ్చు
సలిల మంబతోడఁ గలిసి క్రోలు. ౨౯.

ఆ. వె. తండ్రి! జలజనయన! తమ్ముఁడా! భీమన్న!
యీజలంబు మనకు నిద్దఱకును;
దప్పిగొనిన నీవు త్రాగకుమీ ముందు;
నేను నిదిగో! క్షణములోనె వత్తు. ౩౦.

ఏమి నావెఱ్ఱి! యుద్ధములోఁ జచ్చుటచేత నుత్తమక్షత్రియులలోకమును బొంది యున్నావాతమ్ముని, నే నీవిధమునఁ బ్రాణత్యాగముఁ జేసికొని చూడఁ గలనా? చూడ లేను. తమ్ముఁడా! భీమసేన!

చ. కుడిచితి వీవు నేఁ గుడుచుకొన్నయనంతర మమ్మచన్ను; పే
ర్మిడిఁ గొనవైతి వన్నరసముల్ మును నేఁ గొనకుండ నెన్నఁడున్;
నడిపితి వన్న! యిట్టె సవనంబులయందును సోమపాన; మి
ప్పుడు తగునా నివాపజలముల్ మును ద్రావఁగ నీవు తమ్ముఁడా? ౩౧.

ద్రౌపదీ! పూజ్యుఁ డయినభీమునికి దోసెఁడునీళ్ళు విడిచి పెట్టుము.

ద్రౌప—చేటీ! బుద్ధిమతికా! ఉదక మిటు తే.

చేటి—(అట్లు చేయుచున్నది.)

ద్రౌప—(సమీపించి, దోసిలి నిండ నీళ్ళు పోసికొని) ఈనీళ్ళెవరికొఱకు విడిచి పెట్టుదును?

యుధి—ఆ. వె. కన్నతల్లి నిపుడు గాంధారితోడ స
మానదుఃఖురాలిఁ గా నొనర్చి,
స్వర్గమునకు నెవఁడు చనియెనో ముందుగా,
వానికొఱకు విడువ వలయు నెలఁది! ౩౨.

ద్రౌప—ప్రాణేశ్వరా! స్వర్గస్థుఁడవయిననీకుఁ బరిజనోపనీత మిది పాదోదకమయ్యెడును.

యుధి—ఓయర్జునాగ్రజ!

తే. గీ. ప్రతిన నెఱవేర్పకయె పరమగతికిఁ
బోయితివి గాన, దమ్ముఁడా! పాలఁతి నీకుఁ
దల విరియఁ బోసికొని జలాంజలి నొసంగుఁ,
గొలుకులను వేఁడికన్నీరు లొలుకుచుండ. 33.

ద్రౌప—లేలెందు మహారాజా! ఈపాటికి మీసోదరుఁడు చాల దూరము పోవును గదా!

యుధి—(కుడికన్నదరుట సూచించి) పాంచాలీ! భీముని ద్వారగఁ గలిసికొనియెద నని శకునములు నాకుఁ జెప్పుచున్నవి. కాని. శీఘ్రముగా నగ్నిని సమీపింతము.

ద్రౌప—అహో! భగవానుఁడు హుతాశనుఁ డెంతచక్కఁగా వెలుఁగుచున్నాఁడు.

[తెరలోఁ బెద్దకలకలము]

[తత్తఱపాటుతోఁ గంచుకి ప్రవేశించుచున్నాఁడు.]

కంచు—రక్షింపురక్షింపుమహారాజ! ఇదిగో! దురాత్ముఁ డయినదుర్యోధనుఁడు నెత్తుటితో స్నానము చేసి, రక్తాంబరుండును, రక్తాభిషేకభీషణగదాపాణియు నయి, యుద్ధతకాలదండుం డగుయముండునుం బోలెఁ బూజ్యురా లయిన పాంచాలి నిందు నందు వెదకుచు, నీలాగుననే వచ్చుచున్నాఁడు.

యుధి—హా! దైవమా! నీనిర్ణయము జరుగుచున్నది. హా! గాండీవధన్వీ!
(మూర్ఛిల్లుచున్నాఁడు.)

ద్రౌప—హా! ప్రాణేశ్వరా! మామకస్వయంవరస్వయంగ్రాహకుటుంబీ! ధనంజయ! నీప్రియసోదరునిఁ గలసికొని మహారాజును నన్నును విడిచి పెట్టితివిగదా నాథా! (మూర్ఛిల్లుచున్నది.)

కంచు—దేవా! ఊఱడిల్లు మూఱడిల్లుము

యుధి—(మూర్ఛ దేఱి) హా! వత్స! హా! సవ్యసాచీ! హా! త్రిద్ధత్రిలోచనాంగనిష్పేషసాహససద్భుజమల్ల! హా! నివాతకవచోద్ధరణ నిష్కంటకీకృతామరలోక! హా! బదర్యాశ్రమమునిద్వితీయతాపస! హా! ద్రోణాచార్యప్రియశిష్య! హా! అస్త్రశిక్షాబలపరితోషితగాంగేయ! హా! రాధేయకులకమలినీప్రాలేయసారశరనిచయ! హా! గంధర్వనిర్వాసితసుయోధన! హా! పాండవకులకమలినీ రాజహంస!

తే. గీ. అనుఁగుదల్లికి మ్రొక్కక, వినయమునను
గౌఁగిలించుక నాయాజ్ఞఁ గాంచ కకట!
యీస్వయంవరవధువు వీక్షింప కీవు
దవ్వుఁబయనంబు వోనేల? తమ్ముఁగుఱ్ఱ.

కంచు—అయ్యయ్యో! ఎంతకష్టము! దురాత్ముఁ డయినదుర్యోధనుఁడు విచ్చలవిడి నీలాగే వచ్చుచున్నాఁడు.

యుధి—అయినచో సర్వథా యిప్పు డిదే కాలోచిత మయిన ప్రతీకారము. బుద్ధిమతికా! పూజ్యురా లగునీపాంచాలిని జితియొద్దకుఁ దీసికొని పో. నేను నీ మె ననుసరించెదను.

చేటి—అయ్యో! రక్షింపుఁడు రక్షింపుఁడు.

కంచు—కల్యాణీ! నీ మొఱ్ఱ నకులసహదేవులకా? దేవిగారియన్న యగు దృష్టద్యుమ్నునకా? ఇపుడు వారికంటె మఱిరక్షకు లెవ్వరు? మహారాజావస్థ యీలా గుండెను. అయినభీమార్జును లిద్దఱు నస్తమించిరి.

[తెరలోఁ గలకలానంతరము.]

ఓహో! శమంతపంచకసంచారులార! రుధిరాస్వాదమత్తయక్షరాక్షసపిశాచభూతబేతాళకంకగృధ్రజంబుకోలూకవాయసభూయిష్ఠావశిష్టవీరళయోధులార! నన్నుఁ జూచి యడలి పోకుఁడు. ద్రౌపది యెక్కడ నున్నదో చెప్పుఁడు. ఇదిగో! నావాలుఁ గఁటి కానవాలు చెప్పుచున్నాను. వినుండు.

చ. కుఱు వొకచేతితోఁ జఱచుకొంచు సుయోధనుఁ డోరిఁ జూడ, నం
బర మొలువంబడెఁ; మఱియుఁ బల్విరలోపల దుస్ససేనుఁ డు
ద్ధురతను బట్టియీడ్చుటయు, దొయ్యలిముంగురు లన్ని దెగ్రెస్సె; నీ
వరుసఁ బరాభవంపడినపైదలి, యెక్కడ నుండుఁ జెప్పుఁడీ;

కంచు—ఓదేవీ! యాజ్ఞసేని! నీ వివ్వుడు గూడ ననాథ వయి కురుకుల కలంకునిచేతఁ బరాభవము నొందుచున్నావు గదా!

యుధి—(దిగ్గునలేచి)పాంచాలీ! జడియకు జడియకు. నాకు సజ్యం బయిన ధనువు దెప్పింపుము. దురాత్మా! దుర్యోధనహతక! రా. రా. నాబాణవర్షమున నీ గదాకౌశలసంభూతభుజబలపరాగ మణఁచి వేసెదను. ఓరీకురుకులాంగార!

తే. గీ. అలజరాసంధుఁ జంపినయట్టితమ్ము,
హరకిరాతుని గెలిచినయట్టితమ్ముఁ
దలఁచి, నీలాగు తాయి నై నిలువ నైన,
నిన్ను వధియింప నైనను, నేర నేను.

(తరువాత గదాపాణియు రక్తసిక్తాంగుఁడు నగుభీమసేనుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

భీము—(వడిగా నడచుచు) ఓహో! శమంతపంచకసంచారు లయిన సైనికులారా! ఏ మీతల్లడము?

శా. ఏ రక్కస్సను గాను, భూతమను గా; నేలా? మృతేభాశ్వవి
స్తారాంగంబులక్రింద దాఁగ? హతశేషక్ష్మాపులారా! ద్విష
చ్ఛారీరక్షతజాభిషిక్తతనుఁడన్, సంలంఘితోరుప్రతి
జ్ఞారత్నాకరుఁడైనక్షత్రియుఁడనే; శంకింప మీ కేటికిన్? ౨౯.

కంచు—దేవీ! పాండుస్నుషా! లెమ్ము లెమ్ము. ఇప్పుడు హతాత్మగాఁ జిచ్చుఱుకుటయే శ్రేయంబు.

ద్రౌప—(వెంటనే లేచి) నే నిప్పుడు గూడఁ జితిని సమీపింపకుందునా? (చితి కభిముఖి యయియున్నది.)

యుధి—యెవఁడురా అక్కడ? అమ్ములపొదియును విల్లును దీసికొనిరా. ఏమిది పరిజనుఁ డెవ్వఁడును లేఁడయ్యెనా? పోని. బాహుయుద్ధముచేతనే యీ దురాత్ముని గట్టిగ నాసందిటను బట్టి, మండుచున్న యీ యగ్నిహోత్రమునఁ బడ వేసెదను. [నడుముగట్టుచున్నాఁడు.]

కంచు—దేవీ! దుశ్శాసనాకర్షితంబు లయి, కన్నుల కడ్డు పడుచున్న నీకురులను, నీవే యిప్పుడు ముడుచుకొనుము. ప్రతీకారము నెడ నాస యింక వదలి పోయెను గదా! వేవేగఁ జితియొద్దకుఁ బోవలయును.

యుధి—వలదువలదు. దుర్యోధనహతకుఁడు చావకుండ, నీతలవెండ్రుకలు ముడువఁ గూడదు.

భీము—పాంచాలీ! నేను జీవించియుండఁగా, దుశ్శాసనుఁడు చిక్కుపఱిచిన నీకురులను నీ చేతులతో ముడుచుకో రాదు. ఉండు. నేను ముడిచెదను.

ద్రౌప—(భయపడి పరుగెత్తుచున్నది.)

భీము—నిలునిలు. భీరురాలా! ఇప్పు డెందుఁ బోయెదవు?

(కేశపాశమును బట్టుకొనఁ దలఁచుచున్నాఁడు.)

యుధి—(సత్తువకొలఁది భీముని సందిటం బట్టి) దురాత్మా! భీమార్జునవైరీ! దుర్యోధనహతక! ఇప్పుడు నీ వెందుఁ బోయెదవురా?

ఉ. చిన్నతనంబునుండియును జేసితి వెగ్గులు మాకుఁ; బ్రత్యహం
బు న్నిజబాహుదర్పమునఁ బొంగెదు; చంపితి రాజపుత్రులన్;
బన్నుగ నస్మదీయభుజపంజరమం దిటు చిక్కినావురా
చెన్నఁటి! యింక నీతరమె జీవముతో నడుగైనఁ బోవఁగన్? ౩౦

భీము—అహో! నన్ను దుర్యోధనుఁ డనుకొని కాఁబోలు, నీమహారాజు నాయెమ్ముకలు చూర్ణ మగునట్లు, నిర్దయముగాఁ గౌఁగిలించుకొను చున్నాఁడు. అన్నయ్యా! అనుగ్రహింపుఁ డనుగ్రహింపుఁడు.

కంచు—(పోల్చి చూచి సంతోషముతో) ఏమీ! భీమసేనకుమారుఁడా వాయనా! అదృష్టవశమున బ్రతికి వచ్చితివి. మహారాజ! ఇతఁ డాయుష్మం తుఁ డగుమనభీమసేనుఁడే సుండీ. దుర్యోధనరక్తముచేత నొడలును బట్టలును, దడి రొప్పబడుటచేత, రూపు మాఱి పోల్ప రాఁ డయ్యెను. ఇంకను శంకింపఁబలదు.

చేటి—(ద్రౌపదిని గాఁగిలించుకొని) దేవీ! ఇదిగోఁ! దనప్రతిజ్ఞను నెఱవేర్చు కొని వచ్చి, నీప్రాణనాథుఁడు నీకు వేణీసంహారమహోత్సవము సేయఁగోరి, నీకో ఱకు వెదకుచున్నాఁడు.

ద్రౌప—చేటీ! నన్నుఁ గల్లమాటలతో నూఱడించెదవా?

యుధి—జయంధర! నిజమే గదా? వీఁడు నావైరి యయినదుర్యోధనఘాతకుఁ గాఁడు గదా?

భీమ—దేవా! అజాతశత్రూ! భీమార్జునాగ్రజ! ఇంకను దుర్యోధనఘాతక డెక్కడ? నాచేతఁ బాంధవులపరిభావి యయినయాదురాత్ముని—

లయగ్రాహి. కాయ మిలఁ గూలెను నపాయమును బొందె; మఱియుఁ

బూయఁబడెఁ జందనముచాయ రుధిరంబుగ;
దోయధితుల్యపరిఖాయతధరాజయర
మాయుపతి నిల్చె భవదీయభుజపీఠిన్;
దోయములు సైనికనికాయములు నాఁడె మహా
నీయసమరాగ్ని శలభాయితము లయ్యెన్;
మీయునివపే రొకటియే యిపుడు దక్క మిగు
లేయదియు లే దరి కమేయమహిమాఢ్యా! 3

యుధి—(భీముని జూచుచుఁ గన్నీళ్లు దుడుచుకొనుచున్నాఁడు.)

భీమ—(కాళ్ళమీఁదఁ బడి) అన్నయ్యా! జయము జయము.

యుధి—తమ్ముఁడా! బాష్పజలపూరితలోచనుండ నయి, నీముఖచంద్రుని జూడలేక పోయితిని. అర్జునునితోఁ గూడ నీవు జీవించి యున్నావా? చెప్పుము.

భీమ—నిహతాశేషశత్రుపక్షు లయి దేవరవారు సుఖించి యుండఁగ భీమార్జునుల కేమి కొఱఁత?

యుధి—(మరలఁ బ్రేమతో గాఢాలింగనము చేసికొని)

చ. అరివధ యయ్యెనని మ్రొక్కుటు, రయంబున ముందిడి చెప్పవా, బకా
సురుఁ గడతేర్చినట్టిప్రియసోదరుఁ డైనవృకోదరుండవే?

భీమ—అవు నన్నయ్యా! నేనే.

యుధి—
కరమును నోలలాడితివిగా! మును మాగధుపీనవక్షమ్ము
సరసునఁ జల్లు లాడుచును సంభరితక్షతజాంబుమండలిన్.   ౮౦.

భీము—అవు నన్నయ్యా! మీ రొక్క క్షణము నన్ను విడిచి పెట్టుఁడు.

యుధి— ఇంకను వశిష్ట మేమి?

భీము—అన్నయ్యా! గొప్పయవశిష్టమే యున్నది! ఇదిగో! దుర్యోధన దుశ్శాసనులరక్తము చేతఁ దడిసినయీచేతులతోడ, దుశ్శాసనాకృష్టము లగు పాంచాలీకురులు ముడిఁచి వచ్చెదను.

యుధి—అటు లయిన శీఘ్రముగా నరుగుము దీనురాలయినద్రౌపది వేణీసంహారమహోత్సవ మనుభవించుఁ గాక.

భీము—పూజ్యురాలా! ద్రౌపదీ! అదృష్టవశంబున రిపుకులక్షయంబయ్యెఁ గావున, నీ వింక సుఖం బుండుము.

ద్రౌప—(సమీపించి) నాథా! జయ మవుఁగాక! జయ మవుఁగాక!

(భయముచే వెనుదీయుచున్నది.)

భీము—రాజపుత్రీ! నన్నుఁ జూచి భయపడియెద వేమి? ఇదిగో నిది—!

ఉ. ఏవ్రపశుండు రాజసభ నీడ్చెనో ముందలఁ బట్టి నిన్ను, నా
హీనునిశోణితంబు; స్పృశియింపుము చేతుల నంటెఁ ద్రౌగురోఁ;
జానరో! కౌరవేశుక్షతజం బిది; మద్గదఁ జూర్ణితోరువుం
గా నొనరించి, మై నలఁదఁ గంటెఁ, బరాభవవహ్ని యాఱఁగన్.   ౮౩.

బుద్ధిమతికా! పాండవదార నపహసించినభానుమతి యిప్పు డెక్కడ నున్నదే? కానీ. వేదిసంభవులారా! యాజ్ఞసేనీ!

ద్రౌప—ప్రాణేశ్వరా! ఆజ్ఞాపింపుము.

భీము—నాఁడు నే నన్నయీమాట తలంపునకు వచ్చినదా?

చ, బిఱబిఱఁ ద్రిప్పుకొంచు గద; బిట్టు సుయోధనుఁ గిట్టి, పెందొడల్
విఱుగఁగఁ గొట్టి, చేతులను వెచ్చనినెత్తుట నద్ది, నీకురుల్
మెఱుఁ గిడి, భీమసేనుఁ డవలీలను జిక్కఁ దలించి కూర్చెడున్;
గొఱకొఱ యేల? దేవి! యిదిగో! ముద మందెను చూడు నీమదిన్.''

(ఈపూర్వోక్తపద్యమును జదువుచున్నాఁడు)

ద్రౌప—ప్రాణేశ్వరా! తలఁపునకే కాదు, అనుభవమునకును వచ్చినది.

భీము—(ఆమెవేణిని ముడుఁచుచు) దేవీ! దుశ్శాసనవిలులితంబయి ధార్తరాష్ట్రులరాత్రి యయినవేణి, నింక నీవు ముడుఁచుకొనుము.

దాసి—నాథా! ఈవ్యాపారము నాకీవఱలో వలవాటు దప్పెను. ఇంక భవదీయప్రసాదంబున మరల నేర్చుకొనవలెను.

చేటి—(వేణిని ముడుచుచున్నది.)

మహాస్రగ్ధర. కురునాథుల్ క్రుద్ధచిత్తుల్ గురుభుజబలులౌ కుంతిపుత్రుల్, నృపాంతః
పురముల్ నిర్ముక్తకేశంబులుగ సలుప యనోౢత్తమే మూల మా౯ద
ద్వరికృష్ణావేణి, క్రోధోద్ధతయమసఖము౯, ధార్తరాష్ట్రాంతకంబు౯
బరిబద్ధబం య్యెఁ; జావుల్ ప్రజలకుడిగెడు౯, స్వస్తియా౯ండ్లకెల్ల౯.

యుధి—దేవీ! ఇదిగో! అంతరిక్షసంచారు లగుసిద్ధజనంబులు నీవేణీసంహార మహోత్సవంబునకు సంతసించుచున్నారు.

[తరువాతఁ గృష్ణాను పనివేశించుచున్నారు]

కృష్ణ—విజయతామ్ నిహతసకలారాతిమండల స్సానుజః పాండవకులచంద్రమా మహారాజో యుధిష్ఠిరః.

అర్జు—విజయతా మార్యః

యుధి—(చూచి) ఓహో! భగవంతుఁడు పుండరీకాక్షుఁడును, జిరంజీవి యర్జునుఁడు నా? (కృష్ణుని) దేవా! నమస్కరించుచున్నాను. (అర్జునుని) తమ్ముఁడా! ఇటు నన్ను గట్టిగాఁ గౌఁగిలించుకో.

అర్జు—(నమస్కరించుచున్నాఁడు)

యుధి—(కృష్ణునితో) దేవా! భగవంతుండును బురాణపురుషుండును నగు న్నారాయణుండు స్వయముగా మంగళములను గోరువానికి విజయము గాక మఱి యేమి యగును?

రుమహదాదివృత్తి నొనగూడినరూపమువాని, సృష్టిసం
రణవినాశహేతు వగువానిని, బుట్టువు లేనివాని, ని
ర్జరుని, నచింత్యునిం, గుణపరాజితు, నిన్నుఁ దలంచునంతనే,
నరులకు దుఃఖముల్ దొలఁగు నాఁ, గనువారికిఁ జెప్ప నేటికి౯? ౮౩.

(అర్జునుఁ గౌఁగిలించుకొని) వత్సా! నన్నుఁ గౌఁగిలించుకో.

అర్జు—(గౌఁగిలించుకొనుచున్నాఁడు)

కృష్ణ—ఇదిగో! మహాత్ము లయినవ్యాసవాల్మీకిజామదగ్న్యజాబాలిప్రభృతి మహర్షులు కల్పితాశేషమంగళసమారంభు లయి వచ్చి యున్నారు. మఱియు నకుల సహదేవధృష్టద్యుమ్న సాత్యకిప్రముఖసేనానాయకులును, స్కంధోత్తంభిత తీర్థవారి కలశు లయి, మీయభిషేకమును గోరుచున్నవారు. నేను జార్వాకుఁడు మిమ్ము

వంచించుటవ్యాసమహర్షివలనఁ దెలిసికొని, యతిత్వరితముగా నర్జునునితో భవత్సకాశమునకుఁ జనుదెంచితిని.

యుధి—ఏమీ? మమ్ముఁ జార్వాకుఁడు మోసపుచ్చెనా? (కోపముతో) దుర్యోధనసఖుఁడు వాఁ డెక్కడ నున్నాఁడు? ఆరాక్షసాధముఁడు నాచిత్తముచాల నుత్తలపఱిచెను.

కృష్ణ—ఆదురాత్ముఁడు నకులునిచేతఁ జిక్కినాఁడు. మహారాజా! నీ కింత కంటెఁ గోరఁ దగినది యేమున్నదో చెప్పుము.

యుధి—భగవంతుఁ డగుదేవర ప్రసన్నత నొందిన, నీయరాని దేమి గలదు, మానవమాత్రుఁ డనుబుద్ధితో నీతోఁ గ్రీడ లాడుచుంటిని. నాకింతకంటెఁ గోరఁదగిన దేమున్నది? దేవా! చూడుము.

ఉ. చెక్కుడెమర్ప దేవురకుఁ; జెండితి మొంటనివారిఁ; గృష్ణయుం
దక్కక నాదుదుర్నయమునం బడి దాఁటెఁ బరాభవాంబుధిన్;
మక్కువ మాట లాడెద వనంత! కృతార్థుఁడఁ గానె నేను? ని
న్నక్కటితోడఁ గోర, నిఁక నన్యము లుండు నటయ్య కోరికల్? ౪౪

అయినను దేవా! నీవు ప్రసన్నుండ వయితివి గాన నిట్లగుఁగాక.

మానిని. లోకులు దీనత లేక శతాబ్దములుం బ్రదుక న్వలె సౌఖ్యమునన్;
ప్రాకటతాపకథ క్షితియు నద్వయభంగి లభింప వలె; న్నఘహారీ!
లోకహితుండును, బండితబాంధవుఁడున్, గుణభూరివివేకుఁడు, న
స్తోకశుభంకరుఁ డేచును రాజు, వసుంధర నెమ్మది నేల వలెన్.

కృష్ణ—తథాస్తు! (అందఱు నిష్క్రమించుచున్నారు.)

గద్యము. ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదలబ్ధసరసకవితాధురంధర వడ్డాది
సాధువంశక్షీరనీరాకరరాకాసుధాకర రాచ్చనామాత్యపౌత్ర హరి
తసగోత్రపవిత్రగుణకదంబలక్ష్మాంబాగర్భశుక్తిముక్తాఫల
సూరపరాజప్రధానతనూభవ విబుధవిధేయ సుబ్బ
రాయనామధేయాంధ్రీకృత వేణీసంహార
నాటకంబునందు సర్వంబును,
షష్ఠాంకము,
సంపూర్ణము.

రెండవకూర్పు. చక్కనిఅచ్చు:

ఇది కాళిదాసమహాకవివిరచితమునకుఁ దెలుఁగు. అప్సరస యగు నూర్వశిని రాక్షసుఁ డొకరుఁ డపహరించి యంతరిక్షమార్గమునఁ గొనిపోవుచుండఁగా, నామెతోడిచెలికత్తెల మొఱ్ఱ విని యాకాశగమనమునఁ బ్రావీణ్యముగలపురూరవశ్చక్రవర్తి యారక్కసు నుక్కడంచి యామెను విడిపించిన కారణమునఁ బరస్పరానురాగ మంకురించి వారిరువురును వివాహము చేసికొనిరి. ఈవిషయమే బహువిధచమత్కారములు గలుగునట్లుగా రసపోషణము చేసి యైదంకముల నాటకముగాఁ గవి రచియించినాఁడు. శృంగారరసప్రధాన మయినట్టి యీ నాటకమునందలి భావములు మిక్కిలి పేశలములు. రసగ్రహణలాలసులకిది యవశ్యము పఠనీయము. ఏతన్నాటకమునందలి పద్యములు మచ్చునకిట నొకటి రెండు చూపఁబడుచున్నవి.

దీనివెల రు. 0—8—0 అణాలు మాత్రమే!

ఉ. అందనిమ్రానిపండునకు నఱ్ఱు నిగుడ్చుచుఁ ద్రిప్ప రానినా
డెందముఁ గొండలంపడిచెడెన్ మునుపే విషమాస్త్రుఁ; డిప్పుడే
మందునె? మందమందమలయానిలపాతితపాండుపత్రమా
కందము లిందుఁ బ్రేఁదొడిమగంటులఁ జూపెడు నంకురావళుల్.

తే. గీ. స్యందనక్షోభమునఁ జేసి యిందువదన
యంస మంసముతోడ రాపాడెఁ గానఁ
దలఁప నీభుజ మొక్కటే ధన్య; మితర
మైనమే నెల్ల భూమికి నతిభరంబు॥ తృతీయాంకము.

ఉ. తొలకరినీలమేఘ మిది, దుష్టనిశాటుఁడు గాఁడు; దాన ను
జ్జ్వల మగునింద్రచాప మిది, సజ్యము దానవువిల్లు గాదు; కే
వలమును వర్షధార లివి, బాణపరంపర గాదు; పైఁడిగీ
టిలఁ దలఁపించుమిం చిది హృదీశ్వరి యూర్వశి గాదు రూఢిగా॥ చ. అం.

చ. కొడుకుమొగంబుఁ జూచి మదిఁ గుందక యూఱటఁ జెందియుండఁగా
బడఁతుక నీ వియోగ మనివార్యత నిప్పుడ సంభవించెఁగా
మిడిమిడిగ్రీష్మతాపము శమింప నవాంబునవృష్టిఁ గాంచి యొ
ప్పెడుతఱిఁ జెట్టుపైఁ బిడుగు భీకరభంగిని బడ్డకైవడిన్. పం. అం

[illegible]వారు గ్రంథకర్తగారి కిట్లు వ్రాసికొనుడు:—

వడ్డాది సుబ్బారాయకవిగారు
రాజకీయకళాశాలాంధ్రపండితులు, రాజమహేంద్రవరము